అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 4-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 7 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ముందస్తుకే సిద్ధం కండి !

నవంబర్, డిసెంబర్‌లోనే ఉండొచ్చు

- టీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలకు అధినేత సంకేతాలు?
- ముఖ్యమైన ఉన్నతాధికారుల తోనూ సమాలోచనలు
- రాష్ట్రంలో పార్టీకి అనుకూల పవనాలున్నాయన్న అభిప్రాయం
- అభివృద్ధి పనులు డిసెంబర్ లోపు పూర్తి చేయాలి
- అనుకూలమైన వారికి ఎక్కువ ప్రాధాన్యత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముందస్తు ఎన్నికలకే టీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. లోక్‌సభతో గాకుండా వేరుగానే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నారని విశ్వసనీయ సమాచారం. ఇప్పుడు ప్రజల్లో పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న ఆదరణను అనుకూలంగా మలచుకోవాలంటే ముందస్తు ఎన్నికలకు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెండింగ్‌లో ఉన్న పథకాలను నెలకొకటి ...9లో



మహా బంద్

దళితాగ్రహంతో స్తంభించిన మహారాష్ట్ర

- హిందూత్వశక్తులకు వ్యతిరేకంగా నిరసనల జ్వాల
- ఎక్కడికక్కడే నిలిచిన రవాణా
- స్కూళ్లు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు మూసివేత
- ఔరంగబాద్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత
- బంద్ సక్సెస్ : అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్

వివరాలు 9లో



థానేలో...






ముంబయిలో.. సీఎస్టీ స్టేషన్

పార్లమెంట్‌లో 'భీమా-కోరేగావ్' ప్రకంపనలు

ఉభయసభల్లో విపక్షాల ఆందోళన

- ప్రధాని సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్



10

రూ. 10 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలం : మంత్రి పోచారం

వివరాలు 9లో

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి..

- కేంద్రమంత్రులకు మంత్రి జోగురామన్న వినతి
- మేడారం జాతరకు రావాలని ఉపరాష్ట్రపతికి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం

వివరాలు 9లో

గంగిరెద్దులోళ్లు బిక్షగాళ్లు కాదు

- వారిపై వేధింపులు ఆపాలి: ఎంబీసీ సంఘం
- హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ వద్ద ధర్నా
- మానవత్వంతో వ్యవహరించాలి: కేటీఆర్

నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

గంగిరెద్దులను ఆడించే వాళ్లను బిక్షగాళ్లుగా పరిగణించి అరెస్టు చేయడం తగదని, వారిపై జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారుల వేధింపులు ఆపాలని టీమాస్ ఫోరం హైదరాబాద్ నగర నాయకులు ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎంబీసీ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. గంగిరెద్దులను ఆడిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా గంగిరెద్దులను ఆడించడం తెలంగాణ సంస్కృతి సంప్రదాయమని అన్నారు. గంగిరెద్దులను ఆడించుకుని జీవనం సాగిస్తున్న వారిని అరెస్టు చేసి చంచల్‌గూడ, చెర్లపల్లి జైళ్లకు తరలించడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. 1977చట్టం ప్రకారం పబ్లిక్ ప్రదేశంలో బిక్షాటన చేయడం నేరంగా పరిగణిస్తుందే తప్ప గంగిరెద్దులను ...9లో



(ఫైల్)

తెలంగాణ మైనార్టీ కమిషన్ ఏర్పాటు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మైనార్టీ కమిషన్ ఏర్పాటయింది. దానికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. కమిషన్ చైర్మెన్‌గా మహ్మద్ కమరుద్దీన్, వైస్ చైర్మెన్‌గా రాజారపు ప్రతాప్ నియమితులయ్యారు. సభ్యులుగా మహ్మద్ అర్షద్‌అలీఖాన్, విద్యా స్రవంతి, గస్టీ నోరియా, బొమ్మల కట్టయ్య, సురేందర్ సింగ్ నియమితులయ్యారు. కమిషన్ చైర్మన్, సభ్యులు మూడేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.



బతుకుదెరువుకొచ్చి బలైపోయారు

- రోడ్డుప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు




వివరాలు 10లో

రాబోయే ఎనిమిది నెలలు కీలకం

- సీఎం నమ్మకాన్ని నిలబెట్టాలి :మంత్రి హరీశ్‌రావు



వివరాలు 9లో



మాతో పెట్టుకుంటే...





(ఫైల్)

- ఐఏఎస్‌ల బదిలీల్లో అధికారానిదే పైచేయి
- నేతలు ఫిర్యాదు చేసిన వారికి స్థాన చలనం
- పలువురు సమర్థులకు అప్రధాన పోస్టులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తమతో పెట్టుకుంటే ఏమి జరుగుతుందో అధికార పార్టీ నేతలు మరో సారి రుజువు చేశారు. ఇద్దరు ఎమ్మెల్యేలపై తీవ్ర ఆరోపణలు చేసిన మహిళా కలెక్టర్లకు సర్కార్ బదిలీ షాక్ ఇచ్చింది. మంగళవారం జరిగిన ఐఏఎస్ బదిలీలు రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని ఒక కుదుపు కుదిపాయి. 29 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం జరగ్గా వీరిలో పలువురు సీనియర్లను అప్రాధాన్యతా పోస్టుల్లో నియమించటం చర్చనీయాంశమైంది. ఈ బదిలీల్లో పూర్తిగా హేతుబద్ధత లోపించిందనే విమర్శలు వినవస్తున్నాయి. జనగామ కలెక్టర్ దేవసేన అధికార పార్టీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే చెరువు ...9లో



మీకు నూతన సంవత్సర వేడుకలేంటి?

- ఉత్సవాలు జరుపుకున్నందుకు దళితులపై అగ్రవర్ణాల దాడి
- తమిళనాడులో ఘటన

చెన్నై : దళితులపై దాడికి నిరసనగా ఒకపక్క మహారాష్ట్ర మండుతోంది. మరోవైపు తమిళనాడులో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నందుకు దళితులపై అగ్రవర్ణాలవారు దాడికి పాల్పడిన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిఇండ్లను ధ్వం సం చేయడంతో పాటు, పలువురిని తీవ్రంగా కొట్టా రు. తంజావూర్ జిల్లా కుడికాడులో ఈఘటన చోటు చేసుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా భారీగా పోలీసులను మోహరించారు. అంబాలపట్టు దక్షిణ గ్రామంలో దళిత యువకులు కొందరు నూతన సంవత్స రాన్ని పురస్కరించుకొని మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసుకున్నారు. లైట్లతో ఆ ప్రాంతాన్ని అలంకరించుకు న్నారు. వారి ఉత్సవాలకు గుర్తుగా గ్రామ ప్రవేశ ద్వారానికి బెలూన్లు, రంగు కాగితాలు కట్టారు. వారి ఆనందం హద్దులు దాటింది. ఒంటి గంట సమయం లో ఈ వేడుకలు తారా స్థాయికి చేరాయి. ఆ సమ యంలో అంబలపట్టు ఉత్తర గ్రామానికి చెందిన అగ్ర కులాలవారు దాడికి దిగారు. గ్రామ ప్రవేశద్వారం దళితుల అలంకరణలను చిందరవందర చేశారు. దీనిని దళిత యువకులు ప్రశ్నించగా, వారిపై దాడికి తెగబడ్డారు. వారిని తీవ్రంగా కొట్టడం ప్రారంభించా రు. భయంతో వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు పెట్టారు. వారంతా పారిపో వడంతో దళితుల ఇండ్లపై దాడి చేశారు. దాదాపు 15 ఇండ్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తంజావూర్ పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

'తాజ్' సందర్శనపై ఆంక్షలు

- రోజుకు 40 వేల మంది స్వదేశీయులకు మాత్రమే అవకాశం

న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ సందర్శనపై ఆంక్షలు విధించారు. ఇకనుంచి రోజుకు 40వేల మంది స్వదేశీయులను మాత్రమే అనుమ తించనున్నారు. విదేశీ యాత్రికుల విషయంలో ఎలాంటి ఆంక్షలూలేవు. ఈమేరకు ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ), పార్లమెంటరీ, ఇతరఉన్నతాధికారులు మంగళవారం సమావేశమై నిర్ణయం తీసుకు న్నారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సమావేశం ముగిసిన తర్వాత కేంద్ర పర్యాటక శాఖ మంత్రి మహేశ్ శర్మకు తెలియజేశారు. ఆగ్రాలోని తాజ్‌మహల్ ను ఇంతకుముందు ఎంతమందైనా సందర్శించేందుకు అవకాశం ఉండే ది. అయితే.. నిర్వహణ విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులతో అధికారు లు పర్యాటకుల సందర్శనపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. తాజ్‌మహల్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశం కోసం వసూలు చేస్తున్న రుసుముపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. స్వదేశీయుల విషయంలో.. 15 ఏండ్లలోపు వయస్సున్న వారికి ఎలాంటి రుసుమూ విధించరాదని, ఆపై వారికి రూ.50 ఉంటుందని అధికారులు తెలిపారు. విదేశీయులకు రూ.1000 టిక్కెట్ ధర నిర్ణయించారు. స్వదేశీ పర్యాటకులను రెండు విడుతల్లో(20 వేల మంది చొప్పున) తాజ్‌మహల్ కాంప్లెక్‌లోకి పంపించనున్నారు. 40 వేల మంది పూర్తయిన తర్వాత టిక్కెట్ల జారీ నిలిపివేస్తారు. ఒకవేళ టిక్కెట్ల జారీ నిలిపివేసిన తర్వాత స్వదేశీయులు ఎవరైనా తాజ్‌మహల్‌ను సందర్శించాలంటే రూ.1000 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు అవకాశముంటుంది.


భారతదేశం హిందువులదే

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముజఫర్‌నగర్ : బీజేపీ గుజరాత్ ఎమ్మెల్యే విక్రం సైనీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందుస్తాన్‌గా పిలువబడే భారతదేశం కేవలం హిందువులదేనన్నారు. కొంతమంది 'బాధ్యతారహిత నాయకులు' ముస్లింలను దేశంలో నివసించేందుకు అనుమతించారని తెలిపారు. 'ముస్లింల కారణంగా హిందువులు దేశంలో పలు సమస్యలనెదుర్కొంటు న్నారు. దేశవిభజన సమయంలో ముస్లింలందరూ వెళ్ళిపోయి ఉంటే.. కోట్లాది రూపాయల ఆస్తులు హిందువుల సొంతమయ్యేవి' అని సైనీ అన్నారు. సైనీకి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కొత్తేమీ కాదు. గోవులను వధించిన వారిని చంపేయాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2013 ముజఫర్‌నగర్ అల్లర్ల కేసులో ఈయన



నిందితుడు. జాతీయ భద్రతా చట్టం కింద అప్పట్లో సైనీని అదుపులోకి తీసుకున్నారు.



ట్రిపుల్ తలాక్‌పై 'పెద్ద' రగడ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ట్రిపుల్ తలాక్ బిల్లు పెద్దల సభలో తుపాను సృష్టించింది. అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలు, విమర్శలు, నినాదాలతో సభ అట్టుడికింది. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించాలని ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌తో సహా విప క్షాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు సవరణ ప్రతిపాదిస్తూ కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఆ తీర్మానం చెల్లుబాటుకాదని రాజ్యసభాపక్ష నేత అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. కనీసం ఒక రోజు ముందుగా సభకు నోటీసు ఇవ్వాలని, కాబట్టి దీన్ని పరిగణనలోకి తీసుకోవద్దని సూచించారు. అయితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుబట్టింది. ఊహించని పరిణామంతో ఖంగుతిన్న బీజేపీ... ఆందోళన ఉధృతి పెంచింది. అధికారపక్ష సభ్యులే సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభ గురువారానికి వాయిదా పడింది.

విపక్షాల ఆందోళనల నడుమ కేంద్ర న్యాయశాఖమంత్రి రవిశంకర్ ప్రసాద్.. ముస్లిం మహిళ(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. మహారాష్ట్రలోని భీమా-కోరేగావ్ ఘటనపై కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో గురువారం ఆందోళన చేపట్టింది. ఈ ఆందోళనపై సభ మధ్యాహ్నం మూడు గంటల వరకు మూడు సార్లు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ కాంగ్రెస్ సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ముస్లిం మహిళ(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ... ఉద్దేశపూర్వకంగానే ట్రిపుల్ తలాక్ బిల్లును కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదానికి సహకరించినట్టుగా.. రాజ్యసభలోనూ సహకరించాలని కోరారు. పైగా లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందినప్పటికీ ముస్లింలు ట్రిపుల్‌తలాక్ పద్ధతిని పాటిస్తున్నారని ఉదహరించారు. రవిశంకర్ ప్రసాద్ బిల్లు ఆమోదించిన తరువాత.. ఆ బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించాలనే సవరణ ప్రతిపాదిస్తూ కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ ఓ తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఆ సవరణను పరిగణలోకి తీసుకోవద్దని సభాపక్ష నేత జైట్లీ కోరారు. నోటీసును 24 గంటల ముందుగా ఇవ్వాలని, కానీ కాంగ్రెస్ నేతలు హఠాత్తుగా సవరణ ప్రతిపాదిస్తూ నోటీసు ప్రతిని ఇప్పుడే అందించారని అన్నారు. అలాగే సెలక్ట్ కమిటీకి బిల్లును నివేదించలేమని జైట్లీ చెప్పారు. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీంకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తులు సరైందికాదని పేర్కొంటూ.. తమకున్న అధికారాలతో ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారని, ఆ గడువు ఫిబ్రవరి 22తో ముగియనుందని చెప్పారు. ఈ సమయంలో కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ జోక్యం చేసుకున్నారు. జైట్లీ చెప్పింది మైనార్టీ జడ్జిమెంట్ అని వివరించారు. ఇక ట్రిపుల్ తలాక్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంటుందన్న మంత్రుల వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ తప్పుపట్టారు. ఈ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, ఎలాంటి లొసుగులూ లేకుండా బిల్లు ఆమోదం పొందాలన్నది తమ అభిమతమని చెప్పారు. అందువల్లే ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించాలని కోరారు. ఈ మేరకు సభలో తీర్మానం నోటీసు



ప్రతిపాదించారు. సెలక్ట్ కమిటీలో సభ్యులుగా రేణుకా చౌదరీతో పాటు వివేక్ తంకా, నవనీత్ కృష్ణన్, కేకే రాగేష్, డీ రాజా, కేటీఎస్ తులసి తదితర 17 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. పైగా కాంగ్రెస్ నేతలు 'మహిళా వ్యతిరేకి' అన్న బీజేపీ సభ్యుల నినాదాలను కూడా తప్పుపట్టారు. నిజంగా మహిళాసంక్షేమంపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే.. మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఒక రోజు ముందుగా నోటీసు ఇవ్వలేదన్న జైట్లీ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బీఏసీ సమావేశంలోనే ఈ అంశాన్ని లేవనెత్తామని, అయితే సభలో బిల్లు ప్రవేశపెట్టే సమయంలో సవరణ ప్రతిపాదించాలని ఛైర్మన్ సూచించారని ఆనంద్‌శర్మ చెప్పారు. అవసరమైతే బీఏసీ సమావేశ మినిట్స్ పరిశీలించాలని సూచించారు. ఇదేసమయంలో ఆనంద్‌శర్మ సవరణపై ఓటింగ్ నిర్వహించాలని రాజ్యసభాప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. కేంద్రమంత్రులకు, కాంగ్రెస్ సభ్యులకు వాదోపవాదనలు జరుగుతున్నంత సేపూ ఇరు పార్టీల ఎంపీలు పరస్పరం నినాదాలు చేసుకుంటూ సభను హోరెత్తించారు.

అధికార, విపక్ష సభ్యుల వాగ్యుద్ధంపై డిప్యూటీ ఛైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఇరుపక్షాలు ఒక అవగాహనకు రావాలని, ఈ విషయంలో తాను ఏమీ చేయలేనని అన్నారు. సభ్యులు ఆందోళన విరమించకపోతే సభ వాయిదా వేయడం తప్ప మరోమార్గం లేదని పలుమార్లు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సభ్యులు ఓటింగ్ డిమాండ్ చేయడంతో బీజేపీ ఎంపీలు ఆందోళన స్థాయి పెంచారు. చివరకు చేసేదేమీ లేక సభను డిప్యూటీ ఛైర్మన్ గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో అధికార, విపక్షాల వాగ్యుద్ధం

- ఆందోళనల నడుమ బిల్లు ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి
- సెలక్ట్ కమిటీకి నివేదించాలి : కాంగ్రెస్ నోటీసు
- ఆ నోటీసును పరిగణించొద్దు : జైట్లీ
- బిల్లుపై ఓటింగ్ నిర్వహించండి : గులాంనబీ ఆజాద్
- బీజేపీ సభ్యుల ఆందోళన.. సభ నేటికి వాయిదా

హిందూ పండుగలకు బంద్ చేయాల్సిందే..

- మదర్సాలకు యూపీ ప్రభుత్వం ఆదేశాలు
- రంజాన్ సెలవుల్లో కోత పెట్టిన వైనం

లక్నో: హిందూ పండుగల రోజున మదర్సాలను మూసేయాల్సిందేనని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక.. రంజాన్, ఈదుల్ జుహాలాంటి ముస్లిం పర్వదినాలకు ఇస్తున్న ఐచ్ఛిక సెలవుల్లో కోత పెట్టడం గమనార్హం. ఇప్పటివరకు మదర్సాలు అన్ని ముస్లిం పండుగలకు, హోళి, అంబేద్కర్ జయంతికి సెలవులు ఇస్తున్నాయి. కాగా.. వీటికి అదనంగా ఏడు పండుగలకు(బుద్ధపూర్ణిమ, రక్షాబంధన్, మహానవమి, మహవీర్ జయంతి, దీపావళి, దసరా, క్రిస్మస్) మదర్సాలు సెలవు దినాలుగా పాటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రంజాన్, ఈదుల్ జుహా, తదితర ముస్లిం పండుగలకు ఇస్తున్న 10 ఐచ్ఛిక సెలవులను నాలుగుకు కుదించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హిందూ పండుగల రోజున మదర్సాలు మూసివేయాలని చెప్పడంలో అభ్యంతరం లేదని, కానీ, ముస్లిం పర్వదినాల కోసం ఉద్దేశించిన



సెలవుల్లో కోత పెట్టడం సరికాదని ఇస్లామిక్ మదర్సా వెరాడర్నైజేషన్ టీచర్స్ అసోసియేషన్ చీఫ్ ఈజాజ్ అహ్మద్ విమర్శించారు.

అంతర్జాతీయం

నైజీరియా మసీదులో ఆత్మాహుతి దాడి

- 14 మంది మృతి


(ఫైల్)

అబూజ : బోర్నో రాష్ట్రంలో గాంబోరు నగరంలోని మసీదులో ఆత్మాహుతి దాడి జరిగింది.ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...బుధవారం తెల్లవారుజామున గాంబోరు నగరంలో ఆత్మాహుతి దాడి జరిగింది. మసీదులో ప్రార్థన చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో 14 మంది చనిపోయారు. మృతదేహాలన్నీ మసీదు ఆవరణలో చల్లాచదురైపడిపోయాయి.

భారీ పేలుడు కారణంగా పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. మసీదు భవనం తునాతునకలైంది. మసీదు శిధిలాల కింద మరికొన్ని మృతదేహాలు ఉండివుండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలిలో ముమ్మర సహాయక చర్యలు చేపట్టామని అన్నారు. కాగా, ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. ఇదిలా ఉండగా, గతవారం మైదుగురీ నగరంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో నలుగురు పౌరులు మృతి చెందారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు బోకో హారమ్ మిలిటెంట్లు ప్రకటించుకున్నారు. గతేడాది నవంబర్‌లో నైజీరియా మసీదులో ఆత్మాహుతి దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 50 మంది మృతి చెందారు.

ఉగ్రదాడిలో ఐదుగురు పోలీస్ అధికారులు మృతి

- కెన్యాలో ఘటన

నైరోబీ : అల్-షాబాబ్ ఉగ్రసంస్థ కెన్యాపై పంజా విసిరింది. ఉగ్రవాద కార్యకలాపాలకు విఘాతం కల్గిస్తున్నారనే ఆరోపణలపై పోలీసులపై మెరుపుదాడికి పాల్పడింది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు పోలీస్ అధికారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎల్వాక్-కుతోలో ప్రాంతాల మధ్య పోలీస్ అధికారులు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రదాడి జరిగింది. ఈదాడిలో ఐదుగురు పోలీస్ అధికారులు మృతి చెందారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్టు అధికారులు తెలిపారు.

ఈజిప్టులో పేలుళ్ల కేసు.. దోషులకు ఉరి

కైరో : ఈజిప్టు రాజధాని కైరోలో జరిగిన పేలుళ్ల కేసులో మిలిటరీ కోర్టు నలుగురు నిందితులను దోషులుగా తేల్చింది. దోషులకు ఉరిశిక్ష విధించాలని అధికారులను ఆదేశించింది. కాగా, 2014లో ఈజిప్టులోని కఫ్రల్ షేక్ నగరంలో పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో నలుగురు మిలిటరీ విద్యార్థులు మృతి చెందారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన మిలిటరీ కోర్టు నిందితులను దోషులుగా తేల్చింది. బోర్గ్ అల్ అరబ్ కారాగారంలో శిక్ష అమలు చేయాలని ఆదేశించింది.

నా దగ్గరా శక్తివంతమైన అణు బటన్

ఇది మరింత పవర్‌ఫుల్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: 'నా దగ్గరా శక్తివంతమైన అణు బటన్ ఉన్నది. ఉత్తరకొరియా దగ్గర ఉన్న అణు బటన్ కంటే ఇది చాలా పెద్దది. అంతేగాకుండా, ఇది పని చేస్తున్న అణు బటన్' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కాగా, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అమెరికాను ఉద్దేశించి ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్-జోంగ్-ఉన్ ఘాటు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని అమెరికా ప్రయత్నిస్తే తన దగ్గర ఉన్న అణ్వాయుధాల బటన్ నొక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తాము ఏనాడూ జోక్యం చేసుకోలేదని, తమ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చాలని ఏ దేశం ప్రయత్నించినా దాడులకు పాల్పడేందుకు వెనుకాడమని పరోక్షంగా అమెరికాను హెచ్చరించారు. అగ్రరాజ్యాన్ని అంతమొందించే శక్తి, సాంకేతిక పరిజ్ఞానం తమ వద్ద ఉన్న అణ్వాయుధాలకు ఉందన్నారు.

కిమ్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తాజాగా ఖండించారు. తమ దగ్గర పనిచేస్తున్న అణు బటన్ ఉందన్నారు. ఇది ఉ. కొరియా దగ్గర ఉన్న అణు బటన్ కంటే చాలా పెద్దదన్నారు. కాగా, అమెరికా, ఉ. కొరియా దేశాధినేతల మధ్య కొంతకాలంగా ట్విట్టర్ వార్ నడుస్తున్న సంగతి తెలిసిందే. సార్వభౌమత్వాన్ని



కాపాడుకోవాలనే ఉద్దేశంతో అణ్వస్త్ర పరీక్షలు నిర్వహిస్తోన్న ఉ.కొరియాను దెబ్బతీయాలని అమెరికా కుటిలయత్నాలు చేస్తోంది. దక్షిణ కొరియా, జపాన్ దేశాలను ఉ.కొరియాపై ఉసిగొల్పేందుకు ప్రయత్నిస్తోంది. ద.కొరియాకు సైనిక సహకారం అందిస్తోంది. క్షిపణి దాడులను సమర్థవంతంగా ఎదుర్కోగలిగే థాడ్ పరిజ్ఞానాన్ని ఇప్పటికే అందజేసింది. కొరియా ద్వీపకల్పంలో ద.కొరియా, జపాన్ దేశాలతో కలిసి ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నది. ఉ.కొరియాను ఆర్థికంగా దెబ్బతీయాలని ఆంక్షలు విధించింది. గతనెలలో అమెరికా మిలిటరీ మాజీ చీఫ్ ఉ.కొరియాను హెచ్చరిస్తూ వ్యాఖ్యలు చేశారు. అమెరికా యుద్ధానికి సిద్ధమవుతోందని పరోక్షంగా హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమెరికా, ఉ.కొరియాతో యుద్ధానికి దగ్గరవుతోందని యూఎస్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ మాజీ ఛైర్మెన్ మైక్ ముల్లెన్ అన్నారు.

ఇటీవల ఐరాసలో ట్రంప్ మాట్లాడారు. ఉ.కొరియా దేశాన్ని సర్వనాశనం చేయడం తప్ప తమ వద్ద ఎలాంటి అవకాశం లేదని అన్నారు. అప్పటి నుంచే ఇరు దేశాల మధ్య పరిస్థితులు మరింత తీవ్రంగా మారాయి. ట్రంప్ హెచ్చరికలకు ఉ.కొరియా కూడా దీటుగానే బదులిస్తూ వస్తోంది. గతేడాది నవంబర్‌లో ఆ దేశం అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని (ఐసీబీఎం) ప్రయోగించింది. ఆ ప్రయోగంతో అమెరికా మొత్తం తమ లక్ష్యం పరిధిలోకి వచ్చిందని కిమ్ అన్నారు. 2018లోనూ తాము ఏ మాత్రం మారబోమని.. క్షిపణి ప్రయోగాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఐసీబీఎం ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఇటీవల కిమ్ పోస్టల్ స్టాంప్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

పెరూలో బస్సు ప్రమాదం : 48 మంది మృతి

లిమా: పెరూలో ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 48 మంది మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... పెరూ రాజధాని లిమాకు 57 మందితో ప్రయాణిస్తున్న బస్సు, ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్నాయి. దీంతో, బస్సు ఒక్కసారిగా 100 మీటర్ల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 48 మంది మృతి చెందారు.

ప్రమాదం జరిగిన పసమాయో ప్రాంతం చాలా ప్రమాదకరమైన కొండ అంచు ఇరుకైన రోడ్డు కావడంతో ఈ



హైవేను డెవిల్ కర్వ్ అని పిలుస్తారు. మృతదేహాలను బయ టకు తీసేందుకు సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అధికారులు వెల్ల డించారు. ప్రమాదంపై పెరూ అధ్య క్షుడు పెడ్రో పాబ్లో విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉగ్రపోరుపై పాక్ వైఖరి అనుమానాస్పదం : నిక్కీ

వాషింగ్టన్: ఉగ్రవాదంపై పోరు విషయంలో గత కొన్నేండ్లుగా పాకిస్థాన్ డబుల్ గేమ్ ఆడుతోందని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ అన్నారు. పాక్ వైఖరి అనుమానాస్పదమైందన్నారు. పాక్‌కు 255 మిలియన్ డాలర్ల (రూ.1700 కోట్లు)సైనిక సహకారాన్ని అమెరికా నిలిపివేసిందని తాజాగా నిక్కీ స్పష్టం చేశారు,. అమెరికా ఈ విధంగా చేయడానికి చాలా స్పష్టమైన కారణముందని, పాక్ కొన్నేండ్లుగా డబుల్ గేమ్ ఆడుతోందని నిక్కీ తెలిపారు. పాక్ మాతో కలిసి పనిచేస్తున్నట్టే ఉంటూ.. అఫ్ఘనిస్థాన్‌లో తమ దళాలపై దాడులు జరుపుతున్న ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్నదని ఆమె పేర్కొన్నారు. పాక్ ఆడుతున్న డబుల్ గేమ్‌ను అమెరికా యంత్రాంగం ఏమాత్రం ఒప్పుకోదన్నారు. ఉగ్రవాదంపై పోరు విషయంలో పాక్ నుంచి ఇంకా ఎక్కువ సహకారం కోరుకుంటున్నట్టు చెప్పారు. ఐరాసలో నిక్కీ హేలీ



ప్రకటన చేసిన వెంటనే ఉగ్రవాదంపై వ్యతిరేకంగా పాక్ చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామని వైట్‌హౌస్ ప్రకటించింది. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు పాక్ ఇంకా చర్యలు తీసుకోవచ్చని.. మేము అదే కోరుకుంటున్నామని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి సారా శాండర్స్ తెలిపారు.

చంద్రుని అవతలి భాగంపైకి చైనా రోవర్

బీజింగ్: ఇప్పటివరకు ప్రపం చంలో ఎవరూ సాధించలేని ఘనతను సొంతం చేసుకోవడానికి చైనా సిద్ధమ వుతున్నది. అది అమెరికా, యూఎస్ఎస్ఆర్‌లకు కూడా సాధ్యం కాని ఘనత. ఇప్పటివరకు ఆ రెండు దేశాలు చంద్రుడిపై ఉన్న ఒక భాగంపైకే తమ స్పేస్‌క్రాఫ్ట్‌లను పంపించాయి. మనం భూమి మీది నుంచి ఎప్పుడూ చంద్రుడిలోని ఒకే భాగాన్ని చూస్తుంటాం. దానిపైకే ఆ దేశాలు తమ వ్యోమనౌకలను పంపాయి. కానీ చైనా మాత్రం ఇప్పటివరకు మనకు కనిపించని ఆ మరో భాగంపై తన రోవర్‌ను దించేందుకు సిద్ధమవుతున్నది. 2016, డిసెంబర్‌లోనే ఈ ప్రాజెక్ట్ వివరాలను చైనా వెల్లడించింది. 2018లో ఈ మిషన్‌ను లాంచ్ చేస్తామని అప్పట్లో చెప్పింది. ఇప్పుడు దానికి టైమ్ దగ్గర పడింది. చేంజ్ 4 ప్రాజెక్ట్‌లో భాగంగా చంద్రుడిపై ఉన్న మనకు కనిపించని భాగంపై తమ రోవర్‌ను దింపనున్నది. చంద్రునిపైకి తొలిసారి మనిషిని పంపి చరిత్ర సృష్టించిన అమెరికాకు కూడా సాధ్యం కాని రికార్డు ఇది. జూన్ 2018లో ఈ మిషన్‌కు సంబంధించిన తొలి ఘట్టం మొదలవుతుంది. చేంజ్ 4లో భాగంగా ఓ రిలే శాటిలైట్‌ను చంద్రుని వెనుక భాగంలో 60 వేల కిలోమీటర్ల దూరంలో ఉంచనున్నారు. ఆ కనిపించని భాగం గురించిన సమాచారాన్ని ఈ శాటిలైట్ భూమికి చేరవేస్తుంది. ఇది విజయవంతమైతే.. అసలు ఘట్టానికి తెర లేస్తుంది. ఆ శాటిలైట్ పంపిన సమాచారం మేరకు ఆ వెనుక భాగంపై రోవర్‌ను దించుతారు. అదే జరిగితే చైనాకే కాదు అంతరిక్ష పరిశోధనలోనే ఇది ఒక మైలురాయిగా మిగిలిపోతుంది. గతంలో 2013లో చేంజ్ 3 పేరుతో చంద్రుడి మీదికి ఓ రోవర్‌ను దించింది చైనా. 1976 తర్వాత చంద్రుడిపై ల్యాండైన తొలి రోవర్‌గా అప్పట్లో ఇది వార్తల్లో నిలిచింది.

పాలస్తీనాకు సాయం నిలిపివేత : ట్రంప్

వాషింగ్టన్: పాకిస్థాన్‌కు సైనిక సాయం నిలిపేసిన అమెరికా అదే విధంగా పాలస్తీనాకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పాక్ సరైన చర్యలు తీసుకోవడంలేదని అమెరికా.. పాక్‌కు 1700 కోట్ల (255 మిలియన్ డాలర్ల) సైనిక సాయాన్ని నిలిపేసిన సంగతి తెలిసిందే. శాంతి చర్చలకు అంగీకరించకపోతే పాలస్తీనాకు కూడా సాయం నిలిపేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్విట్టర్‌లో వెల్లడించారు.

పాలస్తీనాకు సాయం చేయడం వల్ల అమెరికాకు ఎలాంటి ప్రశంస గానీ, గౌరవం గానీ దక్కట్లేదని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేమ్‌ను గుర్తించే అంశంపై ఇబ్బంది ఎదురవుతున్న నేపథ్యంలో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలస్తీనా కోసం ఏటా వందల మిలియన్ల డాలర్లు వెచ్చిస్తున్నాం.. కానీ ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలకు పాలస్తీనా సుముఖత చూపించడం లేదని .. ఇక భవిష్యత్తులో మేము ఎందుకు సాయం చేయాలని ట్రంప్ ట్వీట్ చేశారు. జెరుసలేమ్‌ను ఇజ్రాయిల్ రాజధానిగా ఇటీవల అమెరికా గుర్తించిన సంగతి తెలిసిందే. దీన్ని పాలస్తీనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

మనం ఏకమైతే ప్రభంజనమే

- రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి
- హక్కులు కోల్పోతున్న బడుగు, బలహీనవర్గాలు
- పూలే..అంబేద్కర్ ప్రచార రథయాత్ర ప్రారంభోత్సవంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడుగు, బలహీనవర్గాలు ఏకమైతే ప్రభంజనమే అవుతుందని వక్తలు అన్నారు. ఇక రాజ్యాధికారమే లక్ష్యంగా మనం అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మనువాదం రాజ్యమేలుతున్నదని, మనువాదాన్ని ప్రశ్నిస్తే భౌతికదాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. దేశాన్ని పరిపాలిస్తున్న మనువాదులు దళితుల ఓట్లను పొందేందుకు అంబేద్కర్‌ను గౌరవిస్తున్నట్టు నటిస్తూనే అంబేద్కరిస్టులను మట్టుబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ బడుగు బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే.. అంబేద్కర్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు జేబీ రాజు, కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు, మల్లు రవి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి రాములు, తెలంగాణ ఇంటిపార్టీ అధినేత చెరకు సుధాకర్, నల్లా సూర్యప్రకాశ్, పూలే.. అంబేద్కర్ జాతర స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు జి సుధాకర్, ప్రధానకార్యదర్శి మేకపోతుల నరేందర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భూములు పంచడానికి భూములు లేవా? అని ప్రశ్నించారు. బడుగు, బలహీనవర్గాలు ఏకమైతే రాజ్యాధికారం సిద్ధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఉదాహరణ కోరేగావ్ సంఘటనే అని చెప్పారు. మరాట్వాడను ఆర్‌ఎస్‌ఎస్ రెచ్చగొడుతున్నదని తెలిపారు. బడుగులపై హిందూ మతోన్మాదుల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. పూలే.. అంబేద్కర్ జాతరకు టీమాస్ ఫోరం సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు. చెరుకు సుధాకర్ మాట్లాడుతూ దళితులపై టీఆర్‌ఎస్ ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందని విమర్శించారు. హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమాలను అణచివేస్తున్నదన్నారు. కనీసం సొంత ఇండ్లు, కార్యాలయాల్లో ఉద్యమాలు, దీక్షలు చేపట్టిన ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మందకృష్ణ మాదిగ సంఘటనను ఉదహరించారు. పూలే..అంబేద్కర్ జాతరకు తెలంగాణ ఇంటి పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు. జి సుధాకర్ మాట్లాడుతూ నిరంతర పోరాటాల వల్లనే కోల్పోయిన హక్కులను సాధించుకునే అవకాశం ఉందన్నారు. మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం బహుజన బంధువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న గద్దర్

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి : కంచ


మాట్లాడుతున్న కంచ ఐలయ్య

- పెత్తందార్ల ఆధిపత్యాన్ని ధిక్కరించిన మహిళ: నల్లా సూర్యప్రకాష్ రావు
- నేటికీ స్త్రీలపై లైంగిక వేధింపులు: మల్లు లక్ష్మి
- ఇంగ్లీషు విద్యను అందరికీ అందించాలి: ప్రొ. పిఎల్ విశ్వేశ్వర్‌రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ సంఘ సంస్కర్త, తొలి మహిళాఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రీబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక(టీమాస్) నాయకులు, ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని టీమాస్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి ఆర్.అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంచ మాట్లాడుతూ... సమాజంలో ఆనాదిగా వస్తున్న భావజాలాన్ని మార్చాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. స్త్రీలపై నేటికీ వివక్షత కొనసాగుతున్నదన్నారు. ప్రతి కుటుంబంలోనూ పురుషుడు ఎక్కువ అనే భావన ఉందని, దాన్ని మార్చివేయాలని, ప్రతి విద్యార్థిని తమ ఇంటిలోనే మొదట మార్పు తీసుకురావాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ దేశంలో ప్రతి 30 నిమిషాలకు ఒక లైంగికదాడి, ప్రతి 15 నిమిషాలకో లైంగిక వేధింపు కేసు, ప్రతి 99 నిమిషాలకు ఒక మహిళపై దాడి జరగటం ఆందోళన కలిగిస్తోందన్నారు. సాంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా చెప్పుకునే భారత్‌లో మహిళలకు భద్రతను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అంబేద్కర్ జాతర కమిటీ నాయకులు నల్లా సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ 150 ఏండ్ల కిందటే పెత్తందార్ల ఆధిపత్యాన్ని ధిక్కరించి చదువు నేర్చుకుని, ఇతర మహిళను విద్యావంతులను చేసిన ఘనత సావిత్రీబాయి పూలేకు దక్కుతుందన్నారు. టీపీఎస్‌కే కన్వీనర్ జి. రాములు మాట్లాడుతూ శూద్రులకు చదువునేర్పించిన సావిత్రిబాయి నిజమైన చదువుల మాతగా పరిగణించాలని కోరారు. ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఇంగ్లీషు విద్యను అందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, టీమాస్ రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు, చెరుపల్లి సీతారాములు, దళిత, బహుజన ఫ్రంట్ అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మందకృష్ణను బేషరతుగా విడుదల చేయాలి'

హైదరాబాద్:మందకృష్ణ మాదిగను బేషరతుగా విడుదల చేయాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణపై తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని వారు ఈ సందర్భంగా కోరారు. పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

సావిత్రిబాయి సేవానిరతి మహోన్నతం

ఎస్వీకే కార్యదర్శి వినయకుమార్

నవతెలంగాణ - సిటీబ్యూరో

సమాజంలో అట్టడుగు వర్గ ప్రజలకు సావిత్రీబాయి పూలే చేసిన సేవలకు వెలకట్టలేమని, చివరకామె మరణం కూడా మహోన్నతమైనదని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయకుమార్ కొనియాడారు. సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే 187 జయంతి సభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగింది. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ రచయిత్రి ఝాన్సీ అధ్యక్షత వహించిన ఈ సభలో వినయకుమార్ మాట్లాడుతూ మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, తమకు తాము స్వయం నిర్ణయం తీసుకోలేని రోజుల్లో ఎంతో సాహసోపేతంగా అన్ని కులాల మహిళలకు విద్యను బోధించిన ధీరోత్తమైన మహిళ అని కొనియాడారు.

మనుధర్మమే రాజ్యాంగంగా అమలవుతున్న సమయంలో ఎన్ని అవమానాలు ఎదురైనా, ఎంతో తెగువని ప్రదర్శించి, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ధీశాలీ అన్నారు. ప్లేగు వ్యాధి వచ్చిన బాలుడిని, తన భుజాన మోసుకెళ్ళి, అదే ప్లేగు వ్యాధితో సావిత్రీబాయి మరణించారని తెలిపారు. ఆమె మరణం వీరమరణం కంటే ఎన్నో రెట్లు గొప్పదన్నారు. టీపీఎస్కే కన్వీనర్ రాములు మాట్లాడుతూ శూద్రులకు చదువును నిషేధించిన రోజుల్లో చదువు లేకపోవడం రెండు కాళ్ళ జంతువుతో సమానమని జ్యోతిబాపూలే, సావిత్రీబాయి దంపతులు భావించారన్నారు. శూద్రులకు, ముఖ్యంగా మహిళలకు చదువు నేర్పి.. సమాజంలో సామాజిక విప్లవాన్ని సృష్టించారన్నారు. మహిళలు ఎంత ఎక్కువగా చదువుకుంటే, సమాజం అంతగా అభివృద్ధి చెందుతుందని వారు ఆనాడే గ్రహించారన్నారు. అందుకే సావిత్రీబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీఎస్కే ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని ఆడపిల్లను పుట్టనిద్దాం, ఆడపిల్లను బతుకనిద్దాం, ఆడపిల్లను ఎదగనిద్దాం, ఆడపిల్లను చదవనిద్దాం అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేసినట్టు చెప్పారు. ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య మాట్లాడుతూ భారతదేశంలో మనుధర్మం కారణంగా మహిళలకు భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. కుల వ్యవస్థ దుర్మార్గాలను పూలే గులాంగిరి పుస్తకంలో ఎండగట్టాడని అన్నారు. సామాజిక ఉద్యమకారుడు చంద్రన్న మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనుధర్మానికి ప్రతినిధి అని విమర్శించారు. సావిత్రీబాయి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే ఒక ధిక్కార స్వరమని, విముక్త దృశ్యం అని కొనియాడారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు బి.భిక్షమయ్య మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన రవీంద్రభారతీలో జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే నృత్య రూపకం ఉంటుందని తెలిపారు.


సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న వినయకుమార్, జి రాములు తదితరులు

పేదల జీవితాల్లో మార్పురాలేదు :కంచ

- చదువుకు సావిత్రీబాయి ప్రాధాన్యత : విమలక్క
- అంబర్‌పేటలో ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

నవతెలంగాణ - సిటీబ్యూరో

పాలకులు మారుతున్నారుగానీ విధానాలు మారట్లేదని, అందుకే మన దేశంలో నేటికీ పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్) నాయకులు, ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలో గల బతుకమ్మకుంట రామకృష్ణహట్స్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ...ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి మూడున్నర ఏండ్లలోనే శాసనసభ్యుల వేతనాలు లక్షల రూపాయలకు పైగా పెరిగాయని అన్నారు. కానీ పేదల కూలి మాత్రం పెరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయేరోజుల్లో ప్రతి పేద విద్యార్థి విదేశాల్లో చదువుకునే విధంగా వారికి నాణ్యమైన భోజనంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించేంత వరకూ టీమాస్ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఉన్నత విద్యనభ్యసించి బతుకమ్మ కుంట నుంచి ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫెసర్లుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు, ప్రముఖ గాయని విమలక్క మాట్లాడుతూ ఆనాడు పెత్తందార్లను ఎదిరించి మహిళకు విద్య ఎంత అవసరమో సావిత్రీబాయి పూలే నొక్కి చెప్పారని, చదువుతోనే మహిళల్లో చైతన్యం పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా బహుజనులు చదువుకునే విధంగా అలుపెరుగని పోరాటం చేసిన మహనీయురాలు పూలే అని కొనియాడారు. తెలంగాణలో మహిళలకు ప్రాధాన్యత లేకుండాపోయిందన్నారు. దీనికి రాష్ట్ర మంత్రివర్గంలో కనీసం ఒక్క మహిళా మంత్రి కూడా లేకపోవడమే నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, టీమాస్ నాయకులు డీజీ నర్సింహారావు, టీమాస్ జిల్లా కార్యదర్శి సహదేవ్, ఎం.నాగరాజు, ఎం.శ్రీనివాస్, ఎం.మహేందర్, అనిత, జ్యోతి, రేఖ పాల్గొన్నారు.


టీ-మాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ARM Branch (ARMB) మూడవ అంతస్తు, విజయ ప్లాటినం ప్లాజా, చందన బ్రదర్స్ ఎదురు లైను, చిక్కడపల్లి, హైదరాబాద్-500029. ఫోన్ : 040-23468807/836, Email : iob2582@iob.in


స్వాధీనత ప్రకటన
(స్థిరాస్తి కొరకు) Appendix - IV (Rule8(1))

[illegible]

తేది: 02-01-2018
ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి

సంపాదకీయం

విధ్వంస కాండ



మతం మత్తు, కుల దురహంకారం కోరెగావ్‌లో కోరలు చాచింది. విషం చిమ్మింది. విధ్వంసం సృష్టించింది. దళితుల ఐక్యతను భరించలేకపోయారు. పీష్వాల పీచమణచడం అవమానంగా భావించారు. దళితుల ధైర్యాన్ని దెబ్బకొట్టాలనుకున్నారు. చరిత్రకు వక్రభాష్యం చెప్పటం ప్రారంభించారు. బెదిరించారు. ఐనా దళితులు పోరాట కేంద్రానికి రావటం ఆగలేదు. ఇది సహించని నయా పిష్వాలు దాడులకు తెగబడ్డారు. శాంతియుత పరిస్థితికి విఘాతం కలిగించారు. అల్లర్లకు ఆజ్యం పోశారు. ఫేస్‌బుక్, వాట్స్‌ప్‌లలో చర్చలకు తెరలేపారు. భీమ్ కోరెగావ్ సంఘటనకు దళితులైన మహర్లకు ఎలాంటి సంబంధం లేదని అబద్ధాలు ప్రచారంలో పెట్టారు. బ్రాహ్మణ భావజాలవాదులు చరిత్రకు సాక్ష్యంగా నిలబడ్డారు. స్థూపం 1851లోనే వెలసింది. దానిమీద యుద్ధంలో చనిపోయిన మహర్ల పేర్లు లిఖించబడి ఉన్నాయి. యుద్ధం జరిగి రెండువందల ఏండ్లు అయింది. బ్రాహ్మణ పిష్వాల రాజ్యంలో అంటరాని మహర్లను బహిరంగ ప్రదేశాలలో తిరగనివ్వలేదు. నీడ తాకితే ఉన్నత కులాలు మైల పడతాయని భావించేవారు. కుల ప్రాతిపదికన శిక్షలు అమలు చేశారు. ఒకే తప్పుకు తక్కువ కులం వారికి ఎక్కువ శిక్షలు, ఎక్కువ కులం వారికి తక్కువ శిక్షలు వేశారు. సామాజిక పీడన కొనసాగటం దళితులు సహించలేకపోయారు. దళితులను బ్రిటిష్‌వారు సైన్యంలో చేర్చుకున్నారు. మహర్లు పీష్వాల రాజ్యంపై తిరగబడ్డారు. ఈ స్ఫూర్తిని భారతదేశమంతా వ్యాపింపచేయడానికి 1927లో అంబేద్కర్ మొట్టమొదటిసారిగా భీమ్‌కోరెగావ్‌ను సందర్శించారు. అప్పటి నుండి అదొక స్ఫూర్తి ప్రదేశంగా మారిపోయింది. దళితులలో చైతన్యం రగిలిస్తున్నది. సామాజిక న్యాయానికి బాట చూపుతున్నది. కోరెగావ్‌కు వస్తున్న ఆదరణను సంఘ పరివారం, అగ్రవర్ణం జీర్ణించుకోలేకపోయింది. కక్ష పెంచుకుంది. కసితో రగిలిపోయింది.

మనుస్మృతిని మళ్ళీ ప్రతిష్టించాలనీ చూస్తున్నది. దళితుల్లో ఉప్పొంగే ఉద్యమాలను అంగబలంతో అణచాలని చూస్తున్నారు. మహారాష్ట్ర పోలీసులు దళితుల కోసం గాలింపు చర్యలు ఆపాలి. వేధింపులు మానుకోవాలి. విధ్వంసకాండకు కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి.

ద్విశత వార్షికోత్సవాలు జరగడం సహించలేక పోయింది. ఘర్షణలకు పావులు కదిపింది. దీనికి మోడీ మీడియా కూడా బాగానే సహకరించింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్టు చిత్రీకరించాయి. కారకులెవ్వరో కనుక్కోలేకపోయింది. తప్పెవరిదో తేల్చలేదు. శాంతియుతంగా సభ నిర్వహించుకుంటున్న వారిపై రాళ్ళు రువ్వింది ఎవరు? రెచ్చగొట్టింది ఎవరు? హింసాత్మక సంఘటనలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోలేదు. పూణేలో మొదలైన అల్లర్లు రాష్ట్రమంతా వ్యాపించాయి. 144 సెక్షన్ పెట్టారు. బస్సులు ధ్వంసం అయినాయి. పాఠశాలలు మూసివేశారు. హైవేలు బంద్ పెట్టారు. పరిస్థితి అదుపులోకి రాకపోగా మతశక్తుల పథకం మారణహోమానికి దారితీసింది. దళితులు సంఘటితం కావడం కాషాయశక్తులకు కంటగింపుగా మారింది. దొంగే దొంగ అన్నట్టు బయటివారు వచ్చి మహారాష్ట్రీయుల మీద దాడిచేసినట్టు కహానీలు చెబుతున్నారు. దళితులను దగాచేస్తున్నారు. రాహుల్ పతాంగాలే అనే యువకుడిని బలితీసుకున్నారు. అనేకమంది గాయపడ్డారు. మహారాష్ట్ర అట్టుడికింది. ఇంటర్నెట్, రవాణా వ్యవస్థ ప్రజాజీవనం స్తంభించిపోయింది. ఇంత జరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు గమనించలేక పోయాయి. వైరివర్గాల సమాచారం వేగుల ద్వారా తెలుసుకొనే పాలకులకు పూణేలో జరుగుతున్న పరిణామాలు దృష్టికిరాకపోవడం ఆశ్చర్యకరం. నిఘా వర్గాలు విఫలమైతే బాధ్యత ఎవరు వహిస్తారు? పథకంలో పాలకులు కూడా భాగస్వాములు అయినప్పుడు నిఘా వర్గాలు తేల్చేదేముంది? మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమస్య తీవ్రతను గమనించి అదుపు చేయడంలో విఫలమయ్యారు. ఘటన వాస్తవాలను పరిశీలించేందుకు కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు. చనిపోయిన రాహుల్ పతంగాలేకు 10 లక్షల పరిహారంతో విలువ కట్టారు. హత్యకు కారణమైన దోషులను మాత్రం అదుపులోకి తీసుకోలేదు. అరెస్టు చేయకపోవడం అన్యాయం. కోరెగావ్ అల్లర్లు విధ్వంసం పార్లమెంట్ ఉభయసభలను తాకింది.

బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై దాడులు పెరుగుతున్నాయి. రోహిత్‌వేముల ఆత్మహత్య, ఉనాలో దళితులపై దాడి, గోసంరక్షణ పేరుతో వేధింపులు ఎక్కువయ్యాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబడుతున్నాయి. అయినా పాలకులు చర్చలకు సిద్ధపడలేదు. సమస్యను పక్కదారి పట్టించేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. దళితుల పోరాట స్ఫూర్తిని కించపరుస్తున్నారు. బ్రిటిష్‌వారి విజయాన్ని మనం పండుగ చేసుకోవడం ఎమిటని కపటనీతి ప్రదర్శిస్తున్నారు. దేశభక్తిపై సందేహాలు వెలిబుచ్చుతున్నారు. 1818లో భారతదేశం ఒకే రాజ్యంగా లేదని కమల దళాలు గమనించాలి. కోరెగావ్ మహర్ల పోరాట స్ఫూర్తిని మరుగున పరచటమంటే చరిత్రను వక్రీకరించటం తప్ప మరొకటి కాదు. బ్రాహ్మణీయ భావజాలాన్ని ప్రతిష్టించాలనీ, కాపాడాలనీ, కాషాయ కూటమి కంకణం కట్టుకుంది. మనుస్మృతిని మళ్ళీ ప్రతిష్టించాలనీ చూస్తున్నది. దళితుల్లో ఉప్పొంగే ఉద్యమాలను అంగబలంతో అణచాలని చూస్తున్నారు. మహారాష్ట్ర పోలీసులు దళితుల కోసం గాలింపు చర్యలు ఆపాలి. వేధింపులు మానుకోవాలి. విధ్వంసకాండకు కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి.

తక్షణ తలాక్ బిల్లు లక్ష్యమేంటీ..?



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

"నేడు చరిత్ర సృష్టించబోతున్నాం. రాజకీయానికి కాదు, మానవత్వం కోసం." డిసెంబర్ 28న 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లు, 2017ను లోక్‌సభలో ప్రవేశపెడుతూ డాంబీకరించారు న్యాయ మంత్రి రవి శంకర్ ప్రసాద్. ఆరోజే ఆ సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభ ఆమోదంతో రాష్ట్రపతి సంతకంతో చట్టమౌతుంది. ముస్లిం మగవాళ్ళు విడాకులివ్వడానికి మార్గదర్శకాలతో చట్టం చేస్తామని అటార్నీ జనరల్2017, ఆగస్టులో సుప్రీం కోర్టుకు తెలిపారు. ఆమేరకు తయారైన ఈ బిల్లులో హామీ

భారత ముస్లింలలో ఎంత మంది తక్షణ తలాక్‌ను పాటిస్తున్నారన్న గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేవు. చట్ట నేపథ్యంలో కూడా తెలుసుకునే ప్రయత్నాలు చేయలేదు. ఒక స్వచ్ఛంద సంస్థ ఇంటర్నేట్ సర్వేలో ఒకశాతం కంటే తక్కువ మంది ఈ పద్ధతిలో విడాకులిచ్చారని తేలింది. ఇంత తక్కువ మంది కోసం అందులోనూ సుప్రీం కోర్టు రెండు సార్లు రద్దుచేసిన తలాక్పై హామీ తప్పిన బిల్లు అవసరమేమి? రాజకీయ లబ్ధి తప్ప!

నెరవేరలేదు. ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణా లేదు. తక్షణ తలాక్‌ను క్రిమినల్ నేరంగా ఎంచి శిక్షలు విధిస్తోంది ఈ బిల్లు. మోడీ హయాంలో రద్దులూ, వక్రీకరణలే చరిత్రలు.

బిల్లు నేపథ్యం: 2016 జూన్‌లో సంఘ్ అనుబంధ 'రాష్ట్రవాది ముస్లిం మహిళా సంఘ్' ముస్లిం వ్యక్తిగత చట్టాన్ని (షరియత్) చట్టబద్ధీకరించాలని సుప్రీం కోర్టును కోరింది. ముస్లిం మహిళల సామాజిక, ఆర్థిక స్థితులు విషాదంగా, అపాయకరంగా ఉన్నాయని మోడీ సర్కారు సుప్రీం కోర్టుకు అఫిడవిట్ ఇచ్చింది. అక్టోబర్ 24 ఉత్తర్‌ప్రదేశ్ బుందేల్ ఖండ్‌లో ప్రధాని మతం, సంఘం పేరుతో మన తల్లుల, సోదరీమణులకు అన్యాయాన్ని సహించమన్నారు. 2017 ఫిబ్రవరి, మార్చిలలో జరిగిన యూపీ ఎన్నికల్లో ఇదే ప్రచార ఆయుధమైంది. ముస్లిం మహిళల ఓట్లను అందించింది. దీన్ని చట్టం చేస్తే మరింత మేలు జరుగుతుందన్న ఆశ పుట్టింది. అందుకే ఈ "మానవత్వ" బిల్లు. షమీమ్ ఆరా వర్సెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కేసులో 2002లోనే సుప్రీం కోర్టు ముమ్మాటి తలాక్ చెల్లదని తీర్పునిచ్చింది. షాయరా బానో వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో 2017, ఆగస్టు 22న తక్షణ తలాక్ నిర్హేతుకమైనదని, రాజ్యాంగబద్ధం కానేరదని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ముమ్మాటి తలాక్‌ను కొట్టేసింది. ఖురాన్ సమ్మతించని తక్షణ తలాక్‌ను షరియత్‌లో పరిగణించలేమని న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. 'షరియత్ అనువర్తన చట్టం, 1937' భారత ముస్లింలందరికి షరియత్‌ను అనువర్తింపజేసే చట్టం. ఇందులో సంధిగ్ధతలున్నాయి. ముస్లిం మగవారు భార్యలకు ఏకపక్షంగా విడాకులివ్వవచ్చు. ముస్లిం మహిళ భర్తకు విడాకులివ్వాలంటే 'ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939' సెక్షన్ 2 ప్రకారం కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలి. అటార్నీ జనరల్ హామీ ప్రకారం రాజ్యాంగ నిబంధన14ను అనుసరించి ఈ చట్టాలను సవరించాలి. ముస్లిం మహిళలను మాత్రమే "పట్టించుకొని", ఇతర మతాల మహిళలను అశ్రద్ధ చేయడం నిబంధన14 ఉల్లంఘనే. రాజ్యాంగ నిబంధన 25(2) ప్రకారం ఆర్థిక, రాజకీయ ప్రగతి కోసం మత సంబంధ విషయాలలో కూడా చట్టాలు చేయవచ్చు. అలాంటప్పుడు తక్షణ తలాక్ మాత్రమే ఎందుకు? ముస్లిం మహిళల వివాహ, విడాకులు, ఆస్తి, వారసత్వ హక్కులను క్రమబద్ధీకరిస్తూ ఎందుకు చట్టాలు చేయరు?

బిల్లు వివరాలు: ఈ బిల్లు తక్షణ తలాక్‌ను పౌరనేరంగా కాక క్రిమినల్ నేరంగా పరిగణించింది. వారంట్ అక్కరలేని, బెయిల్ కు అవకాశంలేని నేరంతో మూడేండ్ల జైలు, జరిమానా విధించింది. హిందూ వివాహం జీవిత బంధం. ముస్లిం వివాహం సామాజిక ఒప్పందమే. పరస్పర ఆమోదంతో విడాకులు తీసుకోవచ్చు. పునర్వివాహాలకూ అవకాశముంది. ముస్లిం వివాహ రద్దు పౌర నేర పరిధిలోనే రావాలి. క్రిమినల్ నేరాలలో చేర్చరాదు. ఒప్పంద తప్పిదంగా సుప్రీం కోర్టు గుర్తించిన విడాకుల లోపాన్ని సవరణతో సరిచేయాలి. నేరపరిధికి చేర్చి శిక్షించడం సరికాదు. ఈ చట్టంతో తలాక్ రద్దు కాదు. తక్షణ తలాక్ పై చర్యలుంటాయి. చట్ట అమలు బాధ్యత కోర్టుకు కాకుండా పోలీసులకు అప్పజెప్పారు. బాధిత ముస్లిం స్త్రీ ఫిర్యాదు చేయకుండానే విడాకులిస్తున్న మగవాళ్ళను జైల్లో పెట్టవచ్చు. దేశంలో 60శాతం పోలీసులు సంఘ్ కార్యకర్తలని ఒక పరివార నాయకుడన్నాడు. భవిష్యత్తులో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. పుకార్లతోనే హత్యలు చేసే పరివార్ కార్యకర్తలు, అధికారుల కనుసన్నుల్లో మెలిగే పోలీసులు కలిసి ఏమైనా చేయవచ్చు. మతప్రతీకారాలు తీర్చుకోవచ్చు. ముస్లిం పురుషుల మీద సంఘ్ కర్రలు నాట్యం చేస్తాయి. ముస్లిం మహిళలపై బీజేపీ సానుభూతి పారుతుంది. "బిల్లులో క్రిమినాలిటీయే సమస్య. మంత్రి వింటున్నారని నమ్ముతున్నాను." విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎమ్.జె. అక్బర్ బాధను వెళ్ళగక్కారు. ఈ చట్టం బాధిత మహిళల కష్టాలను తొలగించదు, పెంచుతుంది. సంపాదపరుడైన భర్త జైల్లో ఉంటే కుటుంబాన్ని పోషించేదెవరు? ఇతర చట్టాలతో సంబంధం లేకుండా విడాకులిస్తానన్న భర్త భార్యా పిల్లల పోషణకు, దినసరి ఖర్చులకు జీవన భృతిని చెల్లించాలి. జైలుకెళ్ళిన భర్త భృతిని ఎలా చెల్లిస్తాడు? తాత్కాలిక సహాయం వివరణ లేదు. పరిహారం అందేవరకు బాధితురాలు ఎలా బతకాలి? కొడుకును జైలుకు పంపితే ఆ బాధిత మహిళను ఆమె మెట్టినిల్లు ఆదరిస్తుందా? పెండ్లి తర్వాత నీ బతుకు నీదే అనే పుట్టినిల్లు ఆశ్రయమిస్తుందా? బిల్లులో ముస్లిం మహిళలకు అదనపు సౌకర్యాలేమీ లేవు. ఈ బిల్లులో ప్రస్తావించిన జీవన భృతి 'ముస్లిం మహిళల విడాకు హక్కుల రక్షణ చట్టం, 1986' ప్రకారం చెల్లించే భృతికి అదనమా అన్న వివరణ లేదు.

ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939 సెక్షన్ 2 (3) ప్రకారం భర్తకు ఏడేండ్ల జైలు శిక్ష పడితేనే ముస్లిం భార్య విడాకులకు అర్హురాలు. ఈ చట్టంలోని మూడేండ్ల జైలుతో



విడాకుల అర్హత రాదు. విడాకులు రానిదే పునర్వివాహం కుదరదు. బహు భార్యాత్వం, నికాహ్ హలాలా వంటి ముస్లిం మహిళలను వేధించే సామాజిక దుశ్చర్యల నివారణ బిల్లులో లేదు. పూర్వ భర్తను పునర్వివాహం చేసుకోవాలంటే ముస్లిం మహిళ మరొక వ్యక్తిని పెళ్ళి చేసుకొని అతనితో దాంపత్య జీవితాన్ని గడపాలన్న నియమమే నికాహ్ హలాలా. ఈ పద్ధతిలో ముస్లిం మహిళల సమ్మతికి చోటు లేదు. నికాహ్ హలాలా పూర్తికి భారీ రుసుము తీసుకునే అద్దె మొగుళ్ళు తయారయ్యారు. చట్ట రూపకల్పనకు సంబంధిత భాగస్వాములందరినీ సంప్రదించాలి. ఇందులో ముస్లిం మహిళా సంఘాలను, మహిళా ప్రతినిధులను సంప్రదించలేదని ప్రభుత్వమే తెలిపింది.

వక్రీకరణ బిల్లు అవసరమా? తలాక్‌తో, మతాలతో సంబంధం లేకుండా ముస్లిం మహిళల హక్కులకు రక్షణ ఉందని ముంబయి మహిళా న్యాయవాది, సంఘసేవకురాలు షహీన్ నక్స్ బంది అన్నారు. భారత మహిళలందరికీ గృహ హింస నిరోధక చట్టం, 2005, భారత శిక్షాస్మృతి 498ఎ అధికరణల ద్వారా రక్షణ ఉంది. సీపీసీ 125 ప్రకారం భర్త భార్యాపిల్లలకు జీవన భృతి చెల్లించాలి. ముస్లింల స్త్రీలకు 'ముస్లిం మహిళల చట్టం' రక్షణ కల్పిస్తోంది. దీనికంటే మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టమైతే మహిళలందరికీ మేలు జరిగేది. 2011 జనాభా లెక్కల్లో పట్టిక సీ 3 ప్రకారం వివాహబంధంలో కొనసాగుతున్న మహిళల్లో ముస్లింలు 87.8శాతం, హిందువులు 86.2శాతం, క్రైస్తవులు 83.7శాతం, ఇతరులు 85.8శాతం. ఎక్కువ మంది ముస్లిం మహిళలే వివాహబంధంలో ఉన్నారు. పునర్వివాహ సౌకర్యం కారణం కావచ్చు. వితంతువుల్లో ముస్లింలు 11.1శాతం, హిందువులు 12.9శాతం, క్రైస్తవులు 14.6శాతం, ఇతరులు 13.3శాతం. వితంతువుల్లో హిందువుల కంటే ముస్లింలే తక్కువ. విడాకులు ఇవ్వకుండా వదిలేయబడిన మహిళల్లో ముస్లింలు 0.67శాతం, హిందువులు 0.69శాతం, క్రైస్తవులు 1.19శాతం, ఇతరులు 0.68శాతం ఉన్నారు. ఇక్కడా ముస్లింలే తక్కువ. మన దేశంలో అనాథలైన మహిళల సంఖ్య 24.5 లక్షలు. వీరిలో హిందువులు 20 లక్షలు. ముస్లింలు 2.80 లక్షలు, క్రైస్తవులు 90 వేలు, ఇతరులు 80 వేలు. హిందువులలో అధికులు హరిద్వార్, మథుర, బృందావన్, వారణాసిలలో అధ్వాన్నంగా జీవిస్తున్నారు. వీరిపై లైంగిక దాడితో సహా అనేక రకాల దోపిడీలు జరుగుతున్నాయి. మెట్టినింట్లోనో, పుట్టినింట్లోనో ఉన్నవారు పనిమనుషుల్లా బతుకుతున్నారు.

దేశంలో 4.30 కోట్లమంది వితంతువులున్నారు. వారిలో 10 లక్షల మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాజు పేద, మతం కులం తేడాలు లేకుండా భర్తకు దూరమైన ప్రతీ మహిళ జీవితం దయనీయమే. కొడుక్కు అక్కరలేని కోడలు అత్తింటికి పట్టదు. అక్కడి పిల్లగా పెరిగిన ఆడపిల్లను పుట్టింటివారు పలకరించరు. 43 ఏండ్ల క్రితం వదిలేయబడ్డ జశోదా బెన్ మోడీ 24.11.2014న ఆయన పిలిస్తే ఆయన దగ్గరకెళతానన్నారు. ఆయన స్పందించలేదు. తలాక్ ఖురాన్ సమ్మతమే కాని ముమ్మాటి తలాక్ ఆమోదనీయం కాదు. సున్నీ చట్టంలోని 3 సాంప్రదాయాల్లో తక్షణ తలాక్ చెల్లుబాటు కాదు. నాల్గవ సాంప్రదాయం దేవ్ బంద్‌లో మాత్రం ఇది అమల్లో ఉంది. భారత ముస్లింలలో ఎంత మంది తక్షణ తలాక్‌ను పాటిస్తున్నారన్న గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేవు. చట్ట నేపథ్యంలో కూడా తెలుసుకునే ప్రయత్నాలు చేయలేదు. ఒక స్వచ్ఛంద సంస్థ ఇంటర్నేట్ సర్వేలో ఒకశాతం కంటే తక్కువ మంది ఈ పద్ధతిలో విడాకులిచ్చారని తేలింది. ఇంత తక్కువ మంది కోసం అందులోనూ సుప్రీం కోర్టు రెండు సార్లు రద్దుచేసిన తలాక్పై హామీ తప్పిన బిల్లు అవసరమేమి? రాజకీయ లబ్ధి తప్ప!

సెల్: 9490204545

ప్రపంచ దేశాల్లో అసమానతలు - 2018



తుమ్మల మోహనరావు

పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో ప్రపంచ దేశాల్లో అసమానతలు- 2018 అనే నివేదిక విడుదల చేసింది. సంస్కరణలు అమలు చేసిన గత 30-40 ఏండ్లలో ప్రపంచ వ్యాప్తంగానే, అభివృద్ధి చెందిన ధనిక దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న చైనా, భారత్, ఇతర దేశాల్లో ధనిక-పేదల మధ్య అసమానతలు పెరిగాయని తెలిపింది. మనదేశం కంటే చైనా అనేక రెట్లు అభివృద్ధి సాధిస్తూ, అంతరాల విషయంలో చాలా తక్కువ కలిగి ఉన్నదని తెలిపింది. రష్యాలోనూ, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో కూడా అసమానతలు పెరుగు తున్నాయని తెలిపింది.

సుమారు 170ఏండ్లనాడే మార్క్స్, ఏంగెల్సులు మానవ శ్రమ విలువ దోపిడీ అవుతోందనీ, దోపిడీ వర్గాలు, దోచబడే వర్గాలుగా సమాజం విడదీయబడిందని, బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాలుగా సమాజం మారుతూ వస్తున్నదని, ఈ దోపిడీ సమాజాల్లో అసమానతలు తప్పవని, అభివృద్ధి జరిగిన కొలదీ అంతరాలు మరింత పెరుగుతాయనీ, అందుకు ప్రత్యామ్నాయ విధానాలతో కార్మిక, కర్షక సకల శ్రామిక వర్గాలు అధికారంలోకి రావటాన్ని విప్లవం (అధికారం ఒక వర్గం నుంచి మరో వర్గానికి రావటం) అనీ, అప్పుడే ఆర్థిక, సామాజిక విధానాల్లో మౌలిక మార్పు సాధ్యమనీ, అందుకు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన అధికారంలోకి రావటమే శరణ్యమని తెలిపారు. తొంబయ్యవ దశకంలో మనదేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టబడినప్పుడు అన్ని పార్టీలు సమర్థించగా, కమ్యూనిస్టులు మాత్రమే వ్యతిరేకించారు. సంస్కరణలతో అప్రతిహతంగా దేశం అభివృద్ధి అవుతుందని, సంస్కరణలను వ్యతిరేకించిన కమ్యూనిస్టులు అభివృద్ధి నిరోధకులనీ, పిడివాదులనీ, వారికి పార్టీయే ముఖ్యమనీ, బూర్జువా పార్టీలతో అప్పటి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు దుమ్మెత్తిపోశాయి. కానీ గత 25ఏండ్ల అనుభవం చూసినప్పుడు ధనిక-పేదల అంతరాలు మరింత పెరుగుతూ, గుత్తపెట్టుబడిదారులు కోట్లకు పడగలెత్తు తుండగా, శ్రామికులు, పేదలు మరింత దిగజారిపోతున్నారు. దూరదృష్టితో కమ్యూనిస్టులు చెప్పినట్టుగానే ఫలితాలు వస్తున్నాయి. రిపోర్టులో చైనా గురించి రాస్తూ, అక్కడ పెట్టుబడులు మౌలిక వసతుల మీద, పరిశ్రమలు, వస్తూత్పత్తి మీద, విద్య, వైద్యం మీద పెట్టినవనీ తెలిపారు. కాబట్టి వాటి ఫలాలు సామాన్యులకు కూడా చేరాయని, అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాల్లో ఉత్పత్తి ఖర్చు ఎక్కువ కావటంతో, ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల అవకాశం చైనాలో ఉండటంతో చైనాకు పెట్టుబడులు వరదలై పారి, అప్రతిహత పురోభివృద్ధి సాధించింది. తమకు ఇష్టం లేకున్నా బహుళ జాతి కంపెనీలు చైనాలో ఉన్న కార్మిక రక్షణ చట్టాలకు అనుగుణంగానే కనీసవేతనాలు, రక్షణ చర్యలు, అమలు చేస్తూనే అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. కార్మిక చట్టాలను అమలు చేయని పక్షంలో చైనాలో పెట్టుబడులకు అనుమతినీయరు. చైనాలో భూమి అంతా ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. వ్యవసాయం చేసే రైతుకు నామ్‌కే వాస్తే కౌలుతో 99ఏండ్లు లీజుకు ఇచ్చి, పెట్టుబడులు, విత్తనాలు, ఎరువులు, మందులు అతి తక్కువ ధరకు



సమకూర్చి, రాబోయే పంటకు ముందే సరసమైన ధర నిర్ణయించి, పంటను కొనుగోలు చేస్తుంది.

రిపోర్టులో భారతదేశంలో మొదట్లో అంతరాలు తక్కువగా ఉన్నాయని, క్రిందిస్థాయి వర్గాల ఆదాయం జాతీయ సగటు ఆదాయం కంటే ఎక్కువ శాతంగా పెరిగిందని, కానీ గత 3 దశాబ్దాల్లో పరిస్థితి తిరగబడిందని తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చాక మొదటగా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నీయబడి అనేక బహుళార్థ సాధక, మధ్యతరహా ప్రాజెక్టులు నిర్మించబడి లక్షల మందికి ఉద్యోగాలు లభించి కోట్ల మంది రైతులు, రైతు కూలీలకు పనికల్పించబడి ఆదాయం పెరిగింది. తదుపరి అరవయ్యవ దశకంలో కమ్యూనిస్టు రష్యా, ఇతర తూర్పు యూరప్ కమ్యూనిస్టు దేశాల సహకారంతో ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయబడి లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించి కింది తరగతుల వారి ఆదాయం పెంచబడింది. తదనంతరం రష్యా, ఇతర దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోయి సోషలిస్టు విధానాలు రూపుమాపబడి పెట్టుదారీ విధానం ప్రవేశంతో ఆయా దేశాల్లో కూడా అసమానతలు పెరుగుతున్నాయి. ఆ క్రమంలో ప్రవేశపెట్టబడిన సంస్కరణల్లో భాగంగా స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ప్రయివేటుకు పెద్దపీట వేయటం, ప్రభుత్వ పాత్ర కుదించటం, ప్రపంచీకరణ, ఆటోమేషన్ చేయటం లాంటి విధానాలు అమలు జరుగుతున్నాయి.

సంస్కరణల ప్రవేశంతో విధానాలు తిరగబడ్డాయి. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను అశ్రద్ధ చేసి బడ్జెట్‌లను తగ్గిస్తూ సర్వీసు రంగంపై పెట్టుబడులు పెంచుకుంటూ పోతున్నాయి. వ్యవసాయంలో నూతన ప్రాజెక్టులు రావటం తగ్గి సాగుభూమి తగ్గుచున్నది. ఉత్పత్తి ఖర్చులు పెరగటం, గిట్టుబాటు ధర రాక వ్యవసాయం కుంటుబడటం, అప్పులు పెరగటంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. లక్షలాది వ్యవసాయ కార్మికులు పట్టణాలకు వలసలు పోయి అడ్డా కూలీలుగా మారుతున్నారు. చేతివృత్తులు నాశనమై వాటిపై ఆధారపడిన వారు దిక్కుతోచని పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు. వ్యవసాయంలో విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు, యాంత్రీకరణ ఫలాలు ధనిక రైతులు, కార్పొరేట్లకు మాత్రమే మేలు చేస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ పథకాలు కూడా ధనిక రైతులకే ఉపయోగపడుతున్నాయి. ఆ విధంగా గ్రామీణ పేదల, రైతుల, సామాన్యుల ఆదాయాలు పడిపోతున్నాయి. పారిశ్రామిక రంగాన్ని పరికించినప్పుడు ప్రభుత్వరంగంలో కొత్తవి రాకపోగా ఉన్నవే మూతపడు తున్నాయి. ప్రయివేటుకు తలుపులు తెరవటంతో బ్యాంకుల కుంభకోణాలు, దివాళాలు, గనుల కుంభకోణాలు, అనేక ఇతర కుంభకోణాలు జరిగి లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ (ప్రజల) సొమ్ము నష్టపోతున్న పరిస్థితి.

ప్రపంచ వ్యాప్తంగా కోట్ల రూపాయలు రక్షణ రంగానికి ఖర్చవుతోంది. ప్రతి దేశం తమ పన్ను రాబడిలో 30-40 శాతం రక్షణ రంగానికి ఖర్చు చేస్తోంది. అసమానతలు తగ్గాలంటే, ప్రపంచ శాంతి వర్ధిల్లాలంటే తప్పని సరిగా ప్రతిదేశంలోను కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన కార్మిక, కర్షక, సకల శ్రామిక శక్తుల చేతిలోకి అధికారం విప్లవాలు జయప్రదమై వచ్చి, దోపిడీ వ్యవస్థకు కారణ భూతమైన పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించి వేయాలి. మోసపూరిత ప్రభుత్వాలు ఆకర్షణీయ మాటలు ఎన్ని చెప్పినా, అభివృద్ధి పేరుతో ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆదాయాలు పెరగవు, అసమానతలు తగ్గవు.

సెల్: 9908503997

మతోన్మాద మరణమృదంగం



కొరవి వినయ్‌కుమార్

ఏక్, దో, ఏక్ - జై భీమ్
అంబేద్కర్ వాదులం - కులం గోడలను కూల్చేస్తాం

అంటూ మహారాష్ట్రలోని పుణేలో దళిత మహాజనుల కవాతు సాగింది. దేశమంతా పాశ్చాత్య సంస్కృతిలో పడి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటుంటే అక్కడి అణగారిన వర్గాలు మాత్రం తమ మూలాలను కాపాడుకుంటూ మరింత ఉన్నతస్థానానికి వెళ్లేందుకు తమ జాతిని చైతన్యం చేసే కార్యక్రమం చేపట్టారు. 200 సంవత్సరాల క్రితం తమను అన్ని రకాలుగా పట్టి పీడిస్తున్న, అణచివేతకు గురిచేస్తున్న, తమ హక్కులను కాలరాస్తున్న మతోన్మాదంపై జరిపిన తిరుగుబాటులో వీరమరణం పొందిన తమ వారిని స్మరించుకుంటూ, అక్కడ విజయం సాధించిన ఘటనకు గుర్తుగా విజయోత్సవ సభ నిర్వహించతలపెట్టిన అణగారిన వర్గాలపై పట్టపగలు, నడిబజార్లలో రాళ్లు రువ్వుతూ పరుగులు పెట్టించారు. ఈ దేశంలో అణగారిన వర్గాలపై మతోన్మాదుల మరణమృదంగాలు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాయనడానికి ఇదో పచ్చి ఉదాహరణ. నిమ్నవర్గాల చైతన్యాన్ని వారు తట్టుకోలేకపోతున్నారు. పైగా "బ్రిటిష్ వారి విజయానికి మనం పండుగ చేసుకోవడం ఏమిటీ?" అంటూ చరిత్రను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనలో దళిత యువకుడు రాహుల్ పతంగలే(28) ప్రాణాలను సైతం బలిగొన్నారు. ఈ దేశంలో నేడు ఒక చారిత్రక స్ఫూర్తిని స్మరించుకుంటూ దళితులు సంబరంగా సభ జరుపుకోవడం కూడా పాలకవర్గాలకు కంటగింపుగా మారింది.

ఆనాడు ఏం జరిగింది

19వ శతాబ్దం మొదట్లో ఈస్టిండియా కంపెనీ మరాఠా ప్రాంతాలపై పట్టుకోసం పెద్దఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. గ్వాలియర్ సింధియాలు, ఇండోర్ హోల్కర్లు, బరోడా గైక్వాడ్లు, నాగపూర్ భోంస్లేలతో ఒప్పందాలు కుదుర్చుకుని ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ హక్కులు పొందింది. పుణే పీష్వా బాజీరావు-2 ఇందుకు అంగీకరించకపోవడంతో 1817లో ఆయనపై దాడి చేసి ఓడించింది. దాంతో ఆయన తన అధికార కేంద్రమైన పుణేను వదిలి సతారాలో ఉండి, ఆ తర్వాత కొన్నాళ్లకు పీష్వా తిరిగి పుణేను దక్కించుకునేందుకు 28వేల మంది సైన్యంతో నగరాన్ని చుట్టుముట్టారు. వీరిలో ఎక్కువ మంది మరాఠీలే. పుణేలో ఉన్న ప్రధాన సేనకు అండగా 800మంది సైనికుల బ్రిటిష్ బలగం పుణేకు బయల్దేరింది. వీరిలో 500మంది వరకు మహర్ దళితులు. అయితే అప్పటికే ఈ మరాఠీలు, పీష్వాల అరాచకాలు పెచ్చుమీరిపోయాయి. అణగారిన వర్గాలపై అంటరానితనం, దాడులు వంటివి తీవ్రమై మహర్ కులస్తులు విసిగి వేసారిపోయారు. ఎలాగైనా పీష్వాల పీడ వదిలించుకోవాలనుకుంటున్న తరుణంలో బ్రిటిష్ సైన్యం మరోవైపు యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. దీనిని అదునుగా తీసుకున్న మహర్లు తమ బలానికి బ్రిటిష్ సైన్యం తోడైతే విజయం సులువుగా సాధించవచ్చని భావించారు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే అధికారికంగా బ్రిటిష్ సైన్యానికి మహర్లు మద్దతిచ్చినట్టు కనిపిస్తున్నా, మహర్లకే బ్రిటిష్ సైన్యం మద్దతు ప్రకటించినట్టుగా ఆనాటి పోరాటాన్ని నిశితంగా పరిశీలిస్తే అవగతమవుతున్నది. పీష్వా సైన్యంతో పోరాటానికి ముందు రోజు రాత్రంతా బ్రిటిష్ సైన్యం నడుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో యుద్ధం చేయాల్సి వస్తుందని ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వాధికారి, చరిత్రకారుడైన గ్రాంట్‌డఫ్ బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. కానీ యుద్ధ సమయానికి మహర్లలో రగిలిన చైతన్యానికి, బ్రిటిష్ సైన్యం తోడు కావడంతో యుద్ధంలో విజయం సాధ్యమైందనేది గమనించాలి. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని "శౌర్య దివార్ష్" పేరుతో దళిత సంఘాలన్నీ ఐక్య సంఘటనగా ఏర్పడి ఈ సభ నిర్వహించ తలపెట్టాయి. దేశవ్యాప్తంగా ఈ సభ నిర్వహణపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఈ సభకు దేశవ్యాప్తంగా దళిత సంఘాల నాయకులు స్వచ్ఛందంగా తరలొచ్చారు. బహుజన ముక్తి మంచ్, సమతా సైనిక్ దళ్, రిపబ్లికన్ విద్యార్థి సంఘాలు, అంబేద్కర్ విద్యార్థి, యువజన సంఘాలు, అంబేద్కర్‌వాదులు, బుద్దిస్టు సంఘాలు, ముస్లిం సంస్థలు ఇలా అనేక సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది జనం మహారాష్ట్రకు తరలొచ్చారు. అక్కడ ఓ తీర్థయాత్రకు వెళ్తున్నట్టుగా జన సమూహం ర్యాలీ నిర్వహించింది. చంటిపిల్లలను చంకలో ఎత్తుకొని మహిళలు సైతం తరలొచ్చారు. ఇంతటి వీరోచిత పోరాటం చేసిన తమవాళ్లను స్మరించుకుంటూ అలా విజయోత్సవ సభలు జరుపుకోవడం సముచితమే.

అణగారిన వర్గాల్లో ఇంతటి చైతన్యాన్ని తట్టుకోలేని మతోన్మాదులు శాంతియుత ర్యాలీపై రాళ్లతో విరుకుపడ్డారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారి వాహనాలను ధ్వంసం చేశారు. తగలబెట్టారు. మతోన్మాదులు విచక్షణారహిత దాడులకు ఓ దళిత యువకుడు బలయ్యాడు. వందలాది మంది గాయాలపాలయ్యారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ సభ జరుగుతుందని దేశవ్యాప్తంగా ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కనీస భద్రతా ఏర్పాట్లు కూడా చేయలేదు. లక్షలాదిమంది జనం తరలొస్తున్న క్రమంలో కనీసం పోలీసుల పర్యావేక్షణ కూడా పెద్దగా కనిపించలేదు. ఇదే మతోన్మాదులు మరింత రెచ్చిపోవడానికీ, ఓ ప్రాణం పోవడానికీ కారణమైంది. 200 ఏండ్లయినా మనువాదులకు, అంబేద్కర్ వాదులకు వైరం కొనసాగుతూనే ఉందనే సంకేతం వెలువడింది.

మహారాష్ట్ర ఓ చైతన్యపు గడ్డ

మహారాష్ట్రలోని పుణే ప్రాంతం ఓ దళిత చైతన్యపు గడ్డ. అక్కడి నుంచి ఓ ఆడబిడ్డ తాను చదువుకొని మహిళలందరికీ చదువు చెప్పాలని ముందుకు సాగి దేశంలో తొలి ఉపాధ్యాయురాలైంది. అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు చేస్తూ అక్కడి నుంచే ఓ మహాత్మా జ్యోతిరావు పూలే పుట్టాడు. తనతోపాటు తన భార్యను కూడగట్టుకొని ఎన్నో పాఠశాలలు స్థాపించి బాలికలు చదువు చెప్పించారు. మనువాదులను అడుగడుగునా ఎదుర్కొంటూ ఏ దిక్కూ లేనివాళ్లకు చదువుతో ధైర్యం నింపారు. అదే చైతన్యాన్ని పుణికిపుచ్చుకుంటూ దళిత కులంలో పుట్టిన ఓ యువకుడు ప్రపంచ మేధావిగా ఎదిగి తిరిగి తమ వారి వద్దకే వచ్చాడు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితమంతా ధారపోశాడు. అంటరానితనం నేరమన్నాడు. గాలి, నీరు, నేల, నింగి, నిప్పు పంచభూతాలు అందరి సొత్తుగా భావించాలన్నాడు. ఎన్నో పోరాటాలు చేసిన అంబేద్కర్ చివరికి రాజ్యాంగాన్ని రచించి వారి హక్కులను చట్టబద్ధం చేశాడు. ఆ చైతన్యంతోనే దళితులంతా నేడు ఒక్కటవుతున్నారు. తమ వారి విజయాలను స్మరించుకోవడంలో దేశమంతా ఒక్కటయ్యారు. ఆ చైతన్యం ఎప్పటికీ కొనసాగాలని కోరుకుంటున్నారు. మతోన్మాదం నశించి మానవత్వమే మిగలాలని కోరుకుంటున్నారు. కులం అంతరించి సమాజం కొనసాగాలని కోరుకుంటున్నారు.

సెల్: 9989135989

భేండీ భళా రుచులు...



బెండకాయ అనగానే ఆమడ దూరం పరిగెడతారు. జిగురుగా ఉంటుందని ఇష్టపడని వారు చాలామంది. అయితే రెగ్యులర్‌గా కాకుండా కాస్త టేస్టీగా, చూడముచ్చటగా ఉండే బెండకాయ రుచులను వండితే ఇష్టంగా తింటారు. బెండకాయ కాంబినేషన్‌లో రకరకాల ఫ్లేవర్స్‌ను తయారు చేసుకోవచ్చు. బెండకాయ ఫ్రై, కొబ్బరి వేపుడును చపాతీలో లేదా రొట్టెలో నంజుకొని తింటే రుచి కమ్మగా ఉంటుంది. అలాంటి నోరూరించే వంటకాలు మీ కోసం.. ఓ సారి ప్రయత్నించి చూడండి!

బెండకాయ కొబ్బరి వేపుడు...



కావాల్సిన పదార్థాలు: తరిగిన బెండకాయలు-ఒక కప్పు, తరిగిన పచ్చిమిరపకాయలు-మూడు, పచ్చికొబ్బరి తురుము-సగం కప్పు, వెల్లుల్లి రెబ్బలు-ఆరు, కరివేపాకు-రెండు రెమ్మలు, ఉప్పు-తగినంత, కారం-తగినంత, పసుపు-చిటికెడు, ఎండు మిరపకాయలు-రెండు, పోపు దినుసులు-ఒక చెంచా, జీలకర్ర పొడి-ఒక చెంచా, కొత్తిమీర-కొద్దిగా, నూనె-మూడు చెంచాలు.

తయారీ విధానం: స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేడి చేసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో ఎండుమిరపకాయలు, పోపు దినుసులు, పచ్చిమిరపకాయలు, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, బెండకాయ ముక్కలు వేసి పది నిమిషాలు వేయించుకోవాలి. బెండకాయలు వేగాక ఉప్పు, కారం, పసుపు వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత పచ్చి కొబ్బరి తురుము, జీలకర్ర పొడి వేసి బాగా కలుపుకోవాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది.

పులుసు...



కావాల్సిన పదార్థాలు: నూనె-రెండు చెంచాలు, బెండకాయ ముక్కలు-ఒక కప్పు, పోపు దినుసులు (ఆవాలు, జీలకర్ర, మినపప్పు)-ఒక చెంచా, మెంతులు-చిటికెడు, వెల్లుల్లి రెమ్మలు-నాలుగు, తరిగిన పచ్చిమిర్చి-రెండు, తరిగిన ఉల్లిగడ్డ-ఒకటి, కట్ చేసిన టమాటా ముక్కలు-ఒకటి, కరివేపాకు రెమ్మలు-రెండు, పసుపు-చిటికెడు, చింత పండు పుసులు-కొద్దిగా, ఉప్పు-తగినంత, కారం-ఒక చెంచా, కొత్తిమీర-కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో పోపు దినుసులు, మెంతులు, ఉల్లిగడ్డ ముక్కలు, వెల్లుల్లి రెమ్మలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. ఇవి వేగాక దాంట్లో టమాటా ముక్కలు, బెండకాయ ముక్కలు, కారం, ఉప్పు వేసి పది నిమిషాలు మూత పెట్టాలి. ఆ తర్వాత చింత పండు పులుసు పోసి కొద్ది సేపు మరిగించుకోవాలి. చివరగా కొత్తిమీర తురుము వేసుకుంటే చాలు బెండకాయ పులుసు రెడీ!

బెండకాయ కూర...



కావాల్సిన పదార్థాలు: తరిగిన బెండకాయలు-సగం కప్పు, నూనె-రెండు చెంచాలు, ఉల్లిగడ్డ-ఒకటి, టమాటాలు-రెండు, కారం-ఒక చెంచా, ఉప్పు-తగినంత, పోపు దినుసులు-ఒక చెంచా, కరివేపాకు-రెండు రెమ్మలు, కొత్తిమీర-కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె వేడి కాగానే పోపు దినుసులు, కరివేపాకు, బెండకాయ ముక్కలు వేసుకొని పది నిమిషాలు నూనెలో మగించుకోవాలి. ఆ తర్వాత ఉప్పు, కారం, పసుపు, టమాటా ముక్కలు వేసి ఉడికించుకుంటే సరిపోతుంది. చివరగా కొత్తిమీర తో గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది.

బెండకాయ ఫ్రై...

కావాల్సిన పదార్థాలు: బెండకాయలు-ఒక కప్పు, శనగ పప్పు-చిన్న కప్పు, నూనె-ఐదు చెంచాలు, ఉప్పు-రుచికి తగినంత, జీలకర్ర-ఒక చెంచా, ధనియాలు-ఒక చెంచా, మినపప్పు-ఒక చెంచా, వెల్లుల్లి రెబ్బలు-ఐదు, నువ్వులు-ఒక చెంచా, పసుపు-ఒక చెంచా, ఎండుమిర్చి-పది.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి చెంచా నూనె పోసుకోవాలి. నూనె వేడి కాగానే మినపప్పు, శనగ పప్పు, ధనియాలు, జీలకర్ర, నువ్వులు, ఎండుమిరపకాయలు, వెల్లుల్లి రెమ్మలు, శనగ పప్పు, పసుపు, ఉప్పు వేసి బాగా వేయించుకోవాలి. ఆ తర్వాత వీటిని మెత్తగా గ్రైండ్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత బెండకాయలను నిలువుగా కట్ చేసుకొని గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని దీంట్లో నింపి నూనెలో వేయించుకుంటే సరిపోతుంది.



మసాలా బెండకాయ...



కావాల్సిన పదార్థాలు: బెండ కాయలు-సగం కప్పు, తరిగిన ఉల్లిగడ్డ-ఒకటి, తరిగిన టమాటా-ఒకటి, తరిగిన పచ్చిమిర్చి-రెండు, పసుపు -చిటికెడు, కారం -రెండు చెంచాలు, ఉప్పు-తగినంత, నూనె -మూడు చెంచాలు, అల్లం వెల్లుల్లి ముద్ద-ఒక చెంచా, ధనియాల పొడి-ఒక చెంచా, జీలకర్ర-ఒక చెంచా, జీడిపప్పు-సగం కప్పు, గసగసాలు-ఒక చెంచా, గరం మసాలా-ఒక చెంచా, కొత్తిమీర-కొద్దిగా.

తయారీ విధానం: బెండకాయలను రెండు ముక్కలుగా కట్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. ఇలా చేసిన తర్వాత జీడిపప్పు, గసగసాలను మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె వేడి కాగానే దాంట్లో ఉల్లిముక్కలు, పోపుదినుసులు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కలపాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు, పసుపు, కారం, ఉప్పు, ధనియాల పొడి, గరం మసాలా పొడి, వేయించుకున్న బెండకాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు ఊడికించుకోవాలి. ఆ తర్వాత ముందుగా గ్రైండ్ చేసుకున్న జీడిపప్పు పేస్టు, నీళ్ల పోసుకొని రెండు నిమిషాలు ఊడికించుకోవాలి. చివరగా కొత్తిమీర తో గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది.

బెండకాయ మిర్చి...

కావాల్సిన పదార్థాలు: బెండకాయలు-పది, నూనె-వేయించుకోవడానికి తగినంత, ఉప్పు-తగినంత, కారం-కొద్దిగా, పసుపు-చిటికెడు, శనగ పిండి-రెండు కప్పులు.

తయారీ విధానం: ముందుగా బెండకాయలను నిలువుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత శనగ పిండిలో కొద్దిగా ఉప్పు, కారం, పసుపు చిటికెడు వేసి బజ్జీ పిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. చివరగా స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసుకోవాలి. నూనె వేడి కాగానే బెండకాయలను బజ్జీ పిండిలో ముంచి నూనెలో వేయించుకుంటే సరిపోతుంది.



డియోడరెంట్...



ఆఫీసుకు లేదా అకేషన్‌కు వెళ్లినా కచ్చితంగా డియోడరెంట్‌లను ఉపయోగిస్తారు నేటి తరం వారు. ముఖ్యంగా ఇవి దుర్వాసనకు కారణమయ్యే చెడు బ్యాక్టీరియాను దూరం చేస్తాయి. అంతేకాదు ఇవి వాడటం వల్ల కొన్ని గంటలపాటు దుస్తులు సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. అయితే వీటి వాడకం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో? డియోడరెంట్‌లను ఎలా వాడాలో తెలుసుకుందాం.

- డియోడరెంట్‌ల తయారీకి రకరకాల రసాయనాలను ఉపయోగిస్తారు. వాటిని ఎక్కువ కాలం వాడటం వల్ల చర్మ , శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయి.
- డియోడరెంట్‌లను భుజాల కింది భాగాల్లో ఎక్కువగా వేసుకుంటారు. అయితే రొమ్ము ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.
- ఎక్కువ రసాయనాలు ఉన్న క్రీములు, మాయిశ్చరైజర్లు, పర్‌ఫ్యూమ్‌లు, డియోడరెంట్‌లు, కండీషనర్లు ఉపయోగించడం వల్ల చర్మం త్వరగా తేమను కోల్పోతుంది. దాంతో చర్మానికి దురద, మచ్చలు, మంట లాంటి ఇబ్బందులు వస్తాయి.
- చాలామంది స్నానం చేసిన వెంటనే డియోడరెంట్ రాసుకుంటారు. ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదు. ఎందుకంటే శరీరం తేమగా ఉన్నప్పుడు బయటి నుంచి వచ్చే తేమను గ్రహించదు. కాబట్టి మొత్తం తయారయ్యాక చివరగా డియోడరెంట్‌ను స్ప్రే చేసుకోవాలి. అప్పుడే డియోడరెంట్ అందించే సువాసనా పరిమళాలను శరీరం గ్రహిస్తుంది.
- డియోలను ఎక్కువగా ఉదయం వేళల్లోనే ఉపయోగిస్తారు. సాయంత్రం పూట ఏదైనా శుభకార్యాలకు వెళ్లేటప్పుడు వేసుకుంటే మాత్రం మరుసటి రోజు ఉదయం కచ్చితంగా సబ్బుతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ❄





అంకగల్ల. సునీత
కందుకూరు
రంగారెడ్డి జిల్లా

13 చుక్కలు
6 వచ్చేవరకు
మధ్యచుక్క



మానస
పరకాల
వరంగల్ జిల్లా

21 చుక్కలు
1 వచ్చేవరకు

ముత్యాల ముగ్గులు




ఓ తెల్ల కాగితంపై ముగ్గు వేసి, చక్కటి రంగులతో నింపి మాకు పంపండి. ముగ్గు వేసే విధానం అర్థమయ్యేలా ఉండాలి. ముగ్గులోని చుక్కల సంఖ్య, ఇతర వివరాలను కూడా చేర్చండి. మీ పేరు, చిరునామాతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా జతచేయండి.

మా చిరునామా
మానవి,నవతెలంగాణదినపత్రిక,
ఎం.హెచ్. భవన్,
21/1, అజామాబాద్, హైదరాబాద్-20.
ఇ-మెయిల్:
navamaanavi@gmail.com

హాస్యం, విశ్లేషణ ఆమె శైలి

రచయితగా, జర్నలిస్టుగా సమాజంలో మహిళల అభ్యున్నతి కోసం స్టెల్లా కృషి చేశారు. ఆమె రచించిన తొలి నవల 'కోల్డ్ కంఫర్ట్ ఫామ్ (1932)' తో ఆమె ఖ్యాతి విశ్వవ్యాపితమైంది. ఈ పుస్తకం అనేకసార్లు ముద్రించబడింది. ఆ తర్వాత ఆమె 22 నవలలు, అనేక సాహిత్య రచనలు చేశారు.

ఐరోపాలో స్టెల్లా జన్మించారు. ఆమె తాత చార్లెస్ ప్రెస్టన్ గిబ్బన్స్, సివిల్ ఇంజనీర్. ఆమె తండ్రి టెల్‌ఫోర్డ్ గిబ్బన్స్ లండన్ హాస్పిటల్లో వైద్యుడుగా పనిచేసేవారు. తల్లి మాడ్ విలియమ్స్.



స్టెల్లా డోరతీ గిబ్బన్స్
(5జనవరి, 1902 - 19 డిసెంబరు, 1989)

ఉత్తర లండన్ కాలేజియేట్ పాఠశాలలో చేరిన స్టెల్లా ప్రతిభకు గుర్తింపు లభించింది. స్కూలు స్థాయిలోనే కథలు రాస్తూ.. సీనియర్ డ్రమాటిక్ క్లబ్‌కు వైస్ ప్రెసిడెంట్ అయ్యారు. పాఠశాల డిబేటింగ్ సొసైటీలో ఆమె ప్రముఖ గౌరవ కార్యదర్శిగా వ్యవహరించారు.

ఆ తర్వాత జర్నలిజంలో పట్టా తీసుకుని 'ది ఈవినింగ్ స్టాండర్డ్', 'ది లేడీ' పత్రికల్లో రిపోర్టర్, ఫీచర్ రైటర్‌గా పనిచేశారు. తను సేకరించిన పద్యాలతో 1930 లో మొదటి పుస్తకం స్టెల్లా ప్రచురించారు. ఆ తర్వాత గ్రామీణ వాతావరణం నేపథ్యంలో వచ్చిన తొలి నవల 'కోల్డ్ కంఫర్ట్ ఫామ్ (1932) రచయితగా మంచి గుర్తింపు తీసుకువచ్చింది. ఆమె రచనాశైలి ప్రముఖులను సైతం ఆకట్టుకుంది.

1950 లో రాయల్ సొసైటీ అఫ్ లిటరేచర్ ఫెలోగా చేరారు. స్టెల్లా రచనల్లోని హాస్యం, వివరణాత్మక విశ్లేషణ విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ❄

ఓ పుస్తకం చదవండి...




ఒక్కోసారి త్వరగా అలసిపోవడం, చికాకు పడటం వంటివి జరుగుతాయి. దీనికి కారణం పని ఒత్తిడి. ఇక ఒత్తిడి సమయంలో ఏ పనిపైనా దృష్టిపెట్టలేం. ఇక ఆ సమయంలో ఏం చేయాలో తోచదు! మరోపక్క చేతిలో ఉన్న పని పూర్తికాక ఒత్తిడి పెరుగుతుంది. ఈ పరిస్థితిని అంత తేలిగ్గా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దాని నుంచి బయట పడాలంటే కింది చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- ఒత్తిడి ఎక్కువైతే తక్షణం మెదడుకు వేరే పని చెప్పండి. లేదా ఓ పదినిమిషాలపాటు ఏదైనా పనిని పూర్తి చేయండి. లేదా ఒక పుస్తకం చదువుకుంటూ కూర్చోండి. ఇలా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇవన్నీ కాకుంటే క్యాలెండర్‌ను తీసుకుని.. వారం పాటు ఏమేం చేయాలో చిన్నపాటి ప్రణాళికను తయారు చేసుకోండి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.
- ఉద్యోగంలోనే కాదు జీవితంలోనూ చేసిన పనే చేయడం, ఒకే వాతావరణంలో ఉండటం వల్ల పనుల పట్ల ఆసక్తి తగ్గుతుంది. సమయం దొరికితే స్నేహితులతో కలిసి ఎక్కడికైనా కొత్త ప్రదేశాలకు వెళ్లడం, లేదా వాళ్లను ఇంటికి పిలవడం వంటివి చేయాలి.
- ఎప్పుడూ ప్రతికూల భావాలతో ఉండే వారితో గడపడం వల్ల కూడా ఒత్తిడి ఎక్కువవుతుంది. కాబట్టి వాళ్లకి దూరంగా ఉండాలి. ❄

ఇట్లచేద్దాం

చేతికి ఉన్న వెల్లుల్లి వాసన పోవాలంటే.. నల్లాకింద స్టీల్ చెంచాను ఉంచి దాని మీదుగా వచ్చే నీటితో చేతులు కడగాలి. ఆ తర్వాత సబ్బుతో మాములుగా చేతులు కడిగేయాలి. వెల్లుల్లి వాసనను తగ్గించడంలో లోహం శక్తివంతంగా పని చేస్తుంది.

మార్క్స్ పెట్టుబడి గ్రంథానికి తగ్గని ప్రాధాన్యత



తంగిరాల చక్రవర్తి

చరిత్ర యవనికపై మార్క్స్ ఎప్పటికీ నిష్క్రమించడు. అతడు పుట్టి ఇప్పటికి దాదాపు 200 సంవత్సరాలైంది. అతని ఆశ(ల)యాలపై తొలిగా సోషలిస్టు దేశం రష్యా ఏర్పడి 100 సంవత్సరాలు దాటింది. అతను "క్యాపిటల్" (పెట్టుబడి) గ్రంథం రాసి దాదాపు 150 సంవత్సరాలైంది (1867). నేడు పై మూడు అంశాల ప్రాధాన్యత రిలవెన్స్ (ప్రాసంగికత) సమకాలీనత ఎంతో ఉంది. అట్టడుగు శ్రామిక వర్గాన్ని తన కవిత్వంతో చైతన్య శీలురుగా చూపిన కవి రాబర్ట్ బర్న్స్ (1959-96). కారల్‌మార్క్స్ తనకు ఇష్టమైన కవిగా బర్న్స్ చాలా సందర్భాల్లో పేర్కొన్నాడు. అభాగ్యుల కన్నీళ్ల కవిత్వంగా మలచిన బర్న్స్ ప్రభావం మార్క్స్ ఆలోచనలు, సిద్ధాంతాలు ఆ వర్గాల వైపు మళ్లింపజేసి ఉండొచ్చు.

వ్యాపారాలు దేశ దేశాలకూ విస్తరిస్తున్నాయి. కానీ ఆయా ఉత్పత్తులు వాటి సంపద ఫలాలు, శ్రామికులకు, సామాన్యులకు చేరడం లేదు. బానిసలా 20 గంటలు శ్రమించే స్థితి నుంచి ఫ్రెంచి విప్లవమైనా, రష్యన్ విప్లవాలైనా ఎగసిపడ్డాయి. నేడు ఐటీ హబ్స్, బార్, రెస్టారెంట్స్, ఐమ్యాక్స్‌లు వస్త్ర నగల దుకాణాల్లో 14 నుంచి 18 గంటలు పని చేసే శ్రామికుల్ని రాజధాని ప్రాంతాల్లోనే చూస్తున్నాం. ఆయా కంపెనీలకు మన చట్టాలు లేబర్ రూల్స్ వర్తించవు(ట)? ఇదే విడ్డూరం.

కార్మికలోక కళ్యాణ సారధిగా రూపొందించడానికి మార్క్స్ ప్రేరణ ఇచ్చి ఉండొచ్చు. సామాజిక వ్యవస్థలో సంపదకు సమాజమే సొంతదారు. రాజ్యరహిత, వర్గ రహిత, సమాజ స్థాపనకు కృషి చేయడమే 'సోషలిస్ట్' వ్యవస్థ నిర్మాణానికీ, ఆ తర్వాత కమ్యూనిజం స్థాపనకు మార్గదర్శకాలు. సామాజిక ప్రక్రియలపై ప్రజల భావాల్లో వచ్చే మౌలిక మార్పు విప్లవం. అది సామాజిక, సోషలిస్టు మార్పును ఆకాంక్షిస్తుంది. శాపిస్తుంది కూడా. నిజానికి రూసో అన్నట్టుగా మానవుడు స్వేచ్ఛాజీవిగా జన్మించాడు కానీ ఎక్కడ చూసినా బందీగానే ఉన్నాడు. మనిషిని మరో మనిషి 24 గంటలకు పైగా శ్రమ చేయిస్తూ దారుణంగా, బానిసగా మార్చి సాగించే దోపిడీని దేశ దేశాల్లోకి చొరబడి మానవ రక్తం పీల్చే పెట్టుబడిదారీ, పెత్తందారీ సమాజ అత్యున్నత దశయే సామ్రాజ్యవాదం. "1980-90 మధ్యకాలం నుంచి ప్రపంచీకరణ, సరళీకరణ విశ్వం ఒక సైబర్ కుగ్రామం లాంటిది" అనే అందమైన పదాల పొందికల చిలుకపలుకులు వివిధ దేశాల్ని దివాళా తీయించాయి. ఆకలి, అప్పుల బాధలకు నెట్టివేశాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఈ రోజు ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నాయి. "ఎంతో ఆధునిక టెక్నాలజీ, రోబోటిక్ వ్యవస్థ నిర్మిస్తున్నాం" అని గొప్పలు చెప్పుకునే సంపన్న దేశాలు ఈనాడు ఎందుకు ఆర్థిక మాన్యంతో అతలాకుతలం అవుతున్నాయి. ఆ బూర్జువా దేశాలు, పండితులు, ఆర్థికవేత్తలు ఎందుకు మార్క్స్ పెట్టుబడి గ్రంథ అధ్యయనంలో తలమునకలవుతున్నారు. శ్రామికుడిని తెరమీదకు తెచ్చిన ఘనత మార్క్స్‌దే. ఈ విషయాల్నే ఇటీవల వెలువడిన క్యాపిటల్ ఇన్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ గ్రంథం తేటతెల్లం చేసింది. పెరిగే మానవ జనాభా, మానవ అవసరాలు ఉత్పత్తి దాని సామర్థ్యం పెంపు మొదలైన అంశాల్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి. మార్క్స్ భావాలు అతని రచనల్లో దేశాల సంపద టెక్నాలజీ వల్ల వస్తోందని అంటారు. నిజానికి టెక్నాలజీ పెరిగినా శ్రామికుడే కదా సకల పనులు, ఉత్పత్తులు, సంపద పెంచేది. శ్రామికుడు తెరపై లేని సమాజాన్ని, సంపదను ఊహించలేం కదా. సంపద సృష్టికర్త శ్రామికుడే. సంపద ఉత్పత్తి లాభాలు, జీడీపీ పెరుగుదలలు అభివృద్ధికి చిహ్నాలవుతున్నాయి. వ్యాపారాలు దేశ దేశాలకూ విస్తరిస్తున్నాయి. కానీ ఆయా ఉత్పత్తులు వాటి సంపద ఫలాలు, శ్రామికులకు, సామాన్యులకు చేరడం లేదు. బానిసలా 20 గంటలు శ్రమించే స్థితి నుంచి ఫ్రెంచి విప్లవమైనా, రష్యన్ విప్లవాలైనా ఎగసిపడ్డాయి. నేడు ఐటీ హబ్స్, బార్, రెస్టారెంట్స్, ఐమ్యాక్స్‌లు వస్త్ర నగల దుకాణాల్లో 14 నుంచి 18 గంటలు పని చేసే శ్రామికుల్ని రాజధాని ప్రాంతాల్లోనే చూస్తున్నాం. ఆయా కంపెనీలకు మన చట్టాలు లేబర్ రూల్స్ వర్తించవు(ట)? ఇదే విడ్డూరం. జార్ పాలన చదువుకున్నాం. ఈ చోర్ పాలకుల పాలన తీరు చూస్తున్నాం, అనుభవిస్తున్నాం. టెక్నాలజీ, క్యాపిటేషన్ లాభాలకే ప్రాధాన్యత ఇస్తాయి. పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధికే దోహదపడతాయి. డిస్ట్రిబ్యూషన్ (పంపకం) అంశంపై చర్చ జరగాలి, జరగడం లేదు. శ్రామికులకు టెక్నాలజీ అభివృద్ధి ఫలాలు చేరడం లేదు. పెట్టుబడి గ్రంథ రచనా కాలం కంటే నేటి రోబోటిక్ యుగంలో దీని ప్రాసంగికత, ప్రాధాన్యత (రెలవెన్స్) ఎక్కువగా ఉంది.

1871లో పారిస్ కమ్యూన్ (2 నెలల్లో విఫలం), ఆ తర్వాత 1917 రష్యా, 1949లో చైనా, ఆ క్రమంలో వియత్నాం, తూర్పు జర్మనీ, క్యూబా (1958), పోలెండ్ ఆఫ్ఘనిస్తాన్, ఉత్తర కొరియా, చిలీ, కంపూచియా, ఆల్బేనియా, జెకోస్లేవియా, రుమేనియా, లావోస్, మంగోలియా 1/3 భూ మండలం ఎర్రజెండా కింద సమీకృతమై సోషలిస్టు సమాజం దిశగా అడుగులు వేసింది. మార్క్స్ సిద్ధాంత పునాదిపై సరిగా పనిచేయని దేశాలు తలకిందులయ్యాయి. సోషలిస్టు దేశాల అభివృద్ధిని నెహ్రూ నుంచి బన్‌స్టీన్ దాకా అభినందించి అబ్బురపడ్డారు గదా. 1864 సెప్టెంబర్ 28 లండన్‌లోని సెంట్ మార్టిన్ హాలులో మొదటి ఇంటర్నేషనల్ స్థాపన జరిగింది. 1883లో మార్క్స్ కాలం చేశాడు. 1848వ సంవత్సరం ఐరోపాలో సంభవించిన విప్లవాల నేపథ్యంలో రాసిన అత్యంత ప్రజాదరణ పొందిన గొప్ప గ్రంథం కమ్యూనిస్టు ప్రణాళిక, మరొకటి పెట్టుబడి గ్రంథం. విశ్వ మానవ కళ్యాణం కోసం మార్క్స్ పెట్టుబడి గ్రంథం అధ్యయనం తప్పనిసరి అవసరం.

పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నంతకాలం మార్క్స్ ఆలోచనా స్రవంతి దాని అస్తిత్వ ప్రయోజనాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది. వర్గ పోరాటం అనివార్య పరిస్థితుల్లో సంఘర్షణ, వైరుధ్యాలు, అసమానతలపై యుద్ధం తప్పదు. వర్గ ప్రయోజనాల మధ్య నిత్య ఘర్షణ తప్పనిసరి. దోపిడీ ద్వారా సొంత ఆస్తి, ఒక వర్గానికి ప్రాబల్యాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. మరో వర్గానికి దు:ఖాన్ని కొని తెస్తుంది. సమాజ హితం కోసం ఈ దు:ఖాన్ని రూపుమాపాలంటే ప్రైవేటు ఆస్తిని రద్దు చేయాలి. మార్క్స్ పెట్టుబడి గ్రంథాన్ని మూడు నాలుగు సార్లు అధ్యయనం చేయాలి. అప్పుడే అది అర్థం అవుతుంది. రాజ్యం దోపిడీ అనుకూల స్వభావాన్ని, ప్రజా వ్యతిరేక తత్వాన్ని బహిర్గతం చేస్తూ కొడవటిగంటి కుటుంబరావు 'బకాసుర కథ 1961లో రాశాడు. నెహ్రూవియన్ సోషలిజం పీడిత ప్రజల కోసం కాదు, నూతన సంపన్న వర్గాల ప్రయోజనాలు కాపాడేది మాత్రమే అని 1964లోనే కాళీపట్నం రామారావు మాస్టారు యజ్ఞం కథ రాశాడు. పెట్టుబడి గ్రంథం తెలిగ్గా అవగాహనకు రాపర్తి వెంకటరాజు జల నాటకం రాశాడు. ఇది చాలా గొప్పది. రాజ్యం, ధనిక వర్గం స్వభావం చెప్పే మంచి నాటకం. చాగంటి సోమయాజులు బొండుమల్లెలు, రావిశాస్త్రి బల్లచెక్క, సిఎస్.రావు గుమ్మడి గింజలు, తమ్మేటి రఘోత్తమరెడ్డి పని మనిషి కథలు చదవాలి. చూడాలి. సంపద సృష్టించే సామాన్యుడే సార్వభౌముడు కావాలి.

ఫోన్: 9393804472

బీసీ సబ్‌ప్లాన్ వాగ్దానాన్ని మరిచిన ప్రభుత్వం



కిల్లె గోపాల్

బీసీల సమగ్రాభివృద్ధి కోసం సబ్‌ప్లాన్‌ను ప్రకటిస్తానన్న ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఆ వాగ్దానంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మ్యానిఫెస్టోలో బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రతీ ఏడు రూ.5వేల కోట్లు కేటాయించి అమలు చేస్తానని పేర్కొన్నారు. మూడున్నరేండ్లు గడిచిపోయాయి. వాగ్దానం అమలుకు ప్రయత్నంలేదు. ఓట్ల కోసం, ప్రజలను మభ్యపెట్టడానికి ఎన్నో పథకాలను మ్యానిఫెస్టోలో చూపిస్తారు. తీరా అధికారం దక్కిన తర్వాత ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. కాలం గడిచిపోతుంది. తిరిగి ఎన్నికల సమయం సమీపించే కొద్దీ కొత్త వాగ్దానాలు, హామీలు ముందుకొస్తాయి. పాత వాగ్దానాలు గాలికి పోయి, కొత్త వాగ్దానాలతో ప్రజలను మురిపిస్తారు. ఊరిస్తారు వారివెంట ఉరికిస్తారు.

2017 నవంబర్ 7న బీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరాలకు బీసీల దశాబ్ది అభివృద్ధి ప్రణాళిక పేరిట ఒక సదస్సు నిర్వహించారు. ఆ తర్వాత వివిధ జిల్లాలలో కూడా సదస్సులు నిర్వహించి బీసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వం తన ప్రణాళిక పెట్టి దాన్ని బలోపేతానికి సూచనలు, సలహాలు అడిగితే బాగుండేది. కానీ ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక పెట్టకుండానే సమావేశం నిర్వహించింది.

2017 నవంబర్ 7న బీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరాలకు బీసీల దశాబ్ది అభివృద్ధి ప్రణాళిక పేరిట ఒక సదస్సు నిర్వహించారు. ఆ తర్వాత వివిధ జిల్లాలలో కూడా సదస్సులు నిర్వహించి బీసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వం తన ప్రణాళిక పెట్టి దాన్ని బలోపేతానికి సూచనలు, సలహాలు అడిగితే బాగుండేది. కానీ ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక పెట్టకుండానే సమావేశం నిర్వహించింది. దానిలో బీసీ సబ్‌ప్లాన్ గూర్చి ప్రస్తావనలేదు. కనీసం ప్రస్తుతం బీసీ కులాల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన, రాజకీయ, స్థితిగతులపై సమాచారంలేదు. దీనికి అధ్యక్షత వహించిన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్.రాములు 2024 సంవత్సరానికి అభివృద్ధిపై కలలుకనండి అని తాను రచించిన దీర్ఘకవితా పుస్తకం "విహారం" ఒకటి ఇచ్చి, అందులో తాను కలగన్నట్టుగా మీరు కలగనాలని ఉచిత సందేశం ఇచ్చారు. హాజరైన బీసీ, ఎంబీసీ సంచార జాతుల సంఘాల నాయకులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దానికి సంక్షేమశాఖా మాత్యులు జోగు రామన్న లేదా అధికారులు ఏ మాత్రం సమాధానం చెప్పలేదు.

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 ఆగష్టులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. ఇది ఎంతో ప్రతిష్టాత్మకం అని ప్రకటించింది, దాని వివరాలు నేటికీ బయటకు అధికారికంగా వెల్లడి చేయలేదు. ఆ విషయాన్ని ప్రశ్నిస్తే ఆయా కులాల, సంఘాల నాయకులను "మీరు మీ దగ్గర అన్ని వివరాలు ఉంటాయి కదా?" అని ఎదురు ప్రశ్నించాడు అధక్షత వహించిన బీసీ చైర్మన్. 2018 జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా బీసీల సమగ్ర సర్వే నిర్వహిస్తామని దానికి రెవెన్యూ యంత్రాంగం, ఉపాధ్యాయుల సహకారంతోపాటు 100 కోట్లు ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రతిపాదన పంపినట్టు పత్రికలలో వార్త వచ్చింది. ఇది వాస్తవామా కాదా? అని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుండి సమాధానంలేదు.

రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం బీసీల జనాభా 1.86 కోట్లు అంటే రాష్ట్ర జనాభాలో 51.08 శాతం 113 కులాలు బీసీలుగా గుర్తించారు. (113వ కులంగా అనాథలను బీసీ జాబితాలో చేర్చారు). బీసీలలో కూడా ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ స్థితిగతుల్లో తేడాలున్నవి. మొదటి జాతీయ బీసీ కమిషన్ కాకలేల్కర్, రెండో జాతీయ కమిషన్, బీసీ మండల్ కమిషన్, ఉమ్మడి రాష్ట్రంలో అనంతరామన్, మురళీధర్‌రావు కమిషన్ ఎన్నో సూచనలు సలహాలు ఇచ్చాయి. కమిషన్ ఏర్పాటు చేసినప్పటి ఉత్సాహం, దాని సిఫార్సులు అమలు చేయడంలో ప్రభుత్వాలకు ఉండటం లేదు. ప్రభుత్వాలు మారినప్పుడు అంతకు ముందు ప్రభుత్వాలు చేసిన కృషిని పరిశీలించి దాని లోపాలను సరిచేసి అమలుకు ప్రయత్నాలు చేయడంలేదు. అందువల్ల కమిషన్ల సిఫార్సులు చాలా మట్టుకు అమలుకు నోచుకోలేదు.

జనరల్ అభివృద్ధిలో భాగంగా బీసీల అభివృద్ధి చూపినప్పుడు వారు ఎన్నటికీ అభివృద్ధి చెందరు. సమాజంలో తేడాలు, అంతరాలు యథావిధిగా ఉంటాయి. ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తేనే సరైన ఫలితాలు వస్తాయి. అందుకోసం బడ్జెట్‌లో ప్రత్యేకమైన నిధులు కేటాయించాలనే కోరిక ముందుకు వస్తున్నది. ఎస్సీ, ఎస్టీల మాదిరి బీసీలకు సబ్ ప్లాన్ ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించి, చిత్తశుద్ధితో కృషి చేస్తే తప్ప అభివృద్ధిలో ఈ వర్గాలు భాగస్వాములు కాలేరు.

రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన బంగారు తెలంగాణ సాకారం కావాలంటే బీసీల అభివృద్ధికి ప్రత్యేకనిధి '(సబ్‌ప్లాన్) అవసరం. వచ్చే బడ్జెట్ సమావేశంలో సబ్‌ప్లాన్ ప్రకటించాలి. ఆలోగా సంచారజాతులు, ఎంబీసీ, బీసీ సంఘాలు, మేధావులతో సమావేశాలు నిర్వహించాలి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటున్న దశాబ్ది ప్రణాళిక 2014-2024 రూపొందించబడుతుంది. అలాకాకుంటే ఇది కూడా ఎన్నికల ఎత్తుగడగానే భావించాల్సి వస్తుంది. చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండాలి.

ఫోన్: 9490098760

రైతు ఆవేదన కాటిపాలేనా...



మేకిరి దామోదర్

భారతదేశానికి రైతే వెన్నుముక, అన్నదాత అంటూ ప్రచారపటాటోపాలతో పల్లకిలో మోస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నిధుల కేటాయింపులో మాత్రం అరకొర వాటాలతో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులు మారినా, పార్టీలు మారినా రైతంగానికీ, వ్యవసాయ రంగానికీ పట్టిన దరిద్రాన్ని అంతమొందించలేక పోతున్నారు. గత ఏడాది మిర్చి పంట వేసిన రైతులకు పెట్టిన పెట్టుబడి రాక మిర్చి పంటను చేలల్లో, మార్కెట్ యార్డుల్లో తగలబెట్టిన దీనస్థితిని చూశాం. నేడు వరిపంటను దోమపోటుతో పొలాల్లో తగలబెడుతున్నారు. పత్తిపంట చేతికందే సమయానికి అకాలవర్షాలు ఒకవైపైతే, కార్పొరేటు విషకౌగిలిలో బహుళజాతి కంపెనీల ఘరానా మోసాలకు సుమారు 700 కోట్ల అక్రమ బీటీ పత్తి విత్తన దందాతో రైతాంగం బలిపశువులయ్యారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన బోల్‌గార్డ్-3 పత్తి విత్తనాలకు మన రాష్ట్రం అడ్డగా మారింది. రహస్యంగా ఖరీఫ్ కాలంలో రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో ఈ విత్తనాలు వేయగా, దిగుబడి సగానికి సగం తగ్గడం మూలంగా, రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నష్టం విలువ సుమారు 2,600 కోట్లు ఉంటుందని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తుంది. బహుళజాతి కంపెనీల అక్రమ విత్తన వ్యాపారంలో స్థానిక విత్తన వ్యాపారులు, బ్రోకర్లు సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారు. ఇంతజరిగినా వ్యవసాయశాఖ నిమ్మకునీరెత్తినట్టు ఉండడం వెనకాల చేతివాటమే కారణమా అనిపిస్తుంది. దీనికితోడుగా మార్కెటు యార్డులు దోపిడీ కేంద్రాలుగా మారాయి. సీసీఐ కొర్రీలతో పత్తికి ధర గిట్టుబాటు కాక రైతు బోరున విలపిస్తున్నారు. వీరికి అండగా ఉండాల్సిన అధికారులు, వ్యాపారులు అడ్తిదారులు నిర్లజ్జగా దోపిడీ చేస్తూనే ఉన్నారు. పత్తి పంటకు తెచ్చిన అప్పులు ఎలా తీరాలని యువ రైతులు ఆందోళనకు గురికావలసి వస్తుంది. వ్యవసాయానికీ, రైతాంగానికి ఏ విధంగా చూసినా అటు సమయానికి వర్షాలు పడక, పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు పడడం వల్ల అన్నదాత నోటి కాడికొచ్చిన ముద్ద రాబందుల్లా తన్నుకెళ్తున్నందువలన వీరి స్థితి దీనంగా మారింది. మద్దతు ధర నిర్ణయించడంలో ప్రభుత్వాలకు స్పష్టమైన విధానాలు లేక శాస్త్రీయంగా రైతు పెట్టుబడికి తగిన పంటకు మద్దతు ధర రాకపోవడం వలన తెచ్చిన అప్పులు తీర్చలేక రైతాంగం బతుకు అగమ్యగోచరంగా మారింది. ఇది ఎన్నో ఏండ్లుగా కొనసాగుతుంది. దీనిని అరికట్టాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది. వ్యవసాయ రంగంలో సంక్షోభం అనేది ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో, రైతాంగం పండించే పంటల్లో ఏదో ఒక పంట వల్ల వచ్చిన సమస్య కాదు. దేశ వ్యాప్తంగా అన్ని రకాల రైతులు ఏదో విధంగా బాధలను ఎదుర్కొంటున్నారు. దీనిని పాలకులు ఎన్నికల వేళ ఏదో రైతాంగానికి బిచ్చం వేసినట్టు రుణమాఫీ అనో, మద్దతు ధర అనో మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతంలో అధ్యయనం చేసిన, జయతిఘోష్, స్వామినాథన్, రాయల్ లాంటి కమిషన్లను సమీక్షించుకొని ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రీయ అధ్యయనం చేసి పాలకులు రేపటి ఓటు కోసం కాకుండా, రేపటి తరం వ్యవసాయరంగం అంటే మక్కువ కలిగేలా చేయాలి. ఎంత బడ్జెట్ వెచ్చించైనా గాడిలో పెట్టి అభివృద్ధి పరచకపోతే రేపటి తరానికి నేటి పాలకుల వలన కూటికి గింజ దొరకని వ్యవస్థకు మూలకారకులు అవుతారని భావించడం ఖాయం. పాలకులూ... చరిత్ర హీనులు కాకండి. ఆకలి రాజ్యానికి ఆజ్యం పోయకండి. రైతు ఉద్యమాలపై ఉక్కుపాదం మోపితేనో, జైల్లో వేస్తేనో, రైతాంగంపై కాల్పులు జరిపితేనో, బేడీలు వేస్తేనో, కట్టడి చేయగమనుకుంటే "తల్లిపాలు తాగి రొమ్ములు గుద్దే" విధానమే అవుతుంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో కిసాన్ ముక్తి యాత్రల మూలంగా రైతాంగ పోరాటాలసారం ఒక్కటే, కావున కర్షకులంతా ఒక్కటవ్వాలనే అభిప్రాయంతో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రైతు సంఘాలు 184 ఒక వేదిక మీదకు (వచ్చాయి) తెచ్చారు. జాతీయ శాండిల్ సర్వే ప్రకారం పురుషులు 59 శాతం, మహిళలు 75 శాతం మంది వ్యవసాయరంగంపైనే ఆధారపడి జీవిస్తున్న దేశం మనది. దీనికి అనుబంధంగా కూలీలు, ఇతర వృత్తులకు ఇదే జీవనాధారం. ఇంతమంది ఆధారపడ్డ రంగాన్ని ఇలా గాలికి వదిలేస్తే ఎలా? వీరంతా ఎన్నికల్లో వరుసలో నిలబడి ఓపికగా ఓట్లువేస్తేనే కదా అధికార పీఠం ఎక్కింది. కానీ ఓటు (పోలింగ్)కు దరిదాపులకు రాని కార్పొరేటు రంగానికి లక్షల కోట్ల రాయితీల పేరుతో బంగారు పళ్లెంలో పెట్టి ధారాదత్తం చేయడాన్ని ఎలా చూడాలి? పాలకులు కోరుకునేది రైతు రాజ్యమా? కార్పొరేటు వ్యాపార వర్గాల రాజ్యమా తెలుసుకోండి? పార్లమెంటులో రైతాంగం, వ్యవసాయంపై ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి, రైతుకు ఆపదలేని జీవితాన్ని అందించాల్సిన బాధ్యత పాలకులదేనని గమనించండి.

ఫోన్: 9573666650

నిరుద్యోగుల చావులపై జోకులేస్తారా?



సార్ల శ్రీనివాస్

నిరుద్యోగుల ఆత్మహత్యలపై జోకులు వేస్తూ సోషల్ మీడియాలో సమస్యపై ఏ మాత్రం అవగాహన లేకుండా విష ప్రచారం చేస్తూ పైశాచిక అనందం పొందుతున్న దుర్మార్గులకి సమాధానంగా ఆవేదనతో రాస్తున్న పోస్ట్ ఇది. 60 ఏండ్ల కింద తెలంగాణ ఉద్యమం మొదలైందే ఉద్యోగాలలో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా. 2009లో కేసీఆర్ మాలిదశ ఉద్యమం ఫ్రీజోన్ వల్ల ఉద్యోగాలలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా నిరాహార దీక్షకు పూనుకున్నాడు. దాంతో తెలంగాణలోని విద్యార్థులంతా "కేసీఆర్ మా భవిష్యత్ కోసమే ప్రాణ త్యాగానికి సిద్ధపడుతున్నాడ"ని మనసా, వాచా, కర్మణా నమ్మి టీఆర్ఎస్‌కు మద్దతుగా ఉద్యమంలోకి వచ్చారు. 2009కి ముందు కేసీఆర్ పోరాటానికి తెలంగాణ జిల్లాల్లో ఎలాంటి స్పందన వచ్చిందో అందరికీ తెలుసు. 2009-10 వరకే డిగ్రీలు పూర్తి చేసుకున్న యువతను "తెలంగాణ వచ్చాక మన ఉద్యోగాలు మనకే" అని హామీలు గుప్పిస్తూ ఉద్యమంలోకి వచ్చేలా చేశారు. 2009 నుండి 20014 వరకు ఉమ్మడి ఆంధ్రాలో ఎన్ని ఉద్యోగ ప్రకటనలు వచ్చినా తెలంగాణ నాయకులు కేసీఆర్‌తో సహా ఆ ఉద్యోగ ప్రకటనలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువతను రోడ్ల మీదకు తీసుకొచ్చారు అయినా తెలంగాణ నిరుద్యోగులు తమ విలువైన భవిష్యత్‌ను ఫణ్ణంగా పెట్టి కేసీఆర్ మీద నమ్మకంతో ఒకవైపు చదువుతూ మరోవైపు ఉద్యమం చేస్తూ తెలంగాణ పోరాటానికి అండగా నిలిచారు. అప్పటికే డిగ్రీలు, పీజీలు పట్టుకుని తెలంగాణ వస్తే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఆశలు కురిపిస్తే అది నమ్మి అప్పులు తెచ్చి చదువుకుంటూ, మరోవైపు ఉద్యమం చేస్తూ, పోలీసుల చేతుల్లో తన్నులు తింటూ, ఆంధ్రా ప్రజలతో అమ్మనా భూతులు తింటూ, వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ తెలంగాణ కోసం కొట్లాడింది విద్యార్థులు, నిరుద్యోగులు. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యే నాటికే ప్రభుత్వ ఉద్యోగం కోసం ఐదేళ్ల ప్రిపరేషన్ పూర్తి చేసుకున్నారు. ఇక రాష్ట్ర ఏర్పాటు తరువాత 2014 ఆగస్టు 15న గోల్కొండ సాక్షిగా "త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్లు, తెలంగాణ అవసరాలకు తగ్గట్టు సిలబస్ మారుతుంది" అని ప్రకటిస్తే అప్పటికప్పుడు నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగారు. ఇంట్లో పూట గడవకపోయినా వానీ, వీని కాళ్లు మొక్కి, ఆత్మ గౌరవం చంపుకుని అప్పులు తెచ్చుకున్నారు. అమ్మ మెడలో పుస్తెల తాడు కుదువపెట్టి కోచింగ్ సెంటర్ల బొక్కలో పోశారు. కోచింగ్ సెంటర్లతో ఈ ప్రభుత్వం కుమ్మక్కై త్వరలో నోటిఫికేషన్లు అని ప్రకటనలు గుప్పిస్తూ కోచింగ్ సెంటర్ల చుట్టూ నిరుద్యోగులు తిరిగేలా చేసింది. 2015 వచ్చినా నోటిఫికేషన్లు రాకుంటే ప్రభుత్వం కుదుటపడటానికి ఇంకా సమయం పడుతదనుకుని మాకు మేము సర్ది చెప్పుకున్నాం. అప్పటికే ఆర్థికంగా చితికిపోయి ఉన్న బతుకులకు ఆసరాగా ఉంటదాని ప్రయివేట్ ఉద్యోగాలు చూసుకుంటే, ప్రభుత్వం మళ్లీ 10 రోజులకు ఒకసారి పత్రికలలో "త్వరలో ఉద్యోగాలు, త్వరలో ఉద్యోగాలు" అని ఊరిస్తూ నిరుద్యోగులు చేస్తున్న ప్రయివేట్ ఉద్యోగాలు వదిలేసి పుస్తకాలు పట్టేలా చేసి, కోచింగ్ సెంటర్ల మెట్లెక్కేలా చేసింది. ఎట్టకేలకు 2015 డిసెంబర్ చివరన గ్రూప్2 ప్రకటన ఇచ్చారు. దేశంలోనే నంబర్.1 పీఎస్సీ అని చెప్పుకునే సంస్థ పరీక్ష నిర్వహణలో దారుణంగా విఫలమైంది. పరీక్షాపత్రంలో 36 తప్పులు ఇచ్చి గ్రూప్2 పైన కోర్టులో కేసులు పడి ఆగిపోయేలా చేసింది, అది ఇప్పటి వరకూ దిక్కు లేదు.

రెండేండ్లకు ఒకసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని సుప్రింకోర్టు తీర్పును సైతం తుంగలో తొక్కి ప్రభుత్వ పాఠశాలల విలీనం తరువాతే డీఎస్సీ అని సంవత్సరం గడిపారు. తరువాత ఎన్‌సీటీఈ ప్రకారం కొత్త నిబంధనలు రూపొందించడానికి 6 నెలలు గడిపారు. అదికూడా అయ్యాక కొత్త జిల్లాల ప్రకారమా, పాత జిల్లాల ప్రకారమా అని తర్జనభర్జన పడటానికి మరో 6 నెలలు తీసుకుని చివరికి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు కాకముందే కొత్త జిల్లాల ప్రకారం డీఎస్సీ వేసి న్యాయపరంగా చిక్కులు కలిగేలా చేసి, కోర్టులో కేసులు పడేలా చేసి, అది కూడా రద్దు చేసారు. మళ్లీ పాత జిల్లాల ప్రకారమే డీఎస్సీ అని ప్రకటించి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడారు. గురుకుల నోటిఫికేషన్, సింగరేణి, పోలీసు ఉద్యోగాలు ఇలా అన్నిట్లో కేసులు పడేలా వ్యూహాలు రచించి నిరుద్యోగుల సమయాన్ని, జీవితాలను సర్వనాశనం చేస్తున్నారు. న్యాయ వివాదాలు సష్టించింది ప్రభుత్వమే, కేసులు పడి ఉద్యోగాలు ఆగిపోయేలా చేసింది ప్రభుత్వమే, ప్రభుత్వం తప్పు లేకుంటే న్యాయస్థానాలు ఎందుకు ఉద్యోగ కేసుల విషయంలో స్టేలు ఇస్తాయి. ఇప్పటివరకు నియామకాలు పూర్తి చేసింది ఒక్క పోలీసు శాఖ, సింగరేణి తప్ప మిగతా ఏ ఉద్యోగాలలో ఎంతమందికి నియామక పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో ఆశలు కల్పించి నిరుద్యోగులు ప్రయివేట్ ఉద్యోగాలు చేసుకోకుండా చేసింది ప్రభుత్వం కాదా. 7 ఏండ్ల విలువైన సమయాన్ని వథా చేసి మీ రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాన్ని ఫణ్ణంగా పెట్టి ఇప్పుడు ఉద్యోగాలు ఎక్కడ? అని అడిగితే ప్రయివేట్ ఉద్యోగాలు చేయడం చేతగాక, ప్రభుత్వ ఉద్యోగాలు అడుగుతున్నారని ఎగతాళి చేస్తారా? కొందరికి ప్రయివేట్ ఉద్యోగాలు అంటే ఆసక్తి, కొందరికి ప్రభుత్వ ఉద్యోగాలు అంటే ఆసక్తి, మీరు ఎవరు మా లక్ష్యాన్ని ఎగతాళి చేయడానికి? ప్రభుత్వ ఉద్యోగం మా హక్కు. మానసికంగా నిరుద్యోగులను కుంగదీసి అప్పులపాలు చేసి వాళ్లు ఆత్మహత్యలు చేసుకుని చస్తే నిరుద్యోగులకు అండగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయవలసింది పోయి నిరుద్యోగుల చావులపై జోకులు వేస్తూ పిచ్చి పట్టినట్టు పైశాచిక అనందం పొందుతున్నారు కొందరు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేకపోతే ఖాళీగా ఉన్న ఉద్యోగాలైనా ఇవ్వమని అడిగితే నిరుద్యోగులను ఇంత నీచంగా అవహేళన చేయడానికి సిగ్గుగా లేదా? నిన్న మురళి చదువంటే భయపడి ఆత్మహత్య చేసుకున్నాడా? పీజీ వరకు చదివి వచ్చినవాడు ఇప్పుడే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడని ఇంగిత ఆలోచన లేకుండా కేవలం ప్రభుత్వానికి భజన చేయడానికి అసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యే లేనట్టు నిరుద్యోగ సమస్యల మీద ఇంత దుర్మార్గంగా విష ప్రచారాలు చేస్తారా? మీరా తెలంగాణ వాదులు.. మీరా బంగారు తెలంగాణ తెచ్చేది?

ఫోన్: 7793941842

డిగ్రీ విద్యకు దూరం చేస్తున్న డిటెన్షన్ విధానం



మాదం తిరుపతి

తెలంగాణలో ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్వయంగా మన ముఖ్యమంత్రే అనేక సందర్భాల్లో మాట్లాడిన విషయం అందరికీ తెలుసు. కానీ ముఖ్యమంత్రి మాటలకు పూర్తి విరుద్ధంగా నిర్ణయాలు జరుగుతన్నాయి. రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థులకు ప్రవేశం ఒకే విధంగా ఉంటుంది. కానీ అందులో అమలు చేసే విధానాల్లో తేడాలెన్నో ఉన్నాయి. ఉదా: కాలేజీల అనుమతులు, పరీక్షల రుసుం, పరీక్షలు నిర్వహించే విధానం ఇలా వివిధ అంశాలలో తేడాలుంటాయి. అయితే ఏ విధానం అమలైనా విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలి. కానీ అందుకు భిన్నంగా మన యూనివర్సిటీ అధికారుల పనివిధానం ఉంది. ఇప్పటికే సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల వద్ద ఫీజులు, మెటీరియల్స్ పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. 2016-17 విద్యా సంవత్సరానికి దాదాపు 2,06,379 మంది విద్యార్థులుంటే అందులో 1,93,886 మంది హాజరయ్యారు. ఈ సంవత్సరం నుండి డిగ్రీలో చాయిస్ బెస్ట్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎల్) అమలు చేస్తున్నారు. ఈ సీబీసీఎల్ అమలు వల్ల కనీసం 50శాతం క్రెడిట్ పాయింట్లు సాధించాలి. లేందంటే పై తరగతులకు వెళ్లకుండా డిటెయిన్ చేస్తారు. కానీ సీబీసీఎస్ విధానం ఎలా ఉండాలో పూర్తిస్థాయి లో అధికారులకు, అధ్యాపకులకు అవగాహన లేదు. దీనివల్ల కేవలం మూడు యూనివర్సిటీల్లో దాదాపు ఉస్మానియా-4,650, శాతవాహన -2,300, పాలమూరు -3,200 మంది డిటెయిన్ అయ్యారు. మొత్తం 10,500 మంది విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోయారు. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ యూనివర్సిటీలలో డిటెన్షన్ అమలు చేస్తే 15,800 మంది విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయేవారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తరగతి గదులు, ల్యాబ్స్, లైబ్రరీ, బోదనా సిబ్బంది లేకుండా సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో చదువు కూడా చెప్పలేని దుస్థితి ఉంది. ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో వసతులు లేకుండా అనుమతులిస్తున్నారు. అందులో అనుభవం లేనివారితో బోధన చేస్తున్నారు. వసతులపై దృష్టి పెట్టకుండా అధికారులు భావిభారత పౌరులైన విద్యార్థులను డిటెన్షన్ చేయడం విడ్డూరంగా ఉంది. తప్పు అధికారులదీ, శిక్ష మాత్రం విద్యార్థులకా? రాష్ట్రంలో 6 యూనివర్సిటీల పరిధిలో డిగ్రీ పరీక్షల విధానం కొనసాగుతుంది. కానీ కేవలం మూడు యూనివర్సిటీల్లో మాత్రమే డిటెన్షన్ విధానం ఎందుకు అమలు చేస్తున్నారనేది అనేక అనుమానాలకు దారితీస్తున్నది. అధికారులకు యాజమాన్యాల మధ్య జరిగే చర్చల్లో అధికారుల ఆధిపత్యం కోసమా? లేక ప్రభుత్వం అందిస్తున్న రీయింబర్స్‌మెంట్ నుంచి ప్రభుత్వానికి లాభం చేకూర్చే విధానం కోసమా అనేదే ఇక్కడి ప్రశ్న? యూనివర్సిటీ అధికారుల నిర్ణయాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ఈ విధానం వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి. అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యాన్నీ సామాజిక వేత్తలు, విద్యావేత్తలంతా ప్రశ్నించాలని కోరుతున్నాం. డిగ్రీ విద్యపై ఒక సమగ్ర రూపకల్పన చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

ఫోన్: 9491962243

టీఆర్టీకి తెలంగాణ సర్కారు కొర్రీలు



గుంటుపల్లి నవీన్

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాగిన తెలంగాణ ఉద్యమం ఫలితంగా ఏర్పడ్డ రాష్ట్రంలో నిరుద్యోగులు అలాగే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యమంలో ముందుండి కొట్లాడిన విద్యార్థులపై బాధ్యతతో వ్యవహరించాల్సిన టీఆర్ఎస్ సర్కారు నిబంధనల పేరుతో వారిని ఉద్యోగాలకు దూరం చేస్తోంది. ఇందుకు తాజాగా విడుదల చేసిన టీఆర్టీ నోటిఫికేషనే నిదర్శనం. ఐదేండ్లుగా ఆశగా ఎదురుచూసిన ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలతో చాలామంది గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు నియామక పరీక్షకు దూరమవుతున్నారు. రేపో మాపో నోటిఫికేషన్ రాకపోతుందా అని భావించిన నిరుద్యోగులు వేలాదిమంది ఇప్పటికే కోచింగ్ సెంటర్లలో అప్పులు తెచ్చి శిక్షణ పొందుతున్నారు. సర్కారు నోటిఫికేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45 శాతం మార్కులు ఉంటేనే పరీక్ష రాయడానికి అర్హతగా పేర్కొంది. దీంతో ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు బీఈడీ, డీఈడీ, పండిట్ ట్రెయినింగ్ చేసిన అభ్యర్థులు ఇక నిరుద్యోగులుగానే మిగిలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్)కు జనరల్ అభ్యర్థులకు 45శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 మార్కులు ఉన్న వారే అర్హులుగా పేర్కొన్నది. తెలంగాణ టెట్‌లో మాత్రమే కాకుండా కేంద్ర ప్రభుత్వం 6నెలలకోసారి నిర్వహిస్తున్న సెంట్రల్ టెట్‌కు కూడా ఇవే నిబంధనలు ఉన్నాయి. కానీ తాజాగా విడుదల చేసిన టీఆర్టీ నోటిఫికేషన్‌లో మాత్రం నిబంధలను మార్పు చేసింది. దీంతో టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు కూడా టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్టుకు దూరమయ్యే పరిస్థితి ఉంది. టీఆర్టీ నిబంధనలతో టెట్ ఉత్తీర్ణత సాధించిన 45వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ అభ్యర్థులు నష్టపోయే పరిస్థితి ఉంది. డీఈడీ, బీఈడీ ఎంట్రెన్స్ పరీక్షలో 40శాతం మార్కులు ఉన్నా కోర్సుకు అనుమతించిన ప్రభుత్వం సంబంధింత ఉద్యోగానికి మాత్రం అర్హత లేదని పేర్కొనడం దారుణమని నిరద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృత్తి విద్యా కోర్సులను చదివినా ప్రభుత్వం కొర్రీలు పెట్టడం వల్ల జీవింతాంతం నిరుద్యోగులుగానే ఉండిపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు. కొత్త జిల్లాల పేరుతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచించడంతో ఒక్కో జిల్లాలో అసలు పోస్టులే లేని పరిస్థితి ఉంది. పోస్టులు ఉన్న రెండు మూడు జిల్లాలో పోటీ పడదామంటే తాజా నిబంధనలు పరీక్షకు దూరం చేస్తున్నాయని నిరుద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ నేపథ్యంలో దానిని సవరించి పాత జిల్లాల ప్రాతిపదికన నోటిఫికేషన్‌ను తాజాగా విడుదల చేసింది.

జీవో 25లో పేర్కొన్న అంశాలివే

- స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో 50శాతం మార్కులతో డిగ్రీ లేదా పీజీ, సంబంధింత మెథడాలజీతో బీఎడ్ ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులు. బీసీ, ఎస్టీ, ఎస్సీ వికలాంగులకు 45శాతం మార్కులు ఉండాలి.
- సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు ఇంటర్మీడియేట్‌లో జనరల్ అభ్యర్థులకు కనీసం 50శాతం మార్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 45శాతం మార్కులు ఉండాలి. రెండేండ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేండ్ల ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిగ్రీ ఉండాలి.
- భాషా పండిట్ పోస్టులకు సంబంధిత భాష డిగ్రీలో జనరల్ అభ్యర్థులకు 50శాతం మార్కులతో బీసీ, ఎస్టీ, ఎస్సీ, వికలాంగులకు 45 శాతం మార్కులుండాలి. సంబంధిత మెథడాలజీలో బీఎడ్ లేదా పండిట్ శిక్షణ పొంది ఉండాలి.

ఫోన్: 9441403306

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, ఫోన్‌నెంబర్ ఇవ్వాలి.

\- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228



వెరిజాన్ ఐటీ ఉద్యోగులకు న్యాయం చేయండి

- కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు బాధితుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ఐటీ సంస్థలో ఉద్యోగుల తొలగింపు చట్టవిరుద్ధమని బాధితులు ప్రకటించారు. ఈ అంశంపై జోక్యం చేసుకొని తొలగించిన ఐటీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆర్ చంద్రశేఖరమ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కార్మిక భవన్‌లో ఆయనను పలువురు ఐటీ ఉద్యోగులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వెరిజాన్ సంస్థలో వివిధ విభాగాల్లో ఐటీ సేవలు అందిస్తామని తెలిపారు. గతనెల 12,13 తేదీల్లో బలవంతం చేయడం వల్ల రాజీనామా లేదంటే తొలగింపునకు అంగీకరించామని పేర్కొన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్‌తో సంప్రదించి విధుల్లోకి తీసుకోవాలని కోరినా ప్రయోజనం లేదని, ఉద్యోగాల్లోకి తీసుకుంటామని ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిపారు. ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ మానవ హక్కులు ఉల్లంఘించబడ్డాయని పేర్కొన్నారు. సంస్థలో ఉద్యోగులు కాని వారు తమను తొలగించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తమను బలవంతం చేయడం వల్ల వందలాది మంది ఉద్యోగులు రాజీనామా చేశారని పేర్కొన్నారు. ఈ అంశంపై జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. తిరిగి ఉద్యోగాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌ను కలిసిన వారిలో పివి నవీన్‌చంద్ర, సతీష్ డి కాంబ్లే, ఎం రమేష్‌బాబు, ఎస్ శివారెడ్డి, కె కృష్ణకిశోర్, ఎ శ్రీనివాసరావు, రమేష్‌నాయుడు, పి విజయ్‌కుమార్ తదితరులున్నారు.

మైనార్టీ కవిత్వ పుస్తకావిష్కరణకు టీడీపీ అడ్డు

బెజవాడ పుస్తక మహోత్సవంలో ఉద్రిక్తత

- పోలీసుల రక్షణలో బయటకు తరలింపు



అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

విజయవాడ : విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ్‌లో బుధవారం రాత్రి ఉద్రిక్తతకు దారితీసింది. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో స్కై బాబా సంపాదకత్వంలో వెలువడిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు అడ్డుకున్నారు. నిర్వాహకుల తో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. దీంతో పుస్తకావిష్కరణ వాయిదా పడింది. స్కైబాబాను నిర్వాహకులు, రచయితల సంరక్షణలో అక్కడి నుంచి తరలించాల్సివచ్చింది. స్కైబాబా, షాజాహానాల సంపాదకత్వంలో 35 మంది మైనార్టీ రచయితలు రాసిన కవితల సంకలనం'మొఖామి'ని బుధవారం రాత్రి ఆవిష్కరించాల్సిఉంది. అంతకుముందే అక్కడకు చేరుకున్న టీడీపీ నాయకులు పుస్తకావిష్కరణకు, స్కైబాబాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో స్కైబాబా ఆంధ్రులను తిడుతూ అసభ్యకరమైన కవితలు రాశారని, ఆయన రాసిన పుస్తకాన్ని ఎలా ఆవిష్కరిస్తారని వారు ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట వర ప్రసాద్ (అన్నా), టీడీపీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, తెలుగు యువత నాయకులు చాగంటి విజయభాస్కర్, ఆ పార్టీకి చెందిన పలువురు మహిళలు, సోషల్ మీడియా విభాగానికి చెందిన కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఆవిష్కరిస్తున్నది స్కైబాబా రాసిన పుస్తకం కాదని, ఆయన సంపాదకత్వంలో వచ్చిన మైనార్టీ కవిత్వ పుస్తకాన్ని మాత్రమేనని నిర్వాహకులు నచ్చచెప్పడానికి ప్రయత్నించినా వారు ఖాతరు చేయలేదు. కార్యక్రమానికి హాజరైన పలువురు కవులు, రచయితలు స్కైబాబా కవితలతో తాము ఏకీభవించడం లేదని, అయితే పుస్తకాన్ని ఆవిష్కరించుకునే హక్కు ఆయనకుందని చెప్పడానికి ప్రయత్నించినా వారు వినలేదు. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సివచ్చింది.

వివాదాస్పదమైన పోలీసుల తీరు

ముందుగా ప్రకటించిన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ నేతలను వారించడానికి బదులుగా నిర్వాహకులపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు వివాదాస్పదంగా మారింది. ఏసీపీ కె. శ్రీనివాసులు ఒక దశలో నిర్వాహకులను, ప్రచురణ కర్తలను ఆరునెలల పాటు లోపలేస్తానని హెచ్చరించడం వినిపించింది.

ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు : విజయకుమార్

విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చని పుస్తక మహోత్సవ్ సమన్వయకర్త, ఎమెస్కో బుక్‌హౌస్ అధినేత కె.విజయకుమార్ అన్నారు. అందుకే అనుమతించామని పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా ఒక్కటేనని అన్నారు. అయితే కొంత మంది మనోభావాలు దెబ్బతిన్నకారణంగా స్కై బాబా పుస్తకావిష్కరణను నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

హైకోర్టు విభజనపై న్యాయమూర్తుల భేటీ

ఫుల్ కోర్టులో చర్చలు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ఎట్టకేలకు విభజన దిశగా చర్యలకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్‌రంగనాథన్ అధ్యక్షతన హైకోర్టు న్యాయమూర్తులంతా (ఫుల్ కోర్టు) సమావేశమైంది. హైకోర్టు విభజన కోసం చర్యలు తీసుకుంటున్నామని, అమరావతిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు లేఖ రాసిన నేపథ్యంలో బుధవారం ఫుల్ కోర్టు సమావేశమైంది. అన్ని వసతులు ఉంటేనే అమరావతికి వెళ్లాలని గంటకుపైగా జరిగిన సమావేశంలో న్యాయమూర్తులు నిర్ణయించారని సమాచారం. తొలుత ఈ ప్రతిపాదనపై కొందరు న్యాయమూర్తులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఓటింగ్ కూడా జరిగినట్టు తెలిసింది. మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు అమరావతిలో హైకోర్టు కోసం ఎంపిక చేసినట్టు చెబుతున్న భవనాల పరిశీలన కోసం అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన కమిటీని పంపాలని సమావేశం నిర్ణయించింది. ఉద్యోగు విభజన, ఇతర అంశాలపై కూడా కమిటీలు వేయాలని సమావేశం అభిప్రాయపడినట్టు తెలిసింది. అమరావతి పరిశీలనకు వెళ్లే కమిటీ నిర్ణయం తర్వాత ఇతర కమిటీలపై నిర్ణయం ఉండవచ్చునని సమాచారం.

కేసీఆర్ యూనిట్ కరెంటైనా ఉత్పత్తి చేశావా? : కాంగ్రెస్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి నలభై నెలలు కావొస్తున్నా ఒక్క యూనిట్ కరెంటైనా ఉత్పత్తి చేశారా? అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టీపీసీసీ ప్రశ్నించింది. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభిస్తే కేసీఆర్ స్విచ్చాన్ చేసి తామే ఉత్పత్తి చేసినట్టు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శిం చింది. నేటి విద్యుత్ వెలుగులు, గత కాంగ్రెస్ ప్రభుత్వ కృషి ఫలితమేనని వివరించింది. కరెంట్ ఉత్పత్తి చేయకపోగా...కొనుగోలు చేసిన కరెంట్‌ను కూడా ఉత్పత్తి చేసినట్టు చెప్పిన ఘనుడు కేసీఆర్ అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ కుంభకోణం దాగి ఉందని, త్వరలో దాన్ని బయటపెడతామని చెప్పారు. జెన్‌కో కంపెనీకి ఉరేసి కమీషన్లకు కక్కుర్తి పడి ప్రయివేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే జెన్‌కో ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గిపోయిందని చెప్పారు. బుధవారం గాంధీభవన్ ఆవరణలోని ఇందిరాభవన్‌లో 'కరెంట్‌పై కేసీఆర్ అబద్ధాలు...విద్యుత్ వాస్తవాలపై టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. గత యూపీఏ సర్కారు తీసుకున్న నిర్ణయాల ఫలితంగా దేశ వ్యాప్తంగా కరెంట్ ఉత్పత్తి పెరిగిందని, దాని ఫలితంగానే మిగులు విద్యుత్ ఉత్పత్తి జరిగిందన్నారు. యూపీఏ హయాంలో జీడీపీ 9 శాతం పెరగడం వల్ల దానికి అనుగుణంగా ప్రయివేట్ థర్మల్ పవర్ ఉత్పత్తికి అవకాశం కల్పించామని వివరించారు. ఈ అంశంపై న్యాయపరమైన చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ ప్రారంభించారు. పార్టీ సీనియర్ నేతలు సుదర్శన్‌రెడ్డి, వి హనుమంతరావు, సునీతా లక్ష్మారెడ్డి, కోదండరెడ్డి, మల్లురవి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, ఇందిరా శోభన్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

8నుంచి సౌత్ ఇండియాసైన్స్ ఫెయిర్

- ఆరు రాష్ట్రాల నుంచి ప్రతినిధుల రాక : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్(ఎస్ఐఎస్ఎఫ్)-2018 కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు ఆరు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారని చెప్పారు. బుధవారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి రాష్ట్రం నుంచి 20 గ్రూప్ ప్రదర్శనలు, 15 వ్యక్తిగత ప్రదర్శనలు, 15 ఉపాధ్యాయ ప్రదర్శనలు ఉంటాయనీ, ప్రతి రాష్ట్రం నుంచి 50 చొప్పున మొత్తం 300 ప్రదర్శనలుంటాయని వివరించారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాస్త్రీయ విద్యావిధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శలు ఎంతో ఉపయోగపడుతాయనీ, వీటిని ఎక్కువ మంది విద్యార్థులు వీక్షించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓలను ఆదేశించారు.

త్వరలో ఆర్డీఎస్ నీటి విడుదల

- ఉమ్మడి ఇండెంట్‌కు అంగీకరించిన ఏపీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు త్వరలో నీరు విడుదల చేయనున్నట్టు నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ పరిధిలోని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు నీరు విడుదల చేయాలంటే రెండు రాష్ట్రాలూ కలిసి ఉమ్మడి ఇండెంట్ ఇవ్వాలని తుంగభద్ర బోర్డు తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావుతో బుధవారం ఫోన్‌లో మాట్లాడి ఉమ్మడి ఇండెంట్‌కు ఒప్పించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి కూడా ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉమ్మడి ఇండెంట్ ఇవ్వటానికి రెండు రాష్ట్రాలూ అంగీకరించటంతో నీటి విడుదల కోసం ఏర్పడిన అవరోధం తొలగిపోయిందని హరీశ్‌రావు తెలిపారు. తుంగభద్ర నుంచి సుంకేశుల ద్వారా ఏపీకి 5.2 టీఎంసీలు, ఆర్డీఎస్ ద్వారా తెలంగాణకు 3.5 టీఎంసీల నీరు అందతుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

13 నుంచి కైట్.. స్వీట్ ఫెస్టివల్

మంత్రి చందులాల్

- పాల్గొననున్న 20 దేశాలు, 25 రాష్ట్రాలు
- ఫెస్టివల్‌లో వెయ్యి రకాల స్వీట్ల ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు జింఖానా గ్రౌండ్స్‌లో కైట్, స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు టూరిజం శాఖ మంత్రి చందులాల్ వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌కు అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన గురుకుల పాఠశాల విద్యార్థిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించామన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కైట్ ఫెస్టివల్‌కు 25 రాష్ట్రాలు, 20 దేశాల ప్రజలు పాల్గొంటారని చెప్పారు. ప్రపంచంలోనే తొలి సారిగా నిర్వహిస్తున్న స్వీట్ ఫెస్టివల్‌కు 25 రాష్ట్రాలు 11 దేశాల నుంచి మహిళలు పాల్గొంటారన్నారు. ఈ స్వీట్ ఫెస్టివల్‌లో దేశ, విదేశాలకు సంబంధించిన వెయ్యి రకాల స్వీట్లను ప్రదర్శించనున్నారని చెప్పారు. కేవలం మహిళలు సొంతంగా తయారు చేసిన స్వీట్లను మాత్రమే అనుమతిస్తామని, హోటళ్లలో తయారు చేసిన స్వీట్లను అనుమతించమన్నారు. ఈ సమావేశంలో టూరిజం కార్యదర్శి బుర్రా వెంకటేశం, దేశ, విదేశాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరళ, లక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఐలమ్మ భవన్‌లో ఐద్వా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ ఆలయ వాణి వెబ్ రేడియోలో జాకీగా పనిచేస్తున్న ఓ యువతిని లైంగికంగా వేధించడం దుర్మార్గమన్నారు. ఒక గాయకుడు తోటివారితో స్నేహపూర్వకంగా, యువతకు ఆదర్శంగా ఉండాల్సిందిపోయి ఆధ్యాత్మిక ముసుగులో కీచక పనులు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ ఘటనలో పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా దర్యాప్తు చేయాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు హైమావతి, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

15వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి నెల 1వ తేదీ నుండి రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకుల పంపిణీ కచ్చితంగా జరిగేలా పౌరసరఫరాల శాఖ మార్పులు చేపట్టింది. ఇందుకోసం సరుకుల రవాణా తేదీల్లో, క్లోసింగ్ బ్యాలెన్స్ (సీబీ), రిలీజ్ ఆర్డర్ (ఆర్ఓ) లో మార్పులు చేసింది. ఇక నుండి ప్రతి నెల 1 నుండే లబ్ధిదారులకు సరుకులు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు. 1 నుండి 15 వరకు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ జరుగుతుంది. 16న శాఖ కేంద్ర కార్యాలయం నుండి జిల్లాలకు సరుకుల కేటాయింపులు జరుపుతారు.

గిరిజనుల మధ్య చిచ్చు పెట్టింది ప్రభుత్వమే..

- ఈ విషయంలో సీఎం ఎందుకు స్పందించరు?
- ఎంబీసీ కులాలను ఇప్పటికీ గుర్తించలేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ -భద్రాచలం

రాష్ట్రంలో ఆదివాసీలకు, లంబాడీలకు మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వమే చిచ్చుపెట్టిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో బుధవారం సీపీఐ(ఎం) జిల్లా మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజలు ఆశించినట్టుగా పాలన జరగడం లేదన్నారు. దుర్భర జీవితాలు అనుభవిస్తున్న గిరిజనుల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసింది కానీ అమలును మరిచిందన్నారు. దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇవ్వకపోగా ఉన్న భూమిని లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోడుభూముల్లో సాగు చేసుకోనీయకుండా గిరిజనులను పోలీసులు నిర్బంధాలకు గురి చేస్తున్నారన్నారు. అసలు అడవిపై గిరిజనులకు హక్కే లేదనడం ముఖ్యమంత్రి కేసీఆర్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఆ విషయాన్ని మరిచారన్నారు. ఇవన్నీ అమలు చేయకపోగా వారి మధ్య ఐక్యతను దెబ్బతీసేలా చిచ్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, లంబాడీలు గొడవలు పడి చివరకు చంపుకున్నా కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని నిలదీశారు. గిరిజనుల మధ్య ఘర్షణతో పాలకులకే లబ్ధి చేకూరుతుందన్నారు. అందుకే ఈ రకమైన వివాదాలు సరైనవి కాదన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరిగిన మాట వాస్తమేనని, కానీ ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. మాల, మాదిగల మధ్య కూడా ప్రభుత్వం ఇదే రకమైన ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏబీసీడీల వర్గీకరణకు అన్నిపార్టీలు మద్దతు పలికినప్పటికీ కేంద్రం ఎందుకు ఆమోదం తెలపడం లేదని ప్రశ్నించారు. గిరిజనులు, దళితుల వివాదాలు పరిష్కారం కావడం ప్రభుత్వాలకు ఇష్టం లేదని విమర్శించారు. ఎంబీసీ కులాలను ఇప్పటికీ గుర్తించలేదని, వెయ్యికోట్ల కేటాయింపు ఉట్టిమాటలేనని అన్నారు. అందుకే 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులాలు, ప్రజాసంఘాలతో రాజకీయ ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటుకు సీపీఐ(ఎం) ప్రయత్నిస్తోందన్నారు. సామాజిక కులాలకు రాజ్యాధికారమే లక్ష్యంగానే ఫ్రంట్ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, నాయకులు ఎజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ అరెస్ట్‌కు సీపీఐ(ఎం) ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దీక్షను ప్రభుత్వం భగ్నం చేయటం శోచనీయమని సీపీఐ (ఎం) పేర్కొంది. ఆయన్ను పోలీసులు అరెస్టు చేయటాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేందుకు వీలుగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళాలంటూ మందకృష్ణ డిమాండ్ చేశారని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం ఎక్కడ అనుమతినిస్తే అక్కడే శాంతియుతంగా దీక్షను చేస్తానంటూ ఆయన ప్రకటించారని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరించి దీక్షను భగ్నం చేసిందని విమర్శించారు. మందకృష్ణతో పాటు ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయజూడటం ప్రభుత్వ అవివేకమని తమ్మినేని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. ఇది ప్రజాతంత్ర హక్కులను కాలరాయటమేనని పేర్కొన్నారు.

ఎమ్‌వి యాక్ట్ సవరణల బిల్లు తిరస్కరించాలి

- రేపు ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు
- టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్‌వి యాక్ట్ సవరణల బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీ రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు నిర్వహించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) పిలుపునిచ్చింది. 5వ తేదీ భోజన విరామసమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కార్మికులు ఈ ఆందోళనల్లో పాల్గొనాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు పేర్కొన్నారు. రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దేశంలోని ఆర్టీసీలకు మరణశాసనం లాంటి ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జాతీయ రవాణారంగ సమన్వయ కమిటీ పిలుపు మేరకు 5వ తేదీ దేశవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులంతా ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు.

మేము సైతం....టీఎమ్‌యూ

రాజ్యసభలో ఎమ్‌వి యాక్ట్ చట్ట సవరణల బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారంనాడు భోజన విరామసమయంలో ఆర్టీసీ డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీఎమ్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు థామస్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఈ ఆందోళనల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల వేతన సవరణను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయమంటే వ్యక్తులు కాదు

- సమాజం బాగుపడాలి : ఎస్ఆర్ శంకరన్ ప్రథమ వార్షికోత్సవంలో మల్లేపల్లి లక్ష్మయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక న్యాయమంటే వ్యక్తులకు కాదని, సమాజానికి మేలు కలగాలని సీనియర్ జర్నలిస్టు, బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. బుధవారం సావిత్రిభాయి పూలే 187వ జయంతి, ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి ప్రథమ వార్షికోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమిలో 'సామాజిక న్యాయం'అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయమంటే ఒక కులంలో కొందరు వ్యక్తులకు పదవులు ఇవ్వడం, ఆర్థికంగా బాగుపడడం, ఉద్యోగాలు రావడమే కాదన్నారు. సామాజిక న్యాయమంటే సమాజమంతా బాగుపడాలని ఆకాంక్షించారు. సమాజంలో అసమానతలు, దోపిడీ, అన్యాయం పోవాలని చెప్పారు. వనరుల పంపిణీ జరగాలని, సమన్యాయం కావాలని అన్నారు. డబ్బు సంపాదిస్తే శాంతి, సంతోషం రాదన్నారు. పది మందికి మేలు చేస్తే, సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తే శాంతి, సంతోషం వస్తుందని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని అన్నారు.

2002 బ్యాచ్ ఏఎఎస్‌లకు పదోన్నతులు

హైదరాబాద్: 2002 బ్యాచ్ ఐఏఎస్‌లకు పదోన్నతులు లభించాయి. 2002 బ్యాచ్‌లోని నలుగురు ఐఏఎస్ అధికారులకు కార్యదర్శులుగా పదోన్నతులు వచ్చా యి. రంగారెడ్డిజిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, కేంద్ర రక్షణ శాఖలో డిప్యుటేషన్‌పైఉన్న సుదర్శన్‌రెడ్డిలకు కార్యదర్శులుగా పదోన్నతిలభిం చింది.

విప్ సదస్సుకు మంత్రి హరీశ్‌రావు : ఈనెల 8, 9 తేదీల్లో ఉదయ్‌పూర్‌లో జరగనున్న ఆలిండియా విప్‌ల సదస్సుకు మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. ఆయనతో పాటు అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచార్యులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, అన్ని పార్టీల విప్‌లు ఈ సదస్సుకు హాజరవనున్నారు.

మహారాష్ట్ర సర్కార్‌ను బర్తరఫ్ చేయాలి

- టీమాస్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దళితులపై దాడులకు పాల్పడి, ఒకరి మృతికి కారణమైన మహారాష్ట్ర బీజేపీ సర్కార్‌ను తక్షణం బర్తరఫ్ చేయాలని తెలంగాణ సామాజిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్) డిమాండ్ చేసింది. ఈ దాడుల్ని నిరసిస్తూ బుధవారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, ప్రజాసంఘాలు ఆందోళన నిర్వహించాయి. బీజేపీ, ఆర్ఎస్ఎస్, శివసేన తదితర హిందుత్వ శక్తులు ఈ దాడులకు పాల్పడ్డాయని, వాటిని నిలువరించడంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ విఫలమయ్యారని టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ విమర్శించారు. ఈ దాడుల్లో మరణించిన రాహుల్ ఫతంగలే కుటుంబాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలకూ హజ్‌యాత్ర అవకాశం : బీజేపీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


హజ్ యాత్రకు మహిళలు కూడా వెళ్లే అవకాశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ కల్పించారని, దీనికోసం ఇప్పటికే 1,500 దరఖాస్తులు వచ్చాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్ వర్గీయ చెప్పారు. త్రిపుల్ తలాక్ రద్దు సాహసోపేతమైన చర్య అని, రాజ్యసభలో కూడా అది ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఎఫ్ఆర్‌డీఐ బిల్లును రద్దు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫైనాన్షియల్ రెసల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లును తక్షణమే రద్దు చేయాలని రిటైర్డ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(రివ్వా) రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్‌చేశారు. డిపాజిటర్ల డబ్బుపై వారికే హక్కు ఉండాలని, డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని, విశ్రాంతికార్మికుల డిపాజిట్లకు 12శాతం వడ్డీ చెల్లించాలని, ఆరోగ్య కార్డు పంపిణీ చేసి వైద్య సౌకర్యం కల్పించాలని, డిపాజిట్లు హరించే ఎఫ్ఆర్‌డిఐ చట్టాన్ని రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఆ బిల్లును పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి పంపాలి... : సురవరం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


త్రిపుల్ తలాక్ చట్టం బిల్లును పార్లమెంటు సెలక్ట్ కమిటీ, స్టాండింగ్ కమిటీలకు పంపాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ చట్టానికి తాము వ్యతిరేకం కాదని.. అయితే మూడేండ్ల జైలు శిక్ష అనే క్లాజుపై తమ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్లుపై ఏకాభిప్రాయానికి వీలుగా సెలక్ట్ కమిటీ, స్టాండింగ్ కమిటీలకు పంపించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి సురవరం మీడియాతో మాట్లాడారు. మైనారిటీలపై మోడీ ప్రభుత్వానికున్న కక్షసాధింపు ధోరణికి త్రిపుల్ తలాక్ బిల్లు ప్రత్యక్ష ఉదాహరణని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఈ చట్టంతో ముస్లిం మహిళలకు న్యాయం జరగటం కష్టమేనని అన్నారు. కేవలం మైనారిటీల విషయంలోనేగాక భార్యలకు చట్ట విరుద్ధంగా విడాకులిచ్చే అన్ని మతాల వారినీ శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. పార్లమెంటులో వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయాలని కోరారు. చాడ మాట్లాడుతూ.. వర్గీకరణ అంశంలో తన బాధ్యతేమీ లేనట్టుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో దళితుల పాత్ర లేదా? అని ప్రశ్నించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి.. 'ఆయనో గోడ మీద పిల్లి...' అని ఎద్దేవా చేశారు. ధర్నాచౌక్ ఉద్యమంలో తమకు మద్దతునిచ్చిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు కేసీఆర్‌తో మంతనాలు జరుపుతున్నారని విమర్శించారు. సినీ యాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, గుండా లు.. రాజకీయాల్లో చేరి వాటిని భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడుల్లో ఫీజులు తగ్గించాలి: హెచ్‌ఎస్‌పీఏ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలో ఫీజులను తగ్గించాలని హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్‌ఎస్‌పీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యను ఆ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు తల్లిదండ్రులకు వ్యతిరేకంగా ఉన్నాయనీ, వీటిని అమలు చేయవద్దని కోరారు.

బాలీవుడ్‌లో సందడి షురూ

















టాలీవుడ్‌లోనే కాదు బాలీవుడ్‌లో కూడా జనవరి నెలలో సినిమాల సందడి నెలకొంది. రెండు, మూడు భారీ చిత్రాలు తప్ప మిగిలినవి చిన్న బడ్జెట్ చిత్రాలే కావడం ఓ విశేషమైతే, ఈ సినిమాలన్నీ వేటికవే భిన్నమైన, నవ్యమైన కథాంశాలతో తెరకెక్కిన చిత్రాలు కావడం మరో విశేషం. పదికిపైగా సినిమాలు సంక్రాంతి సందర్భంగా బాలీవుడ్‌లో సందడి చేయడానికి రెడీ అవుతున్నాయి. ఆ సినిమాల విశేషాలేమిటో చూద్దాం..


జనవరి మొదటి వారం (జనవరి 5న)లో రెండు చిన్న చిత్రాలు **'కుల్దీప్ పట్వాల్: ఐ డిడ్ నా డూ ఇట్', 'ఉడన్చో'లు** రిలీజ్ కానున్నాయి. థ్రిల్లర్ చిత్రం 'కుల్దీప్ పట్వాల్: ఐ డిడ్ నాట్ డూ ఇట్'లో జమీల్ ఖాన్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటించగా, కామెడీ సినిమా 'ఉడన్చో'లో ప్రేమ్ చోప్రా, అశుతోష్ రానా ప్రధాన పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న నాలుగు సినిమాలు పోటీపడుతున్నాయి. అందులో సైఫ్ అలీ ఖాన్ నటించిన **'కాలాకాండి'** ప్రధానంగా ఉంది. బ్లాక్ కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాకు అక్షత్ వర్మ దర్శకత్వం వహించారు. ఇందులో సైఫ్ అలీ ఖాన్ విభిన్న పాత్రలో కనువిందు చేయబోతున్నారు. ఆయనతోపాటు ఇషా తల్వార్, అక్షయ్ ఒబెరాయ్, శోభిత ధూళిపాల, కునాల్ రాయ్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. దీంతోపాటు హర్రర్ చిత్రం **'1921'** సైతం ఇదే రోజు విడుదల కానుంది. విక్రమ్ భట్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో జరీనా ఖాన్, కరణ్ కుంద్రా, అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలు పోషించారు. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందుతున్న **'ముక్కాబాజ్'** సైతం జనవరి 12నే ప్రేక్షకుల ముందుకు రానుంది. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో బాక్సింగ్ ప్రధానంగా సాగే ఈ చిత్రంలో వినీత్‌కుమార్ సింగ్, జోయా హుస్సేన్, జిమ్మీ షర్గిల్ నాయకానాయికలుగా నటిస్తున్నారు. విభిన్నమైన చిత్రాలను రూపొందించే అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో ఆనంద్ ఎల్.రాయ్ వంటి దర్శక, నిర్మాత నిర్మిస్తున్న సినిమా కావడంతో దీనిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. దీంతోపాటు **'డౌనప్ ది ఎగ్జిట్ 796'** చిత్రం కూడా సంక్రాంతి సందర్భంగానే రిలీజ్‌కు సన్నద్ధమవుతోంది. ఈ నెల మూడో వారం (జనవరి 19)లో కూడా నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. వాటిలో **'మై బర్త్‌డే సాంగ్', 'వోడ్కా డైరీస్', 'నిర్దోష్', 'యూనియన్ లీడర్'** చిత్రాలున్నాయి. 'మై బర్త్ డే సాంగ్' చిత్రాన్ని దర్శకుడు సమీర్ సోనీ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందించారు. సంజయ్ సూరి, నోరా ఫతేహి జంటగా నటించారు. 'వోడ్కా డైరీస్' చిత్రానికి కుషాల్ శ్రీవాస్తవ్ దర్శకత్వం వహించగా, కే.కే.మీనన్, రైమా సేన్, మందిరా బేడి, షరీబ్ హష్మి ప్రధాన పాత్రలు పోషించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో ఓ రోజు జరిగిన వరుస హత్యల ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇదే రోజు ప్రదీప్ రంగ్వాని, సుబ్రోతో పాల్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'నిర్దోష్' కూడా విడుదల కానుంది. ఇందులో అర్బాజ్ ఖాన్, మంజరి ఫాడ్నిస్, అష్మిత్ పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మూడో వారంలో మరో ఆసక్తికర సినిమా 'యూనియన్ లీడర్' రిలీజ్ కాబోతోంది. సంజయ్ పటేల్ దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రమిది. డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రాహుల్ భట్, టిల్లోతమా శోమా జంటగా నటించారు.

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు భారీ చిత్రాలు పోటీపడుతున్నాయి. అక్షయ్ కుమార్ **'ప్యాడ్‌మ్యాన్'**, సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన **'అయ్యారీ'** చిత్రాలు ఈ నెల 26న ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్.బాల్కీ దర్శకత్వంలో రూపొందుతున్న 'ప్యాడ్‌మ్యాన్' చిత్రంలో అక్షయ్ కుమార్‌తోపాటు సోనమ్ కపూర్, రాధికా ఆప్టే నటించారు. శానిటరీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన తమిళనాడుకు చెందిన అరుణాచల్ మురుగనాథం జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వరుస విజయాలతో ఉన్న అక్షయ్ కుమార్ నటిస్తున్న ఈ చిత్రంపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. సిద్ధార్థ్ మల్హోత్రా, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్న 'అయ్యారీ' చిత్రాన్ని నీరజ్ పాండే తెరకెక్కించారు. థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో మనోజ్ బాజ్‌పాయి, పూజా చోప్రా, అదిల్ హుస్సేన్, నసీరుద్దిన్ షా, అనుపమ్ ఖేర్, కుముద్ మిశ్రా ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇలా ఈ జనవరిలో భిన్న కథా నేపథ్యాల చిన్న, పెద్ద చిత్రాలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచనున్నాయి.









నవచిత్రం

అరుదైన ఘనత..

రజనీకాంత్ హీరోగా నటిస్తున్న '2.0' అరుదైన ఘనతను దక్కించుకోబోతోంది. సౌదీ ఆరేబియాలో ఈ ఏడాది ప్రదర్శించే తొలి సినిమాగా రికార్డు సృష్టించనుంది. ముస్లిం దేశమైన సౌదీ ఆరేబియాలో 1980లో పెద్ద ఎత్తున ఇస్లామిక్ పునరుద్ధరణ ఉద్యమం జరిగింది. ఈ సందర్భంగా మత సిద్ధాంతాలకు సినిమాలు విరుద్ధమంటూ అక్కడ అన్ని థియేటర్లను మూసివేశారు. దాదాపు 35ఏండ్ల తర్వాత అక్కడ థియేటర్లను తిరిగి ప్రారంభించాలని ఆ దేశ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది మార్చిలోగాని, ఏప్రిల్‌లోగాని థియేటర్‌ను ప్రారంభించే అవకాశం ఉందని సౌదీ మంత్రి తెలిపారు. శంకర్ దర్శకత్వం వహించిన '2.0' చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళంతోపాటు 15 భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. సౌదీలో థియేటర్లను ప్రారంభిస్తూ మొదటి సినిమాగా '2.0'నే ప్రదర్శించబోతున్నారట. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, అమీ జాక్సన్ కథానాయికగా నటిస్తోంది.


'రోబో 2.0'లో రజనీకాంత్

తదుపరి దందా..!


ప్రభాస్‌తో ఓ సినిమా చేయాలనుందని కృష్ణంరాజు గత కొన్ని రోజులుగా చెబుతున్న విషయం విదితమే. దీని కోసమై ఓ కథను రెడీ చేయిస్తున్నారని సమాచారం. వీలైనంత త్వరగా ఈ చిత్రం పట్టాలెక్కే ఛాన్స్ కూడా ఉందట. తాజాగా ఈ చిత్రానికి 'దందా' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. కృష్ణంరాజు సొంత సంస్థ గోపీకృష్ణ బ్యానర్‌పై 'దందా' అనే టైటిల్‌ను ఇప్పటికే ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించారు. కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్న ఈ చిత్రానికి కృష్ణంరాజు దర్శకత్వం వహించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ నెటిజన్లు కోడై కూస్తున్నారు.


ప్రభాస్

లవ్‌స్టోరీతో బాలీవుడ్ ఎంట్రీ..

ఇదిలా ఉంటే, ప్రభాస్ తన బాలీవుడ్ ఎంట్రీకి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఓ ఇంగ్లీష్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభాస్ మాట్లాడుతూ, 'బాలీవుడ్‌లో నేను సినిమా చేయబోతున్నట్టు వచ్చిన వార్తలు నిజమే. మూడేండ్ల క్రితమే ఓ బాలీవుడ్ చిత్రానికి ఓకే చెప్పాను. అది లవ్‌స్టోరీ. 'సాహో' తర్వాత ఆ సినిమాలోనే నటిస్తాను. కరణ్ జోహర్ మంచి స్నేహితుడు నాకు ఏం కావాలన్నా ఆయన్ని నిర్మొహమాటంగా అడుగుతాను. ఓ హీరోకు ఫలానా పాత్రతో గుర్తింపు వచ్చిందంటే అతను నటించబోయే తర్వాతి సినిమాలోనూ అదేపాత్రలో నటించాలని కోరుకుంటారు. హాలీవుడ్‌లో ఓ హీరో బ్యాట్‌మ్యాన్, సూపర్‌మ్యాన్ పాత్రలో నటించి గుర్తింపు తెచ్చుకుంటే ఇక అతను వేరే పాత్రల్లో నటిస్తే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందనుకుంటారు. కానీ అందులో లాజిక్ లేదు. స్క్రిప్ట్ బాగా లేకపోతే సినిమా ఆడదు. కానీ స్క్రిప్ట్ బాగుండి సినిమా ఆడకపోతే హీరోనే సరిగ్గా నటించలేదనంటారు. 'బాహుబలి' తర్వాత ప్రభాస్ సూపర్ స్టార్ అయిపోయాడు అని అందరూ అంటున్నారు. కానీ ఏదో ఒక రోజు నేనూ సూపర్ స్టార్ అవ్వాలని కోరుకుంటాను. 'బాహుబలి' విజయం తర్వాత అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది కదా అని విజయాన్ని తలకెక్కించుకోలేదు. నేను పొగరుగా ప్రవర్తిస్తే నా తలపై మొట్టికాయ వేసి అదుపులో పెట్టే స్నేహితులు చిత్ర పరిశ్రమలో నాకు ఉండటం చాలా హ్యాపీగా ఉంది' అని తెలిపారు. ప్రభాస్ ప్రస్తుతం 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీలో ఏకకాలంలో తెరకెక్కిస్తున్నారు.

అక్టోబర్‌లో షూటింగ్ ఆరంభం..!


రామ్‌చరణ్


ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ఓ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు రాజమౌళి ప్లాన్ చేస్తున్న విషయం విదితమే. ఈ సినిమా ఎప్పుడు పట్టాలెక్కనుంది?, కథ ఎలా ఉండబోతుంది? అనే ఆసక్తికర ప్రశ్నలు ఎన్టీఆర్, రామ్‌చరణ్ అభిమానుల్లోనే కాదు అందరిలోనూ నెలకొంది. తాజా సమాచారం మేరకు ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో ప్రారంభించేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందట. ఇందులో రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తారా? లేక ఒకరు హీరో, మరొకరు విలన్‌గా కనిపిస్తారా? అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. ఏదిఏమైనా ప్రారంభానికి ముందు నుంచే ఈ చిత్రం విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'రంగస్థలం' చిత్రంలో నటిస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ సినిమాలో నటించనున్నారు. ఇటీవలే ఈ సినిమా ప్రారంభోత్సవం జరుపుకుంది.


కాజల్

ఫస్ట్ ఇంపాక్ట్‌కు 10 మిలియన్ వ్యూస్


అల్లు అర్జున్

"నా చిత్రానికి సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్‌కు భారీ స్పందన లభించడం చాలా ఆనందంగా ఉంది. ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన ప్రపంచంలోని తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన సైనికుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడిగా మారి రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు. అను ఇమ్మాన్యుయెల్ కథానాయికగా నటిస్తుంది.
ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్ ఇంపాక్ట్‌ను ఇటీవల నూతన సంవత్సర కానుకగా సందర్భంగా విడుదల చేశారు. తాజాగా ఈ ఇంపాక్ట్ కోటికిపైగా (10 మిలియన్) వ్యూస్‌ను రాబట్టుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఈ చిత్ర ఫస్ట్ ఇంపాక్ట్‌కి 29 గంటల్లోనే కోటి వ్యూస్ రావడం విశేషం. నాన్ 'బాహుబలి' రికార్డుల్లో నెంబర్.1గా నిలిచి అరుదైన రికార్డును సృష్టించింది. ముఖ్యంగా టీజర్ చూసిన వారంతా అల్లు అర్జున్ డెడికేషన్ గురించి, మేకోవర్ గురించి మాట్లాడుకుంటున్నారు. 'నీకు సూర్య సోల్జర్.. కానీ ప్రపంచానికి సూర్య అంటే యాంగర్..' అనే ఇంట్రోతో ప్రారంభమైన ఇంపాక్ట్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తోంది. టైటిల్‌కి తగ్గట్టుగా బన్నీ పాత్రలో లీనమైపోయి నటించిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ ఇంపాక్ట్‌పై సర్వత్రా ప్రశంసలు కురిపిస్తున్నారు. యాక్షన్ కింగ్ అర్జున్, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ – శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన బాణీలను అందిస్తున్నారు. పక్కా కమర్షియల్ హంగులతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రం అవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు' అని తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు(చంటి).

యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సారథి


రేవంత్, అనిత రాఘవ

రేవంత్ జి.హెచ్, సమ్మోహిత్, అనిత రాఘవ, తేజా రెడ్డి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సారథి'. ధను క్రియేషన్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో అల్లం భువన్ నిర్మిస్తున్నారు. ఈ నెల 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.
ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శక, నిర్మాత అల్లం భువన్ మాట్లాడుతూ, 'దర్శకుడిగా నా మొదటి సినిమా ఇది. నిజాయితీగల పోలీస్ చనిపోవడంతో అతని ఇద్దరు కుమారుల్లో ఒకరు ఐపీఎస్‌కి సెలెక్ట్ అయితే, మరొకరు తండ్రిని చంపిన క్రిమినల్స్‌ని హతమార్చి జైలు కెళ్తాడు. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. రాజకీయ నాయకుడు, పోలీస్ నిజాయితీగా ఉంటే సమాజానికి ఎటువంటి మేలు జరుగుతుందో తెలిపే చిత్రమిది. యాక్షన్ ప్రధానంగా సాగుతుంది. హీరోహీరోయిన్లు చాలా బాగా నటించారు. రంజిత్ అద్భుతమైన మాటలు రాశారు. సినిమా చాలా బాగా వచ్చింది. శుక్రవారం రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'దాదాపు 25 లఘు చిత్రాల్లో నటించాను. హీరోగా తొలి చిత్రం. సినిమా తీయాలనే ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల విడుదల చేసిన గీతాలకు మంచి స్పందన లభించింది. యాక్షన్‌తోపాటు రొమాన్స్, కామెడీ, మంచి డాన్స్‌లు ఇలా అన్ని అంశాల మేళవింపుగా ఉంటుంది. భానుచందర్ వంటి సీనియర్ యాక్టర్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఇది పేరుకే చిన్న చిత్రం. కథాపరంగా చాలా స్పాన్ ఉన్న సినిమా అవుతుంది. అందరినీ అలరించే విధంగా ఈ చిత్రం ఉంటుంది' అని హీరో రేవంత్ తెలిపారు. హీరోయిన్ అనిత చెబుతూ, 'కథ కొత్తగా ఉంటూ అందరినీ ఆకట్టుకుంటుంది. కిరణ్‌కుమార్ అందించిన మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. ఈచిత్రంలో చాలా మంచి పాత్ర చేశాను. ఈ పాత్ర మంచి గుర్తింపుతోపాటు మరిన్ని అవకాశాలను తీసుకొస్తుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు.


అలియాభట్

ప్రియాంక సినిమాలో..

చిన్న పిల్లలు, వీధి కుక్కలు ప్రధానంగా ప్రియాంక చోప్రా నిర్మించబోయే బాలీవుడ్ చిత్రంలో ఆలియా భట్ నటించేందుకు అంగీకరించింది. జంతు ప్రేమికురాలిగా అలియా నటించబోయే ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనుంది. ఆలియా ప్రస్తుతం 'రాజీ', 'జీరో' చిత్రాల్లో నటిస్తోంది.

గ్లామర్‌కు అతీతంగా..

గతేడాది 'నేనే రాజు నేనే మంత్రి', 'వివేకం' చిత్రాల్లో గ్లామర్‌కు అతీతంగా భార్య పాత్రలో నటించి ప్రేక్షకుల్ని మెప్పించిన కాజల్ త్వరలోనే ఇద్దరు పిల్లలకు తల్లిగా కనిపించనుంది. వెంకటేష్ హీరోగా తేజ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. ఈ చిత్రానికి 'ఆటా నాదే వేటా నాదే' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రంలో కథానాయిక ఎవరనే సస్పెన్స్‌కు దర్శకుడు తేజ తెర దించారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కాజల్ నటించనుంది. కథానుగుణంగా ఇందులో వెంకీకి భార్యగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా కాజల్ కనిపించనుందట. అయితే ఈ పాత్ర కోసం కాజల్ భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసిందని సమాచారం. ఇప్పుడున్న పరిస్థితులో కథానాయికలు అమ్మగా నటించడమనేది ఆషామాషి కాదు. తల్లిగా నటిస్తే యువ హీరోలతో నటించే ఛాన్స్‌లు రావడం కష్టమైపోతుంది. దీంతో అలాంటి పాత్రల్లో నటించేందుకు ఏ కథానాయిక అంగీకరించదు. కానీ ఈ తరహా పాత్రకు కాజల్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే, ఇందులో వెంకటేష్ టీచర్‌గా కనిపిస్తారట. కాజల్ ప్రస్తుతం 'ఎమ్మెల్యే', 'అ', 'పారిస్ పారిస్'(క్వీన్ తమిళ రీమేక్) చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

'మహా' బంద్

దళితుల ఆగ్రహిస్తే ఎలా ఉంటుందో.. బీజేపీ పాలిత మహారాష్ట్ర కళ్లారా చూసింది. భీమా కోరేగావ్‌లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వ నీడన పెట్టిన చిచ్చుకు వ్యతిరేకంగా దళితులంతా ఏకమవ్వటంతో నిరసన జ్వాల ఉవ్వెత్తున ఎగిసిపడింది. చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా దళిత యువకులంతా రోడ్డుకెక్కారు. గల్లీ నుంచి మొదలుకుని ముంబయి మహానగరం సైతం నిలిచిపోయింది. ఔరంగాబాద్‌లో ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం నిలిపివేసింది. గతంలో ఎన్నడూలేని విధంగా శాంతి భద్రతలకోసం భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. బుధవారం తామిచ్చిన బంద్ విజయవంతమైందని అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ప్రకటించారు. నిరసనలు ప్రశాంతంగా ముగియటంతో.. ఫడ్నవీస్ సర్కారు ఊపిరిపీల్చుకుంది.



ముంబయి : ఉరుకులు, పరుగులతో రద్దీగా ఉండే మహారాష్ట్ర ఒక్కసారిగా స్తంభించిపోయింది. భీమా కోరేగావ్ పోరాటానికి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా దళితులు నిర్వహించిన కార్యక్రమంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకగణం వెనకుండి నడిపిన హింసకు నిరసనగా బీఆర్ అంబేద్కర్ మనవడు, భరిప బహుజన్ మహాసంగ్ నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్, పలు దళిత సంఘాలు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. మహారాష్ట్ర డెమోక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్, దాదాపు 250 ప్రజా సంఘాలు సమ్మెకు మద్దతు తెలిపాయి. దీంతో ఎటు చూసినా.. ఎప్పుడు.. ఏం జరుగుతుందోనన్న టెన్షన్ వాతావరణమే కనిపించింది. చలికాలం కావటంతో పొగమంచు తెరలు కప్పిఉండగానే.. ఉదయం ఎనిమిది గంటలకే రోడ్డు కెక్కారు. గుంపులు, గుంపులుగా చేరుకున్న దళిత యువకులంతా అగ్రవర్ణాల దాడులకు వ్యతిరేకంగా నిరసన గళమెత్తారు. మహారాష్ట్ర సర్కారు ముందస్తుగా 144 సెక్షన్ విధించినా దళితాగ్రహం ముందు అవేమీ కనిపించలేదు. థానేలో ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ వే వద్ద పోలీసు భారీగా రంగంలోకి దిగారు. రైళ్లను ఆపకుండా నడపాలని రైల్వే అధికారులు ఎంతగా ప్రయత్నించినా.. సాధ్యం కాలేదు. రైల్వేట్రాక్‌లపై దళిత యువకులంతా జెండాలు పట్టుకుని, నినాదాలు చేస్తూ రైళ్లను కదలనీయలేదు. ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినల్ ద్వారా రోజూ భారీ సంఖ్యలో ప్రయాణికులు ఉపాధిబాట పడతారు. కానీ బంద్‌తో ఒక్క రైలూ బయటకు రాలేదు. అలానే ముంబయితో సహా మహారాష్ట్రలోని మహాదారులన్నీ బోసిపోయాయి. రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ప్రభుత్వం స్కూళ్లు, కాలేజీలు మూసేశారు. ప్రభుత్వ ,ప్రయివేటు సంస్థలన్నీ మూతపడ్డాయి. అప్రమత్తమైన ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు పలుచోట్ల నిరసనకారులను చెదరగొట్టారు. చిత్ర, బుల్లితెర పరిశ్రమ సైతం నిలిచిపోయింది. అన్ని షూటింగ్‌లను నిలిపివేశారు. ముంబయిలో తొమ్మిదిమందిపై కేసులు నమోదుకాగా, దాదాపు 100 మంది నిరసన కారులను పోలీసులు అరెస్టు చేశారు. నాసిక్‌లో బంద్ సంపూర్ణంగా జరిగింది. నగరంలో వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు మూతపడ్డాయి. బస్సులు, ఆటోలు నిలిచిపోయాయి. దళితులు బలంగా ఉన్న బీడ్, లాతూర్, షోలాపూర్, అహ్మద్ నగర్, నాసిక్ ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఔరంగాబాద్‌లో మంగళవారం పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టిన ఘటనలు చోటుచేసుకోగా.. బుధవారం ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం పూర్తిగా నిలిపేసింది. పోలీసులు రెచ్చగొట్టడంతో..పలు ప్రాంతాల్లో ఆగ్రహానికి గురైన నిరసనకారులు బస్సులపై రాళ్లు విసిరారు. దళిత యువకుల వెంట పోలీసులు పహారా కాస్తూ.. పరిస్థితి మరింతగా చేజారకుండా అడ్డుకున్నారు.



హింసకు పాల్పడింది ఆర్ఎస్ఎస్, బీజేపీ మద్దతుదారులే : జిగ్నేశ్

పూణె జిల్లాలో దళితులపై దాడులకు పాల్పడింది ఆర్ఎస్ఎస్, బీజేపీ మద్దతుదారులేనని గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ ఆరోపించారు. 'బ్రాహ్మ నిజం అత్యంత తీవ్రరూపంలో ఉన్న ఆధునిక పేష్వాలు ఈ సంస్థలు. మా పూర్వీకులు 200 ఏండ్ల క్రితం పేష్వాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ తరం దళితులు ఇప్పుడు ఆధునిక పేష్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. దళిత వాదానికి భయపడే అగ్రవర్ణాలవారు ఇలాంటి దాడులకు తెగబడుతున్నారు' అని జిగ్నేశ్ మెవానీ ఆరోపించారు.

జిగ్నేశ్, ఉమర్ ఖాలిద్‌లపై ఫిర్యాదులు

దళిత ఉద్యమ నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌పై రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ తమకు ఫిర్యాదులందాయని పోలీసులు తెలిపారు. భీమా కోరేగావ్ పోరాటానికి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 31న పూణెలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. అక్షయ్ బిఖాద్, ఆనంద్ డోండ్ అనే అనే వ్యక్తులు వీరిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్టు తెలుస్తోంది. మెవానీ, ఉమర్‌లపై కేసు నమోదుచేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. హింసకు పాల్పడిన వారిని వదిలేసి.. దళిత నేతలు, అక్కడకు వచ్చిన నాయకులపై కేసులు పెట్టడాన్ని వివిధ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు.

ఢిల్లీని తాకిన మహా సెగలు

మహారాష్ట్ర భవన్ వద్ద దళితుల ఆందోళన

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో దళితుల నిరసన సెగ దేశ రాజధానిని తాకింది. దళిత్ సోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం), బహుజన్ కమ్యూనిస్టు పార్టీతో పాటు ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది ఢిల్లీలో కస్తూరిభాగాంధీ మార్గ్‌లోని మహారాష్ట్ర భవన్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పూణెలో దళితుల ప్రదర్శనపై దాడికి తెగబడిన కాషాయ కూటమికి వ్యతిరేకంగా నిరసనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు, పూణె జిల్లా అధికారులకు మితవాద శక్తులకు కొమ్ముకాస్తున్నారంటూ ఆరోపించారు. దళితులపై దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందేనని విమర్శించారు. మహారాష్ట్ర భవన్ వద్ద జరిగిన సభలో దళిత్ సోషణ్ ముక్తి మంచ్ నేత రాంపాల్, బహుజన్ కమ్యూనిస్టు పార్టీ నేత నియోగి ప్రసంగించారు. హింసాత్మక చర్యలకు కారకులైన కాషాయ మూకలను అరెస్టు చేయాలని, ఎస్సీ, ఎస్టీ చట్టం 2015కింద నిందితులపై కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన అమాయక దళితులను వెంటనే విడుదల చేయాలని కోరారు.



తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావుకు అవార్డు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

విద్యుత్తు రంగంలో చేసిన విశేష కృషికిగాను తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ) అవార్డు దక్కింది. ఈ అవార్డును బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్ వర్మ అందజేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్, కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్‌మెఘ్‌వాల్, విద్యుత్తు శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ సింగ్, సీబీఐపీ ఉపాధ్యక్షుడు మసూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. మూడున్నర సంవత్సరకాలంలో తెలంగాణలో కొత్తగా 514 సబ్‌స్టేషన్లు, 1,724 పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్తలైన్ల నిర్మాణం జరిపారు. అలాగే సరఫరా నష్టాలు 3.37 శాతానికి తగ్గాయి. వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తు అందించడానికి 11 వేల మెగావాట్ల డిమాండ్ ఎదుర్కొడానికి తెలంగాణ ట్రాన్స్‌కో సరఫరా వ్యవస్థను సిద్ధం చేసింది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఈ అవార్డు అందించినట్టు ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి...

- కేంద్రమంత్రులకు మంత్రి జోగురామన్న వినతి
- మేడారం జాతరకు రావాలని ఉపరాష్ట్రపతికి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కేంద్రమంత్రులకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న విన్నవించారు. బుధవారం ఢిల్లీకి వచ్చిన ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. అనంతరం తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. కేంద్రమంత్రి మహేశ్‌శర్మను కలిసి.. ఆదిలాబాద్‌లో జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాల ఏర్పాటుపై చర్చించినట్టు తెలిపారు. అలాగే కరీంనగర్ హెడ్‌క్వార్టర్స్ కేటగిరి-1 విభాగంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అయితే ఫిబ్రవరి 6న హైదరాబాద్ పర్యటన చేపడుతున్నానని ఆ సమయంలో ఈ అంశాలపై తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. అనంతరం సామాజికన్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్‌ను కలిశారు. రాష్ట్రంలో కొత్తగా 15 బీసీ హాస్టళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతులు త్వరగా ఇవ్వాలని కోరారు. అలాగే కేంద్రం బకాయి ఉన్న పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పులను విడుదల చేయాలని విన్నవించారు. రాష్ట్రంలోని మొత్తం 113 బీసీ కులాలను ఓబీసీలుగా గుర్తించాలని కోరారు. ఇక ఆదిలాబాద్‌లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి అల్ఫోన్స్‌కన్నథామంతో చర్చించారు. చివరకు భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్‌గీతేను కలిసి రామగుండం ఎరువుల ఫ్యాక్టరీతో సీసీఐ ఏర్పాటుపై చర్చించినట్టు తెలిపారు. మంత్రి వెంట ఎంపీలు నగేష్, సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి తదితరులున్నారు.

మేడారం జాతరకు రండి... : ఉపరాష్ట్రపతికి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం

తెలంగాణలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే మేడారం జాతరకు రావాల్సిందిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడిని దేవాదాయశాఖ మంత్రి అల్లోళ ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ ఎంపీలతో కలిసి బుధవారం ఉదయం ఉపరాష్ట్రపతిని ఆయన నివాసంలో కలిశారు.

రాబోయే ఎనిమిది నెలలు కీలకం

- సీఎం నమ్మకాన్ని నిలబెట్టాలి :అధికారులకు మంత్రి హరీశ్‌రావు దిశా నిర్దేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



రాబోయే ఎనిమిది నెలల కాలం నీటిపారుదల శాఖకు అత్యంత కీలకమని ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతి గంట విలువైనదని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ 2018 క్యాలెండర్‌ను మంత్రి బుధవారం నాడు జలసౌధలో ఆవిష్కరించారు. పదహారు నెలల్లో చేయవలసిన పనులను ఎనిమిది నెలల్లో చేయడానికి ఇరిగేషన్ అధికారయంత్రాంగం నడుం బిగించాలని కోరారు. గడచిన మూడున్నరేళ్లగా అంకితభావంతో పనిచేస్తున్న ఇంజనీర్లు ఈ ఏడాది ఇంకా పట్టుదలతో పని చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సాగునీరొస్తుందని, ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారన్నారు. .ప్రజల్ని, రైతులను నిరాశకు గురి చేయొద్దని హితవు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టవలసిన బాధ్యత ప్రతి ఇంజనీరుకు ఉన్నట్టు హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇంత సంపూర్ణంగా అవగాహన ఉన్న సీఎం దేశంలో మరెవరూ లేరని మంత్రి అన్నారు. భవిష్యత్తులో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించే అవసరం, అవకాశం రాదనీ కాళేశ్వరం ప్రాజెక్టులో పనులు జరుగుతున్న వేగాన్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా ప్రాజెక్టులలోనూ వేగం పెంచాలని మంత్రి సూచించారు. లక్షలాదిమంది రైతుల జీవితాల్లో వెలుగు నింపే జల సంకల్పంలో భాగస్వాములైనందుకు ప్రస్తుత ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లంతా గర్వపడాలన్నారు. ఉద్యోగాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ఎనిమిది మాసాలు వీలైనంతవరకు సెలవులు, పండుగదినాల వంటి రోజుల్లోనూ పని చేసి జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా టార్గెట్లను పూర్తి చేయాలని ఇంజనీర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశంలో పర్యటించిన తర్వాత ఇరిగేషన్ శాఖపై నమ్మకం కుదిరిందన్నారు. మూడు బ్యారేజీలు, మూడు పంప్‌హౌజ్‌ల పనులు అత్యంత వేగంగా జరుగుతుండడం పట్ల ఇరిగేషన్ అధికార యంత్రాంగంలోనూ ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమిష్టిగా, సమన్వయంతో పని చేయడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు లో భూసేకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. అటవీ సంబంధిత సమస్యలు పరిష్కారమైనట్లు చెప్పారు. 8 వేల ఎకరాల భూసేకరణ జరిగిందని గుర్తు చేశారు.16 జిల్లాల్లో కాళేశ్వరంపై ప్రజాభిప్రాయసేకరణ సజావుగా సాగిందన్నారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ విభాగం సిబ్బంది రేయింబవళ్లు డిజైన్ల రూపకల్పనలో పని చేశారని హరీశ్‌రావు ప్రశంసించారు. సెలవులు, పండుగల సమయాల్లో కూడా పనిచేయడం వల్ల అనుకున్న సమయానికి డిజైన్లు పూర్తి చేయగలిగినట్టు మంత్రి చెప్పారు. 2019 లో ఎన్నికలు జరగనున్నందున సాగునీటి పథకాలకు సంబంధించి 2018 కీలకమని అన్నారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జోషీ ఒక్కోసారి టైపిస్టుగా, సెక్షన్ క్లర్క్ గా కూడా అవతారం ఎత్తి పనిచేసుకు పోతున్నారని, ఎలాంటి అహం లేకుండా స్పెషల్ ఆచప చేస్తున్న పనితీరును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీల పర్యవేక్షణాధికారిగా మాజీ ఐఏఎస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలల(కేజీబీవీ) పర్యవేక్షణకు విద్యాశాఖాధికారులు ఎట్టకేలకు ప్రత్యేకాధికారిని నియమించారు. మాజీ ఐఏఎస్ అధికారిని జీడీ ప్రియదర్శినిని కన్సల్టెంట్‌గా నియమించారు. నేడు, రేపో ఆమె విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 475 కేజీబీవీలుండగా, వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఎవ్వరూ అధికారులు లేరు. ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రూ. 10 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

సీఎంకు ప్రియమైన శాఖ

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలం
- అగ్రి డాక్టర్స్ డైరీ ఆవిష్కరణలో మంత్రి పోచారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగానికి రూ. 10 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతా సావిత్రిభాయి పూలే జన్మదిన వేడుకలను బుధవారం అగ్రికల్చర్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్రి డాక్టర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. రాములు అధ్యక్షత వహించారు. 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ఆచరణలో అమలు చేసినప్పుడే వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. సావిత్రిభాయి పూలేను సమాజం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు అన్ని శాఖల కంటే వ్యవసాయ శాఖ అత్యంత ప్రియమైనదన్నారు. లక్షా రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినా, ఎకరానికి రూ. 8వేల చొప్పున పెట్టుబడి ఇవ్వాలనే నిర్ణయం రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రైతులు ఎదుర్కొనే సమస్యలు రైతు బిడ్డగా తనకు తెలుసని, ఆ సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలో ఉద్యోగులుగా మీకు తెలుసని అన్నారు. రైతులకు అత్యంత దగ్గరగా ఉండే ఉద్యోగులు వ్యవసాయ అధికారులే అని చెప్పారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉన్నదన్నారు. అధికారులకు వాహన సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి అంటే భవనాలు, రోడ్లు, విమనాశ్రయాలు మాత్రమే కాదని, ప్రజలందరూ అర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కల్తీ విత్తనాలను కొంత మేరకు అరికట్టామన్నారు. అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మెన్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఇతర శాఖల ఉద్యోగుల కంటే వ్యవసాయ అధికారులు ఎక్కువ శ్రమిస్తున్నారని చెప్పారు. రైతుల కోసం ప్రభుత్వం రోజుకో పథకం ప్రవేశపెడుతుందని అన్నారు. ఆ పథకాల అమలుకు కింది స్థాయి అధికారులు చేస్తున్న కృషి మరువరానిదని కొనియాడారు. సాంకేతిక పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మహిళలు, మహిళా ఉద్యోగుల్లో చైతన్యం వచ్చిందని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి మాట్లాడుతూ సంఘంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడేవారికి సహకరించాలని కోరారు. పేబ్యాక్ సొసైటీ ద్వారా సమాజానికి కొంత తోడ్పాటు అందించాలన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మెన్ లోక బాపురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విద్యుత్ శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మేడి రమేష్ మాట్లాడుతూ ఉద్యోగులు కుటుంబాలకే పరిమితం అయితే అంబేద్కర్ ఆశాయలను వమ్ముచేసినట్టేనని అన్నారు. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాల్లోకి వచ్చిన తర్వాత, జాతికి ఏం చేశామనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. ప్రజా గాయకులు గోరటి వెంకన్న మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు రైతుల పొలాల్లోకి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అసోసియేషన్ వైస్ చైర్మెన్ టి. రాజారత్నం, పరుశురామ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు అజయ్‌కుమార్‌ఘోష్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి మధుమోహన్, నిషాంత్‌కుమార్, అనిల్, మహిళా నాయకులు నిర్మల, కృష్ణవేణి, శ్రీదేవి, హరిత, అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ మహిళా ఉద్యోగులతో నేడు మంత్రి సమావేశం

వ్యవసాయ శాఖలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కె. రాములు కోరిన నేపథ్యంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంటనే స్పందించారు. మహిళలతో పాటు అనుభవం ఉన్న నాయకులు గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని తమ చాంబర్‌కు రావాలని కోరారు. ఇప్పటికే ఆలస్యమైంది కనక సమస్యలపై చర్చించి, సాధ్యమైన మేరకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుందామని హామీ ఇచ్చారు.

గంగిరెద్దులోళ్లు బిక్షగాళ్లు కాదు

మొదటిపేజీ తరువాయి

ఆడించడం ఆ చట్టం పరిధిలోకి రాదని గుర్తుచేశారు. ఎంబీసీ సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి నరేష్ మాట్లాడుతూ.. గంగిరెద్దుల ఆట వృత్తితో జీవనం సాగిస్తున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వీరికి రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్(యూసీడీ) భాస్కరాచారితో టీమాస్ ఫోరం నేత ఎం శ్రీనివాస్ మాట్లాడారు. ఆయన స్పందిస్తూ.. గంగిరెద్దులను ఆడించేవాళ్లను అరెస్టు చేయబోమని, పోలీసు అధికారులతో చర్చిస్తామని చెప్పారు. ఇప్పటికే ఎవరినైనా అరెస్టు చేస్తే జైలు అధికారులతో మాట్లాడి ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ పేషీలో దీనికి సంబంధించిన మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగిరెద్దుల సంఘం నాయకులు కోటయ్య, అశోక్, సమ్మయ్య, కిష్టయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

మానవత్వంతో వ్యవహరించాలి: కేటీఆర్

గంగిరెద్దులను ఆడించేవాళ్లను అరెస్టు చేయడం సరైందికాదని, జీహెచ్ఎంసీ అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గంగిరెద్దులను ఆడించేవాళ్ల అరెస్టుపై కేటీఆర్ ఆరా తీశారు. దీనిపై జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో చర్చించారు. గంగిరెద్దులను ఆడించేవాళ్ల అరెస్టులు ఆపాలని సూచించినట్టు సమాచారం.

మాతో పెట్టుకుంటే...

మొదటిపేజీ తరువాయి

కబ్జా చేశారని ఆమె వెల్లడించటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. తనపై ఆరోపణలు చేసిన కలెక్టర్‌ను బదిలీ చేయిస్తానంటూ యాదగిరి రెడ్డి బహిరంగంగా ప్రకటించారు. కలెక్టర్‌పై ఆయన సీఎస్‌కు కూడా ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్ కలెక్టర్ ప్రీతి మీనా పట్ల ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు శంకర్‌నాయక్ అమర్యాదకరంగా ప్రవర్తించారని, ఆమె చేయి పట్టుకున్నారని సాక్ష్యాధారాలతో సహా మీడియాలో వచ్చిన వార్తలు కలకలం రేపాయి. శంకర్‌నాయక్‌పై ప్రీతిమీనా పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ రెండు సంఘటనల తర్వాత ఇద్దరు మహిళా కలెక్టర్లపై అంతర్గతంగా వేధింపులు ప్రారంభమయ్యాయని తెలిసింది. ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేయాలంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా మీడియాకు సమాచారం అందించటం పట్ల ఇటీవల ఉన్నతాధికారులు వారికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఈ రెండు సంఘటనల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ అప్రతిష్ట పాలైందని, అధికారులెవరూ తమ మాట వినటం లేదని కొందరు మంత్రులు, శాసనసభ్యులు సీఎంకు చెప్పినట్టు తెలిసింది. మంగళవారం జరిగిన బదిలీల్లో జనగామ కలెక్టర్ దేవసేనను బదిలీ పెద్దపల్లి కలెక్టర్‌గానూ, మహబూబాబాద్ కలెక్టర్ ప్రీతి మీనాను బదిలీ చేసి ఎయిడ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్‌గానూ నియమించారు. పాలనా పరంగా వీరిద్దరూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవటం విశేషం. సీనియర్ ఐఏఎస్ అధికారైన నిర్మల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఇళంబర్తిని కూడా ఇటీవల అకారణంగా బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టటం ఐఏఎస్ వర్గాల్లో సంచలనం కలిగించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఇళంబర్తి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన తన మాట వినటం లేదని ఒక మంత్రి ఫిర్యాదు చేసినందువల్లే ఆయనకు స్థాన చలనం కలిగిందని తెలిసింది. మంగళవారం ఇచ్చిన పోస్టింగుల్లో ఇళంబర్తిని అప్రాధాన్య పోస్టుగా పేరున్న రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శిగా నియమించటం చర్చకు తెరలేపింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మురళీని బదిలీ చేసి స్టేట్ ఆర్కివ్స్ డైరెక్టర్‌గా నియమించారు. పాలనా పరంగా ఆయనపై ఎటువంటి ఆరోపణలు లేవు. తన కుమార్తెకు ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయించటం ద్వారా ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ల సమావేశంలో సీఎం స్వయంగా పొగడ్తలతో ముంచెత్తారు. మురళి స్థానంలో జయశంకర్ భూపలపల్లి జిల్లాకు పూర్తి స్థాయి కలెక్టర్‌ను నియమించకుండా భౌగోళికంగా సంబంధం లేని మంచిర్యాల కలెక్టర్ కర్ణన్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించారు. ఇప్పటికే ఆయన ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కొనసాగుతున్నారు. మహబూబాబాద్‌కు కూడా పూర్తి స్థాయి కలెక్టర్‌ను నియమించకుండా ఖమ్మం కలెక్టర్ లోకేశ్‌కుమార్‌ను అదనపు బాధ్యతలు ఇచ్చారు. రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య జరుగుతున్న గొడవల నేపథ్యంలో భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీఏలకు పీఓలుగా ఐఏఎస్‌లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ మంగళవారం నాటి పోస్టింగ్‌లలో కూడా ఇది జరగలేదు.

సీనియర్ ఐఏఎస్‌ల పరిస్థితీ ఇంతే...

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా ఉన్న ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లకు అప్రధాన్యతా పోస్టింగ్‌లు ఇవ్వటం పట్ల ఐఏఎస్‌లు అసంతృప్తి చెందుతున్నారు. ప్రస్తుత సీఎస్ ఎస్పీ సింగ్ తర్వాత సీనియర్‌గా ఉన్న బీపీ ఆచార్యను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల నియమించారు. మంగళవారం జరిగిన బదిలీల్లో కూడా ఆయనకు కీలక శాఖ అప్పగించలేదు. మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనాను రెవిన్యూ శాఖ నుంచి తప్పించి ఎటువంటి ప్రాధాన్యతా లేని ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా నియమించారు. మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ చందాను మళ్ళీ అప్రాధాన్యత కలిగిన పోస్టింగ్ ఇచ్చారు. ఆయనను రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శిగా నియమించారు. తెలంగాణకు చెందిన ఆర్వీ చంద్రవదన్‌ను ఎక్సైజ్ కమిషనర్ పోస్ట్ నుంచి తప్పించి విపత్తు నిర్వహణ కమిషనర్‌గా నియమించారు. చంద్రవదన్ ఆబ్కారీ కమిషనర్‌గా పని చేసి ఆదాయాన్ని గణనీయంగా పెంచినప్పటికీ ఆయన్ని ఎందుకు బదిలీ చేశారో ఐఏఎస్‌లకు కూడా అంతుపట్టడం లేదు. ఇప్పటికే ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖలకు ముఖ్య కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్‌కు ఆబ్కారీ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలను అప్పగించటం కూడా చర్చనీయాంశమైంది. ఒక దశలో ఆయన్ని కేవలం గిరిజన సంక్షేమ శాఖకే పరిమితి చేశారు. తాజా పోస్టింగ్‌లలో తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్న ఐఏఎస్‌లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు ఒక ఐఏఎస్ అధికారి తెలిపారు. లెక్కకు మించిన కొత్త జిల్లాలను ఏర్పాటు చేయటంతో అనుభవం లేని కొందరు జూనియర్ ఐఏఎస్‌లను కలెక్టర్లుగా నియమించారని వారి పాలనా సామర్థ్యం, ప్రభుత్వ పథకాల అమలు తీరును బేరీజు వేసి పోస్టింగ్‌లు ఇవ్వాలని పలువురు ఐఏఎస్‌లు అభిప్రాయ పడుతున్నారు.

ముందస్తుకే సిద్ధం కండి !

మొదటిపేజీ తరువాయి

చొప్పున ప్రారంభించడం అందులో భాగమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ముందస్తు విషయాన్ని టీఆర్ఎస్‌పార్టీలోని ముఖ్యనేతలకు, ప్రభుత్వంలోని కొంతమంది అధికారులకు సంకేతాలు పంపినట్టు తెలిసింది. ఈ ఏడాది డిసెంబర్ లోపు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయాలని, ఆయా పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసిన కొంతమంది పార్టీ ముఖ్య నేతలకు సీఎం సూచించినట్టు తెలిసింది. చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలంటే అధికారుల సహకారం అవసరముంటుందన్న ఉద్దేశంతోనే రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు చేపట్టారన్న ప్రచారం జరుగుతున్నది. ఇప్పటి వరకు ఉన్న ఐఎఎస్ అధికారులు అభివృద్ధి పనులకు సహకరించడం లేదని పార్టీలోని కొందరు సీనియర్ నేతలు సీఎంకు సూచించిన విషయం తెలిసిందే. కొంతమంది అధికారులకు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నారని పలువురు ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతంగా పూర్తి చేయాలంటే పాలను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, తమకు అనుకూలురైన వారిని ఆయా శాఖలో నియమించాలని పార్టీ నేతలు సీఎంపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అందులో భాగంగానే సహకరించని అధికారులకు ప్రాధాన్యత లేని శాఖలకు మార్చి, ఉపయోగపడతారన్న వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని తెలిసింది. నవంబర్, డిసెంబర్‌లోనే ఎన్నికలు ఉండొచ్చని కూడా ఒక మాట కూడా వారి చెవిన వేసినట్టు సమాచారం.

అనుకూలపవనాలు ఉన్నందునే..

టీఆర్ఎస్‌కు రాష్ట్రంలో అనుకూలపవనాలు ఉన్నందునే ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. 2019 మార్చిలో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉంది. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కొత్త పార్టీలు పుట్టుకువచ్చే అవకా శం ఉందని పార్టీ భావిస్తోంది. ఈ పార్టీల వల్ల పెద్దగా నష్టం లేకపోయినా ఓట్ల శాతం తగ్గే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ పార్టీలు మరింత లోతుగా ప్రజల్లోకి వెళ్లకముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లితేనే లాభం ఉంటుందని పార్టీ సీనియర్ నాయకత్వం అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం.

త్వరితగతంగా పనులు పూర్తి చేయండి

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. చేపట్టిన పనుల్లో నిధుల కొరత అడ్డంకిగా ఉంటే వెంటనే సమాచారం అందించాలని తెలిపింది. ప్రధానంగా మిషన్ భగీరథ కార్యక్రమాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సీఎం అదేశించారు. ఈ ఏడాదిలోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని, అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.

సెన్సెక్స్ ▼19 33,793	నిఫ్టీ ▲01 10,443	డాలరుకు రూపాయి విలువ 63.48	బంగారం(10.గ్రా) రూ. 30,149	వెండి (కేజీ) రూ. 42,000	కోడిగుడ్లు






కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410

బీఎస్ఎన్ఎల్ అపరిమిత డేటా ఆఫర్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. ప్రీపెయిడ్ వినియోగదారుల ను లక్ష్యంగా చేసుకొని రూ. 187తో అపరిమిత డేటా ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌లో భాగంగా బీఎస్ఎన్ఎల్ కస్టమర్లకు రూ.187 రీచార్జ్‌తో 28 రోజుల పాటు అపరిమిత 3జీ/4జీ డేటాను అందించనున్నట్టు పేర్కొంది. రోజులో పూర్తిగా 1జీబీ డేటా వినియోగించిన తర్వాత 40 కేబీపీఎస్ వేగంతో అపరిమిత డేటాను ఉపయోగించుకునే సదుపాయాన్ని కల్పించింది. అదేవిధంగా అపరిమిత లోకల్, ఎస్టీడీ కాల్స్‌తో పాటు నేషనల్ రోమింగ్ (ముంబయి, ఢిల్లీ మినహాయించి) ఉచితంగా అందించనున్నట్టు తెలిపింది. దీనితోపాటు ఇదే ప్లాన్‌లో కస్టమర్లు తమకు నచ్చిన రింగ్‌టోన్ పెట్టుకునేందుకు 'పర్సనలైజ్డ్ రింగ్ బ్యాక్ టోన్' పేరిట ప్రత్యేక సదుపాయాన్ని కల్పించనున్నట్టు పేర్కొంది.

ఎస్ఎంఈ ఐపీవోల దూకుడు



న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్ఎంఈ) నిధుల సేకరణకు ఉపయోగించిన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు విశేష స్పందన లభించింది. 2017లో 132 ఎస్ఎంఈలు రూ.1732 కోట్లు సమీకరించాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ఇది మూడు రెట్లు ఎక్కువ. వ్యాపారాల విస్తరణ, మూలధన పెట్టుబడి, ఇతర కార్పొరేట్ అవసరాల కోసం ఆ కంపెనీలు ఐపీవోలకు వచ్చాయి. కాగా 2016లో 66 ఎస్ఎంఈలు రూ.540 కోట్లు సమీకరించాయి. గత ఐదు సంవత్సరాల్లో ఎస్ఎంఈలు ఐపీవోల ద్వారా రూ.13,150 కోట్ల నిధులు రాబట్టుకున్నాయి. కాగా గతేడాది నిధులు సమీకరించిన 132 కంపెనీల మార్కెట్ మూలధన విలువ రూ.30,000 కోట్లుగా ఉంది.

పడిపోయిన బిట్ కాయిన్ విలువ



న్యూఢిల్లీ : కొత్త ఏడాది ప్రారంభంలోనే క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ భారీగా పడిపోయింది. సోమవారం ఒక్కరోజే 5 శాతం క్షీణించి 14,000 డాలర్లకు దిగజారింది. 2017లో ఈ కరెన్సీ ఏకంగా 1400శాతం పెరిగింది. గతేడాది డిసెంబర్ 18న బిట్ కాయిన్ విలువ రికార్డు స్థాయిలో 19,511 డాలర్లకు చేరింది. కాగా 2017 ముగింపు నాటికి 20 శాతం నష్టపోయి 16,000 డాలర్లుగా నమోదైంది. గత కొద్ది రోజుల నుంచి క్రిప్టో కరెన్సీలపై వివిధ దేశాల నియంత్రణ సంస్థలు, విశ్లేషకులు హెచ్చరికలు జారీ చేయడంతో బిట్ కాయిన్ విలువపై క్రమంగా పడిపోతోంది.

పోస్టుపెయిడ్‌పై తగ్గుతున్న ఆసక్తి..

● ప్రీపెయిడ్‌కు ఆదరణ ● ముందస్తు చెల్లింపులకే ఖాతాదారుల మొగ్గు ● చౌక ఆఫర్లే ప్రధాన కారణం! ● మారుతున్న మొబైల్ వినియోగదారుల సరళి



కోల్‌కత్తా: మొబైల్ వినియోగదారులు పోస్టుపెయిడ్ సెగ్మెంట్‌పై అనాసక్తిని వ్యక్తం చేస్తున్నారు. తర్వాత చెల్లింపుల కంటే ప్రీపెయిడ్ పైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. బిల్లోల పోస్టు పెయిడ్‌లో అధిక చార్జీల వసూలు చేస్తుండటంతో వారు ప్రీపెయిడ్‌కు మారుతున్నారు. గత సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పోస్టు పెయిడ్ ఖాతాదారులు మరో 2 శాతం తగ్గారని అంచనా. దీంతో కంపెనీల ఆదాయంలోనూ 10 శాతం తగ్గుదల చోటు చేసుకుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో టెలికం రంగంలో ప్రీపెయిడ్ ఖాతాదారుల సంఖ్య 95.6 శాతానికి చేరింది. అదే ఏప్రిల్-జూన్ కాలంలో ఈ వాటా 95.52 శాతంగా ఉంది. ఇదే కాలంలో 5.17 కోట్ల మంది పోస్టుపెయిడ్ వినియోగదారులున్నారని టెలికాం రెగ్యులేటరీ ఈ మధ్య కాలంలో ఒక నివేదికలో పేర్కొంది. ఇంతక్రితం వినియోగదారులతో పోల్చితే 1.84 శాతం తగ్గారు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా మెట్రో నగరాల్లోని కేటగిరీ ఏ, బీ సర్కిళ్లలో పోస్టుపెయిడ్ ఖాతాదారులు క్రమంగా తగ్గిపోతున్నారు. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పోస్టు పెయిడ్ సెగ్మెంట్ రెవెన్యూ 10 శాతం క్షీణించి రూ.5,900 కోట్లకు పరిమితమయ్యిందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ కోటక్ సెక్యూరిటీస్ పేర్కొంది. ఇదే సమయంలో ప్రీపెయిడ్ రెవెన్యూ 9శాతం పెరిగి రూ.24,000 కోట్లకు చేరింది. 2015-16లో పోస్టుపెయిడ్ రెవెన్యూ 30-40 శాతం పడిపోతే, ప్రస్తుతం మరో 20 శాతం మేర క్షీణించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా టెలికాం కంపెనీలు పోస్టు పెయిడ్ ఖాతాదారులను ఆకర్షించి రెవెన్యూ పెంచుకోవాలని భావిస్తున్నాయి.

అయితే ప్రీపెయిడ్ విభాగంలో ఆకర్షణీయ ఆఫర్లు రావడంతో ఖాతాదారులు వీటిపైనే ఆసక్తి చూపుతున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పోస్టుపెయిడ్ సెగ్మెంట్‌పై మరింత ఆర్థిక ఒత్తిడి నెలకొననుందని విశ్లేషిస్తున్నారు. ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ టారీఫ్‌ల మధ్య ఉన్న భారీ అంతరమే ప్రీపెయిడ్ చెల్లింపుల వైపు మొగ్గేలా చేస్తున్నాయని ఫిచ్ డైరెక్టర్ నితిన్ సోనీ పేర్కొన్నారు. కాగా పోస్టు పెయిడ్‌లోని సౌలభ్యాలను ప్రీపెయిడ్ సెగ్మెంట్ మాత్రం పూర్తి చేయలేదని మరో టెలికాం విశ్లేషకులు ప్రశాంత్ సింఘాల్ పేర్కొన్నారు. పోస్టు పెయిడ్‌లో నిరంతర వాయిస్ కాల్స్, డేటా సర్వీసెస్, ఇంటర్నేషనల్ రోమింగ్ లాంటి కీలక సదుపాయాలు ఉన్నాయన్నారు.

జియో రాకతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో ప్రీపెయిడ్ ఖాతాదారుల్లో వృద్ధి చోటు చేసుకుందని సోనీ పేర్కొన్నారు. మరోవైపు రిలయన్స్ కమ్యూనికేషన్స్, టెలినార్, టాటా టెలి సర్వీసెస్ లాంటి టెలికాం కంపెనీల పోస్టుపెయిడ్ వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారారు. జియో ఆకర్షణీయ ప్రీపెయిడ్ ఆఫర్లు ఖాతాదారులను ఈ విభాగం వైపు ఆసక్తిని పెంచేలా చేశాయన్నారు.

త్వరలోనే తపాల పేమెంట్ బ్యాంకులు



న్యూఢిల్లీ: వచ్చే ఏప్రిల్ నాటికి దేశంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) శాఖలను అందుబాటులోకి తేనున్నామని కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. 2017 జనవరి 30న రాయిపూర్, రాంచీలో రెండు పైలట్ శాఖలను ప్రారంభించడం జరిగిందన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ఏమీ తెరవలేదన్నారు. గతేడాది జనవరిలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఐపీపీబీకి అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ సేవలను దేశ వ్యాప్తంగా తపాళ శాఖల్లో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం దేశంలో 1.55 లక్షల పోస్టు ఆఫీసులు ఉన్నాయి. డిపాజిట్లను సమీకరించడం మినహా బ్యాంకు నిర్వర్తించే అన్ని లావాదేవీలను పేమెంట్ బ్యాంకులు అందించడానికి అనుమతులు ఉన్నాయి. కాగా ఇతర బ్యాంకులు, విత్త సంస్థలతో కలిసి ఐపీపీబీ ఈ సేవలను అందించనున్నాయా అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ దీనిపై ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయన్నారు. కాగా ఐపీపీబీ ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకు, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయన్నారు. 2016 ఆగస్టు 17న ఐపీపీబీ కంపెనీస్ యాక్ట్ 2013లో గుర్తింపు పొందిందన్నారు. తపాళ శాఖకు చెందిన 100 శాతం ఈక్విటీతో దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు.

మార్కెట్లలో త్రైమాసిక ఫలితాల భయాలు



ముంబయి : కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల అంచనాలు బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. 2017-18 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను వచ్చే వారం నుంచి ఆయా కంపెనీలు విడుదల చేయనున్నాయి. వీటిపై నెలకొన్న అంచ నాలు తుదకు మార్కెట్ల మిశ్రమ ఫలితాలకు దోహదం చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 19 పాయింట్లు నష్టపోయి 33,793 వద్ద ముగిసింది. ప్రారంభంలో 33,929.61 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 33,998.37-33,765.43 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ ఒక్క పాయింటు లాభపడి 10,443 వద్ద ముగిసింది. బీఎస్ఈలో రంగాల వారిగా లోహ సూచీ 1.47శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.22శాతం, రియాల్టీ 1.21 శాతం, కన్స్యూమర్ డ్యూరెబుల్స్ 0.98 శాతం చొప్పున రాణించాయి. మరోవైపు ఆటో సూచీ 0.26 శాతం నష్టపోయింది.

గ్రేటర్‌లో రహదారుల వ్యూహాత్మక అభివృద్ధి

- శంషాబాద్ వరకు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే
- రూ.1000 కోట్లతో ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ : అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో సిగ్నల్ రహిత రవాణాసౌకర్యాన్ని కల్పించేందుకు రూ.23వేల కోట్లతో రహదారుల వ్యూహాత్మక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ.3,200 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కారిడార్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ మాదాపూర్‌లో అయ్యప్ప సొసైటీ జంక్షన్ వద్ద రూ.44.30 కోట్లతో నిర్మించిన అండర్‌పాస్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం నగర మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'మిషన్ హైదరాబాద్' పేరుతో రానున్న ఏడేండ్లలో హైదరాబాద్ రూపురేఖలు మారుస్తామని చెప్పారు. నగరంలో రహదారులను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నామని, వీటిని రెండు దశల్లో చేపట్టనున్నట్టు చెప్పారు. ఇవాంక ట్రంప్ కోసమే రోడ్లను అభివృద్ధి చేశామన్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. ప్రస్తుతం 19 ప్రాంతాల్లో రూ.3200 కోట్లతో పనులు జరుగుతున్నాయని, వీటిలో భాగంగా నిర్మించిన అండర్‌పాస్‌ను ప్రారంభించామని అన్నారు. ఈ ఏడాదిలో మైండ్‌స్పేస్ అండర్‌పాస్, మైండ్ స్పేస్ ఫ్లైఓవర్, కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి ఫ్లైఓవర్, చింతల్‌కుంట అండర్‌పాస్, కామినేని ఫ్లైఓవర్, ఎల్బీనగర్ ఫ్లైఓవర్, ఎల్బీనగర్ అండర్ పాస్‌లు ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రూ.1000కోట్లతో ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించనున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రూ.270కోట్లతో అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు రూ.426కోట్లతో ఉక్కు వంతెన నిర్మాణంతో పాటు ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేను శంషాబాద్ వరకు పొడిగించనున్నట్టు వివరించారు. లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఎస్ఆర్‌డీపీ, ఇతర ప్రాజెక్టుల పనుల కోసం బాండ్లు, బ్యాంకు రుణాల రూపంలో నిధులు సేకరిస్తామన్నారు.

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 400ఏండ్లకు పైగా ఉన్న పురాతన నగరమైన హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేసేందుకు ప్రజల భాగస్వామ్యం కల్పించనున్నట్టు తెలిపారు. రవాణ శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ సిటీ నిర్మాణంలో భాగంగా మొట్టమొదటి అండర్‌పాస్‌ను రికార్డు స్థాయిలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శమన్నారు.

కేంద్రమంత్రి సురేష్‌ప్రభును కలిసిన కవిత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభును నిజామాబాద్ ఎంపీ కవిత బుధవారం డిల్లీలో కలిశారు. నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజక వర్గంలో స్పైస్ పార్క్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాల భూమిని కేటాయించి, రూ.30 కోట్లు మంజూరు చేసిందని మంత్రి సురేశ్ ప్రభుకు కవిత తెలిపారు. డిపిఆర్‌ను స్పైస్ బోర్డ్ ప్రిపేర్ చేసిందని, పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. స్పందించిన మంత్రి సురేశ్ ప్రభు రాష్ట్ర ప్రభుత్వ నిధులకు తోడుగా కేంద్రం తరపున రూ. 20 కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. దీంతో మంత్రి సూచన మేరకు ఫిబ్రవరి 3న స్పైస్ బోర్డ్ చైర్మన్, వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు హైదరాబాద్‌కు వస్తారని కవిత తెలిపారు. ఆ రోజు జరిగే వర్క్‌షాపుకు పసుపు పండించే రైతులు, పసుపును ఎగుమతి చేసే వ్యాపారాలు, పసుపు పంటతో అనుబంధం ఉండే వారు హాజరవుతారని చెప్పారు. తెలంగాణలో టర్మరిక్ సెల్ ఏర్పాటుతో రైతులకు నాణ్యమైన పసుపు వంగడాలు, పంట చేతికి వచ్చిన తరవాత ప్రాసెస్ చేసేందుకు రైతులకు బాయిలర్‌లను అందజేసేందుకు నాబార్డ్‌ను కోరతామని మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు.

పిప్పెట్, బ్యూరెట్ తెలియని ఇంటర్ విద్యార్థులు!

మెజార్టీ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ అంతా డొల్ల

- జంబ్లింగ్‌పై సర్కారు దాటవేత ధోరణి
- పునాది విద్య పటిష్టతను పట్టించుకోని ప్రభుత్వం
- ల్యాబ్‌ల్లేవు ఉన్నా కెమికల్స్, పరికరాలుండవు
- కార్పొరేట్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ అంటేనే మాయ
- అధికారులకు మామూళ్లు... పిల్లలకు మార్కులు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌లో కొంతమంది ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు, కొందరు చేయిస్తలేరు. వసతుల్లేవు, పరికరాల్లేవు, ల్యాబ్ సరిగ్గా లేదు, కెమికల్స్ లేవు అని చెప్తున్నారు. మంత్రి చెప్తారు కెమికల్స్ ఉన్నాయా? అనుకుంటున్నారు. ఆశ్చర్యమేందంటే చాలా కాలేజీల్లో బ్యూరెట్లు, పిప్పెట్లు ఉన్నాయన్న సంగతి విద్యార్థులకు తెలియదు. బ్యూరెట్ ఏదో, పిప్పెట్ ఏదో విద్యార్థులు గుర్తించడం లేదు ఎలా వినియోగించాలో తెలియదు. నేను లెక్చరర్‌గా ఉన్నప్పుడు ప్రాక్టికల్స్ కచ్చితంగా చేయించాం. ఇప్పుడు సాల్ట్ అనాలసిస్, వాల్యుమెట్రిక్ అనాలసిస్ చేయించినట్టు కనిపించడం లేదు. ల్యాబ్ ఎక్విప్‌మెంట్, పరికరాలు, కెమికల్స్ కొనుగోలు చేసి పంపాలి. అన్ని కాలేజీల్లోనూ తప్పనిసరిగా ప్రాక్టికల్స్ చేయించాలి. ప్రిన్సిపాల్, సబ్జెక్టు టీచర్లు చొరవ తీసుకోవాలి.'అని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఇంటర్ ప్రాక్టికల్స్ జంబ్లింగ్‌లో నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా దాటవేత ధోరణిని అవలంబిస్తున్నది. విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్మీడియెట్ విద్య పునాది. ఇంటర్ తర్వాతే ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు ఇలా ఏం కావాలన్నా దారి చూపించేది ఇంటర్. ఇంటర్ విద్య ఎంత ప్రమాణాలతో ఉంటే భవిష్యత్తులో అంత ఉన్నతస్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుంది. అలాంటి ఇంటర్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రాక్టికల్స్ నిర్వహణపై పటిష్టమైన చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నది. ల్యాబ్‌ల నిర్వహణ, పరికరాలు, కెమికల్స్ కొనుగోలుకు నిధులు కేటాయించ లేదంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నదో అర్థమవుతున్నది. ఇంజినీరింగ్ విద్యలో ప్రమాణాలు లేవనే కారణంతో కాలేజీలకు గుర్తింపు రద్దు, సీట్లు, కోర్సులకు కోత విధిస్తున్నది ప్రభుత్వం. విద్యావ్యాపారం చేస్తూ, ప్రాక్టికల్స్ నిర్వహించకుండా యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ కాలేజీలపై మాత్రం చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. ఇంకా కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే నిర్ణయాలే చేస్తున్నది. ప్రాక్టికల్స్‌ను జంబ్లింగ్‌లో నిర్వహిస్తే ఎగ్జామినర్లు, ఇంటర్ బోర్డు అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సిన పరిస్థితి తగ్గే అవకాశముంది. తప్పనిసరిగా కాలేజీలన్నీ ల్యాబ్‌లు, పరికరాలు, కెమికల్స్ సిద్ధం చేసుకోవాల్సిన అవసరమూ ఏర్పడుతుంది. దీని వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందని విద్యావేత్తలు చెప్తున్నా రు. ఇక ప్రభుత్వ కాలేజీల్లో ల్యాబ్‌లు సరిగ్గా ఉండవు. ఉన్నా ప్రయోగాలకు పనికొచ్చే పరిస్థితి ఉండదు. పరికరాలు, కెమికల్స్ కొనేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల పరిస్థితి మరింత అధ్వానం. అటు కార్పొరేట్ కాలేజీలు, ఇటు ప్రభుత్వ కాలేజీల్లో ఇలాంటి పరిణామాలన్నీ తెలిసినా ప్రాక్టికల్స్ తప్పనిసరిగా జరపాలని తూతూమంత్రంగా ఆదేశాలు ఇవ్వడం వల్ల ప్రయోజనమేంటనీ విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ఇంటర్ విద్యలో ప్రాక్టికల్స్ అంతర్భాగం

ఇంటర్మీడియెట్ విద్యలో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ అంతర్భాగం. ఇంటర్‌లో మొత్తం వెయ్యి మార్కులుంటాయి. థియరీ సబ్జెక్టుల్లో ఎంపీసీ విద్యార్థులకు 940 మార్కులు, బైపీసీ విద్యార్థులకు 880 మార్కులుంటాయి. ప్రాక్టికల్స్‌కు ఎంపీసీ విద్యార్థులకు 60 (భౌతిక శాస్త్రం 30, రసాయన శాస్త్రం 30) మార్కులు, బైపీసీ విద్యార్థులకు 120 (కెమిస్ట్రీ 30, ఫిజిక్స్ 30, జంతుశాస్త్రం 30, వృక్షశాస్త్రం 30) మార్కుల చొప్పున ఉంటాయి. ప్రాక్టికల్స్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సిందే. ఇంకోవైపు ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉంది. అందుకే ప్రాక్టికల్ పరీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇంత ప్రాధాన్యత ఉన్నా ప్రాక్టికల్స్ పట్ల మెజార్టీ కాలేజీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ప్రాక్టికల్స్ నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రాక్టికల్స్ నిర్వహణ చాలా కాలేజీల్లో డొల్ల అని తెలుస్తున్నది. కార్పొరేట్ కాలేజీల్లో ఇక ప్రాక్టికల్స్ అనేవి ఓ మాయ. ల్యాబ్‌లుండవు, కెమికల్స్, పరికరాలు అసలే ఉండవు. కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులు థియరీ పరీక్షల్లో మార్కులు, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో సాధించే ర్యాంకుల పైనే దృష్టి సారిస్తారు. ఇంటర్ బోర్డు నుంచి వచ్చే అధికారులకు మామూళ్లు (లంచం) ఇచ్చి విద్యార్థులకు పూర్తి మార్కులు వేయిస్తాయని కార్పొరేట్ కాలేజీలపై ఆరోపణలున్నాయి. అందుకే ఎక్కువ మంది సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పట్ల కనీస అవగాహన ఉండడం లేదని తెలుస్తున్నది. పిప్పెట్, బ్యూరెట్ అంటే ఏంటో గుర్తించలేని పరిస్థితిలో ఇంటర్ విద్యార్థులున్నారని సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. ప్రాక్టికల్స్ నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో మంత్రి మాటలే తేటతెల్లం చేస్తున్నాయి.

ప్రాక్టికల్స్ ద్వారా మెరుగైన జ్ఞానం

ప్రాక్టికల్స్ ద్వారా విద్యార్థులు మెరుగైన జ్ఞానాన్ని పొందేందుకు అవకాశముంటుందని నిపుణులు సూచిస్తున్నారు. థియరీ ఎంత చదివినా ప్రాక్టికల్స్ చేస్తే ఆ అంశాలపై పట్టు పెరుగుతుందని చెప్తున్నారు. ఇంటర్ విద్య భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇంజినీర్లు, డాక్టర్లు, వృత్తి నిపుణులు, శాస్త్రవేత్తలుగా మారేందుకు అవకాశముంటుంది. థియరీ సబ్జెక్టులపై ఎంత పట్టు పెరిగేందుకు ప్రాక్టికల్స్ దోహదపడతాయి. రసాయన శాస్త్రంలో లవణ విశ్లేషణ, ఘనపరిమాణాత్మక విశ్లేషణ, కర్బన సమ్మేళనాలు, కొత్త ప్రయోగాలు, వైవా, రికార్డు రాయడం ఉంటాయి. భౌతిక శాస్త్రంలో 20 ప్రయోగాలు న్నాయి. వృక్షశాస్త్రంలో ఆవృత బీజ కుటుంబం, కాండం/వేరు ఛేదం తీయడం, వృక్ష శరీర ధర్మశాస్త్ర ప్రయోగం నిర్వహించడం, స్పాటింగ్ బీట్లను గుర్తించాల్సి ఉంటుంది. జంతుశాస్త్రంలో విచ్ఛేదనాలు, ప్రయోగాల నిర్వహణ, స్పాటర్‌లను గుర్తించాలి.

ప్రాక్టికల్ నిర్వహించని కాలేజీలపై చర్యలు చేపట్టాలి : గౌరి సతీష్ : టీపీజేఎంఏ గౌరవాధ్యక్షులు

విద్యార్థులకు ప్రాక్టికల్ జ్ఞానం అవసరం. ఇప్పటికైనా కార్పొరేట్ కాలేజీలపై ఇంటర్ బోర్డు దృష్టి పెట్టాలి. ప్రాక్టికల్స్ నిర్వహించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి. ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి.

నిర్దిష్ట చర్యలు చేపట్టడంలో సర్కారు విఫలం : కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు నిర్దిష్ట చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కార్పొరేట్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ నిర్వహించకపోయినా అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కాలేజీల్లో చదివే సైన్స్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ల్యాబ్‌లున్నా పరికరాలు, కెమికల్స్ లేక ప్రాక్టికల్స్ సక్రమంగా జరగడం లేదు. ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు అని చెప్తున్న ప్రభుత్వం ల్యాబ్‌లను ఆధునీకరించడంపై ఎందుకు దృష్టి సారించడం లేదు.

పార్లమెంట్‌లో 'భీమా-కోరేగావ్' ప్రకంపనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో



మహారాష్ట్రలోని పూణే సమీపంలో గల 'భీమా-కోరేగావ్'లో చెలరేగిన హింసాత్మక ఘటన పార్లమెంట్ ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. ఈ హింసలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ హస్తముందన్న కాంగ్రెస్ ఆరోపణలు ఉభయసభల్లో గందరగోళం సృష్టించింది. భీమా-కోరేగావ్ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలన్న ప్రధానప్రతిపక్షం... పార్లమెంట్‌లోనూ ప్రధానమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. దళితులపై జరుగుతున్న దాడుల ఘటనపై ప్రధానమంత్రి మౌనం వహిస్తున్నాడని, ఈ విషయంలో ఆయన 'మౌన బాబా'లా వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ ఆరోపణ పార్లమెంట్‌లో అధికార, విపక్ష సభ్యుల మధ్య దుమారం రేపింది. దీంతో ఉభయసభలు పలుమార్లు వాయిదా పడ్డాయి.

బుధవారం ఉదయం లోక్‌సభలో ఈ అంశాన్ని లోక్‌సభాప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గే లేవనెత్తారు. 'ఫాసిస్టు శక్తులు దేశంలో దళితులను అణగదొక్కాలని చూస్తున్నాయి. ఉనా, రోహిత్ వేముల, నేడు భీమా-కోరేగావ్ హింస అందులో భాగమే' అని అన్నారు. గ్రామీణ ప్రాంతంతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ దళితులపై జరుగుతున్న దాడులు పెరుగడం ఆందోళనకరంగా మారిందని వాపోయారు. దళితులు స్వాభిమానంతో జీవించాలని భావించినప్పుడు.. కొంతమంది జోక్యం చేసుకుని వాళ్లపై దాడులకు పాల్పడుతున్నాని అన్నారు. భీమా-కోరేగావ్‌లో జరిగింది అదేనని చెప్పుకొచ్చారు. మహారాష్ట్రలో మహార్, మరాఠీల మధ్య కరుడుగట్టిన హిందూత్వవాదులు హింసను రెచ్చగొట్టారని అన్నారు. దీని వెనుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ హస్తముందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాలు ఎక్కడ ఉన్నాయో అక్కడ దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న సమయంలో ప్రధాని మౌనంగా ఉంటున్నారని, కాబట్టి సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఖర్గే ఆరోపణలను పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ తప్పుపట్టారు. ఉద్రిక్త పరిస్థితులను తగ్గించాల్సింది పోయి మరింత ఆజ్యంపోసే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. విభజించు పాలించు విధానాన్ని కాంగ్రెస్ నేతలు అవలంబిస్తున్నారనని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు ఆరోపణలు గుప్పించుకున్నారు. దీంతో సభ 12.45కు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రధాని ప్రకటన చేయాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. చివరకు గురువారానికి వాయిదా పడింది.

రాజ్యసభ పలుమార్లు వాయిదా

భీమా-కోరేగావ్ ఘటన ఇటు రాజ్యసభను కుదిపేసింది. ఈ అంశంపై ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు బీఎస్పీ తదితర పార్టీలు లేవనెత్తడంతో స్వల్ప వ్యవధిలోనే మొదట 12 గంటలకు, అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ తరువాత ప్రారంభమైన పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో మధ్యాహ్నం మూడు గంటలకు వాయిదా పడింది. ఈ అంశంపై రాజ్యసభా ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దళితులపై దాడులు అధికమయ్యాయని అన్నారు. కులం, మతం పేరుతో దేశాన్ని విభజిస్తోంది ఎవరో యావత్తు ప్రపంచానికి తెలుసని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీజేపీ దళిత వ్యతిరేకి అని ఆరోపించారు.

బతుకుదెరువుకొచ్చి బలైపోయారు

- రోడ్డుప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి

నవతెలంగాణ -అశ్వాపురం

బతుకు దెరువుకు రాష్ట్రాలు దాటి వచ్చి బలైపోయారు. ఉదయాన్నే పనిలో నిమగ్నమై ఉన్న వారిని లారీ పొట్టన పెట్టుకుంది. డీసీఎం వ్యానులో ఉన్న పైపులను దింపుతున్న కూలీలను బొగ్గు లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కూలీలు చనిపోయారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట గ్రామం వద్ద బుధవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని డాందినగర్‌కు చెందిన శివరాత్రి గోపయ్య (46), తోడేటి భాగ్యరావు (26), సన్యాసిపేట కనకరావు (43)లు మరికొందరితో కలసి బీఎస్ఎన్ఎల్ లైన్‌కు సంబంధించిన పైపులను రెండు డీసీఎం వాహనాలలో తీసుకొచ్చారు. డీసీఎం వాహనంలో ఉన్న పైపుల కట్టలను మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన కూలీలు కిందకు దింపుతున్నారు. అదే సమయంలో మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ డీసీఎం వ్యాన్‌లను వెనక నుంచి ఢీ కొట్టింది.

దీంతో అక్కడ పని చేస్తున్న వారిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. శివరాత్రి రామచంద్రయ్య, శ్రీనివాస్, సంపంగుల వెంకటేశ్, తురక వెంకన్న, బెజవాడ రాజు, భద్రాజిలకు గాయాలయ్యాయి. వారిని వైద్యం నిమిత్తం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల బంధువు వీరాస్వామి ఫిర్యాదు మేరకు అశ్వాపురం సీఐ అల్లం నరేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11
హైదరాబాద్
గురువారం 4-1-2018
www.navatelangana.com
కిసాన్
నవతెలంగాణ

చీడపీడలతో జాగ్రత్త!

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 27-32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 06-18 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండొచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 26 నుంచి 33 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 6 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

రైతన్నలకు సూచనలు

- రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. పాలిథీన్ షీట్ల ద్వారా నారుమడిని కాపాడుకోవాలి. రాత్రిళ్లు కప్పి ఉదయం వేళల్లో తీసేయాలి. రాత్రి వేళలో నారుమడిలో సంవృద్ధిగా నీటిని ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసేయాలి. మళ్లీ ఉదయం 10-11గంటలకు నీరు పెడితే నారు ఎదుగుదల బాగా ఉంటుంది. నారుమడిలో జింక్ లోపం లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి అవసరం మేరకు ఒకట్రెండుసార్లు ఐదు రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు పైపాటుగా వేసే యూరియాతో (2.5 కిలోలు)తోపాటు కార్బండ జిమ్ 25శాతం, మ్యాంకోజెబ్ 50 శాతం కలిగిన మిశ్రమ శిలీంధ్ర నాశకాన్ని 6.25 గ్రాములు పట్టించి నారుమడిలో వేయాలి. వరిలో అగ్గితెగులు నివారణకు లీటరు నీటిలో 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ కలిపి ఒకసారి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు 15 రోజులకు రెండు గుంటల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు వేయాలి.
- మొక్కజొన్న పైరు మొలిచిన 10 నుంచి 15 రోజుల మధ్య మొవ్వ పురుగు ఆశించే అవకాశాలున్నాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల క్లోరోపైరిఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. పైరు 25 నుంచి 30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 3 నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితుల్లో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్‌ని కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వేరుశనగలో కాండం కుళ్లు తెగులు ఆశించేందుకు అనుకూలం. నివారణకు లీటరు నీటిలో ఒక మి.లీటరు టేబ్యుకొనజోల్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ కలిపి కాండం అడుగుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు సోకేందుకు కూడా వాతావరణం అనుకూలంగా ఉంది. నివారణకు 2 గ్రాముల మ్యాంకోజెబ్, కార్బండజిమ్ లేదా 2 క్లోరోథలోనిల్, ఒక మి.లీటరు టేబ్యుకొనజోల్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారీ చేయాలి. అంతేకాకుండా ఈ పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టి అడుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 10 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతినిబట్టి లీటరు నీటిలో 5 మి.లీటర్ల వేపనూనె లేదా 2.5 మి.లీటర్ల క్లోరిపైరిఫాస్ లేదా 1.5 గ్రాము థయోడికార్బ్ లేదా 2 మి.లీటర్ల క్లోర్‌పెనపైర్ లేదా 1 మి.లీటరు నోవాల్యూరాన్ మందును కలిపి పిచికారీ చేయాలి.
- వివిధ కూరగాయల పంటల్లో తెల్లదోమ, పేనుబంక, తామరపురుగులు ఆశిస్తున్నాయి. తెల్లదోమ నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల ట్రైజోఫాస్ లేదా 0.2 గ్రాము అసిటామిప్రిడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. పేనుబంక నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల డైమిథో ఎట్ మందును కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2 మి.లీటర్ల ఫిప్రోనిల్ మందును కలిపి పిచికారీ చేయాలి.



మోతాదు ముఖ్యం

పంటల ప్రధాన వనరుల్లో ఎరువుల పాత్ర కీలకం. పైరుకు ఇవి పోషకాలు అందించి అధిక దిగుబడులు అందించేందుకు దోహదపడతాయి. అయితే.. వీటి వినియోగం విషయంలో జాగ్రత్తలు ప్రధానం. లేదంటే పంట ఖర్చు పెరగడంతోపాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. తగిన మోతాదులో ఎరువుల వాడితేనే అన్నిరకాల నష్టాల నుంచి రక్షణ పొందొచ్చు.

నత్రజని ఎరువులు

ఈ ఎరువుల ద్వారా పంటలకు 25 నుంచి 35శాతం మాత్రమే నత్రజని అందుతుంది. అమ్మోనియా రూపంలో ఆవిరి కావడం, సేంద్రియ రూపాన్ని సంతరించుకోవడమే దీనికి కారణం. అందుకే.. అవసరాన్నిబట్టే పంటలకు ఈ పోషకాలను అందించాలి. ఎరువు వేసే పద్ధతి కూడా ముఖ్యమైనదే. నీరు ఎక్కువ నిల్వ ఉంచాల్సిన వరి పొలంలో యూరియా రూపంలో అందిస్తే అత్యంత స్థిరత్వం కలిగిన అమ్మోనియా రూపంలో నత్రజని ఎక్కువగా అందుబాటులో ఉంటుంది. ఆమ్లత్వం కలిగిన ఎత్తైన నేలల్లో కూడా అమ్మోనియా ఆధారిత నత్రజని ఎరువులు వేయడం ద్వారా వర్షాకాలంలో అమ్మోనియా మృతికా కణాలకు అతుక్కొని నష్టపోకుండా ఉంటుంది. అతకబడిన అమ్మోనియా నైట్రిఫికేషన్ పద్ధతి ద్వారా నెమ్మదిగా విడుదలవుతూ దీర్ఘకాలం పంటలకు నత్రజని అందిస్తుంది. అత్యధిక అమ్లత్వం కలిగిన మెరక నేలల్లో అమ్మోనియం సల్ఫేట్‌కి బదులు యూరియా రూపంలోనే ఇవ్వడం మేలు. తక్కువ వర్షపాతం కలిగిన క్షారత్వ మెరక నేలల్లో నైట్రేట్ రూపంలో అందించాలి. యూరియా లేదా అమ్మోనియా ఆధారిత ఎరువుల రూపంలో వాడితే అవిరి రూపంలో నష్టం జరిగే అవకాశం ఉంది. అన్ని ఎరువులు కోల్పోయే స్వభావం ఎక్కువ. పంట మొత్తం కాలంలో నత్రజని పోషకం అవసరం ఉంటుంది. పంట ఎక్కువ మోతాదులో తీసుకోవాలంటే దశల వారీగా అందించాలి. దీర్ఘకాలిక, బహువార్షిక పంటలకు ఎక్కువ దశలలో ఎరువులు వేయాలి. అందుకు అనుగుణంగా సిఫార్సు చేసిన మొత్తం ఎరువును ముందే విభజించుకోవాలి. తక్కువ ధన అయాను మారక సామర్థ్యం కలిగిన మొరపు, ఇసుక నేలల్లో నత్రజని నష్టం ఎక్కువ. కాబట్టి ఇసుక, ఇతర తేలికపాటి నేలల్లో ఎక్కువ దఫాలుగా ఎరువులు వేయాలి. మధ్యకాలిక వరి వంగడాలకు మూడు దఫాలుగా దమ్ము చేసేటప్పుడు పిలకల దశ, కంకి పడే దశలో వేయాలి. ముతక నేలల్లో మొత్తం ఎరువు వివిధ దశల్లో మూడు నాలుగు దఫాలుగా వేయాలి. పంట వేసేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు నీటి నిల్వ వల్ల నత్రజని ఎరువులను వేయడం కుదరకపోతే మరో పద్ధతిని అవలంబించొచ్చు. మొత్తం ఎరువును వేప లేదా బొగ్గు పూసిన నత్రజని ఎరువులను ఒకే దఫాగా దమ్ము చేసేటప్పుడే వేసుకోవచ్చు. రెండు పంటలు వేసే మాగాణి నేలల్లో మొదటి పంటకు సిఫార్సు చేసిన ఎరువుల్లో 50శాతం సేంద్రియ ఎరువుల రూపంలో అందించడం మేలు. తర్వాత పంటకు అందుబాటులో ఉంటుంది. భూముల భౌతిక స్థితి మెరుగవుతుంది. ఆమ్ల భూములను సవరించాలంటే సున్నం ఆధారిత పదార్థాలు వాడాలి. అయితే... యూరియా లాంటి అమ్మోనియా రూపంలో నత్రజనిని అందించే ఎరువులు వాడేటప్పుడు సున్నం ఒకటి రెండు వారాల ముందే వేయాలి. ఒకేసారి వేస్తే అమ్మోనియారూపంలో ఆవిరయ్యే ప్రమాదం ఉంది.



యూరియాను వెదజల్లినప్పుడు 70శాతం నత్రజని వివిధ రూపాల్లో నష్టం జరిగే అవకాశం ఉంది.

నష్టాన్ని తగ్గించే మార్గాలు

బంక మట్టి నేలలు, కిలో మృతికలో 10 సీఎండీ కంటే ఎక్కువ ధన అయానుమారక సామర్థ్యం ఉన్న నేలల్లో యూరియాను గుళికలు, గుండ్ల రూపంలో అందించాలి. నీటి నియంత్రణ కష్టమైన నేలలు, తరచుగా ముంపు ఎదురయ్యే నేలల్లో సల్ఫర్ లేదా లక్కపొర వేసిన యూరియాను వాడాలి. నేరుగా విత్తిన పంటలకు లోతైన నేలల్లో నత్రజని, యూరియా రూపంలో వాడేందుకు ముందు ఇంకా ఇది మేలు. తడిచిన మట్టితో యూరియా కలిపి 24నుంచి 48 గంటలలు నీడలో ఆరబెట్టాలి. యూరియాను ఐదు రెట్లబరువున్న వేప చెక్కతో కలిపి వాడితే నత్రజని నెమ్మదిగా ఎక్కువ కాలం పంటకు అందుతుంది. మాగాణి వరి పొలాల్లో వేప చెక్కతో కలిపే ముందు 100 కిలోల యూరియాను లీటరు కిరోసిన్‌తో రెండు కిలోల బొగ్గుతారును కలపాలి. ఐదు శాతం వేప పదార్థాలతో శుద్ధి చేసిన యూరియాను గంట లేదా గంటన్నర ఆరబెట్టి నేరుగా విత్తే దమ్ము చేసిన లోతట్టు నేలల్లో వాడితే నత్రజని వాడక సామర్థ్యం రెట్టింపవుతుంది.

సాధ్యమైనంత వరకు యూరియాను లోతు సాళ్లలో వేయాలి. దున్ని, దమ్ము చేసిన తర్వాత తేలికపాటి నేలల్లో యూరియా చెక్కలు లేదా గుళికల రూపంలో లోతుగా వేయాలి. ప్రధాన పొలంలో వరి నాటిన తర్వాత గ్రాన్యూల్స్ లేదా యూరియా చెక్కల రూపంలో అందించాలి. అదే విధంగా గంధకం లేదా లక్కతో శుద్ధి చేసిన యూరియా అయితే వెదజల్లొచ్చు.

త్వరితగతిన నత్రజని స్పందనను పంటలో చూడాలనుకుంటే ఐదు శాతం యూరియా ద్రావణం తయారు చేసి పిచికారీ చేయాలి. పవర్ స్ప్రేయర్ వాడితే 15శాతం అదనంగా యూరియా వాడాలి. తాజా యూరియాను వాడకపోవడం (నేరుగా పిచికారీ) మేలు. బైయూరెట్ వల్ల ఆకులు మాడిపోయే ప్రమాదం ఉంది.

- డాక్టర్ అమరపల్లి గీత
శాస్త్రవేత్త, ప్లాంట్ ఫిజియాలజీ విభాగం,
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
పాలెం, మహబూబ్‌నగర్ జిల్లా



కుందేళ్ల పెంపకం ఇలా..

కుందేళ్ల పెంపకం లాభదాయకమే. దీని ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందొచ్చు. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరు ఇది. నిరుద్యోగ యువత, స్వావలంబన సాధించుకోవాలనుకునే మహిళలు కుందేళ్ల పెంపకాన్ని చేపట్టొచ్చు. వివిధ రంగాల్లోని వ్యాపారులు, ఉద్యోగులు కూడా పార్ట్‌టైమ్‌గా చేసుకోవచ్చు.

పోషకాలు అధికం

కుందేళ్ల పెంపకం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. దీని మాంసం అధిక ప్రోటీన్లు కలిగి ఉంటుందని కాబట్టి చాలా మంది కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. కుందేలు మాంసం ఆరోగ్యానికి మంచిదంటారు. ఇందులో మాంసకృత్తులు 21 శాతం ఉంటే కొవ్వు 8 శాతం మాత్రమే ఉంటుంది.

కుందేళ్లలో జాతులు

- తెల్ల(వైట్)జైంట్, బూడిద రంగు (గ్రే) జైంట్, ఫ్లెమిష్ జైంట్ ఎక్కువ బరువున్న జాతులు. నాలుగు నుంచి ఆరు కిలోల వరకు తూగుతాయి.
- న్యూజిలాండ్ వైట్, న్యూజిలాండ్ రెడ్, కాలిఫోర్నియన్ మధ్యరకపు బరువున్న జాతులు. ఇవి మూడు నుంచి నాలుగు కిలోల బరువు తూగుతాయి.
- సోవియట్ చిన్‌చిల్లా, డచ్ తక్కువ బరువు ఉండే జాతులు. ఇవి రెండు నుంచి మూడు కిలోల బరువు తూగుతాయి.

పోషణ పద్ధతులు

ఇంటి వద్దే తక్కువ ఖర్చుతోనే కుందేళ్లను పెంచుకోవచ్చు. ఎండ, వానతోనే కాకుండా కుక్కలు, పిల్లుల బారి నుంచి రక్షించుకునేందుకు గూళ్లు నిర్మించుకోవాలి. కుందేళ్ల పెంపకంలో రెండు విధానాలు ఉన్నాయి. కుందేళ్ల నేలకు రంధ్రాలు చేయకుండా అరికట్టేందుకు కాంక్రీటుతో గచ్చు చేయించాలి. చెక్క నలి ధాన్యపు ఊక, ఎండుగడ్డితో నేలపై నాలుగు నుంచి ఆరు అంగుళాల మందంగా నింపాలి. వ్యాధుల బారినపడ్డప్పుడు వేర్వేరుగా ఉంచాలి.



అవసరమైన నేల : పెద్ద మగ కుందేలు 4 చదరపు అడుగులు, ఆడ కుందేలు 5 చదరపు అడుగులు, పిల్ల కుందేళ్లు 1.5 చదరపు అడుగులు.

బోను పరిమాణం

- పెద్ద కుందేలుకు 1.5 అడుగుల పొడవు, 1.5 అడుగుల వెడల్పు, 1.5 అడుగుల ఎత్తు కలిగి ఉండాలి. ఇది పెద్ద కుందేలుకే కాకుండా రెండు పెరుగుతున్న కుందేళ్లకు సరిపోతుంది.
- పెరుగుచున్న కుందేలుకు పొడవు 3 అడుగులు, వెడల్పు 1.5 అడుగులు, ఎత్తు 1.5 అడుగులు. ఇందులో మూడు నెలల వయస్సు గల కుందేళ్లు నాలుగు నుంచి ఐదు వరకు సరిపోతాయి.
- పిల్ల కుందేళ్లకు పెరుగుతున్న కుందేళ్లను సాకడానికి ఉంచే బోనులే పనికి వస్తాయి. అయితే... కూనలు బయటకు రాకుండా బోను అడుగుభాగాన, చుట్టూ అన్ని పక్కలా 1.5x 1.5 అంగుళాల కొలతలు గల వెల్డింగుతో చేసిన మెష్‌తో తయారు చేయించాలి.

గూడు పెట్టె : కుందేలు పిల్లలను సాకే కాలంలో సురక్షితమైన ప్రశాంత వాతావరణం కల్పించడం కోసం ఈ గూడు పెట్టెలు చాలా అవసరం. ఈ గూడు పెట్టెలు జింకు పూతఉన్న ఇనుముతో గానీ, చెక్కతో గానీ తయారు చేయాలి. ఈ గూడు పెట్టెల పరిమాణం, బోనులో పట్టే విధంగా ఉండాలి.

గూడు పెట్టె కొలతలు : పొడవు 22 అంగుళాలు, వెడల్పు 12 అంగుళాలు, ఎత్తు 12 అంగుళాలు ఉండాలి. భాగం తెరచి ఉండేలా రూపొందించాలి. అడుగు భాగం 1.5 x 1.5 అంగుళాల కొలతలు గల వెల్డింగుతో చేసిన మెష్‌తో తయారుచేసి ఉండాలి. పదిహేను సెంటీమీటర్ల వ్యాసం కలిగిన గుండ్రని రంధ్రాన్ని గూడు పెట్టె పొడవుగా ఉన్న భాగంవైపు అడుగు భాగం నుంచి 10 సెంటీమీటర్ల ఎత్తులో చేయాలి. ఆడ కుందేలు బోనులో నుంచి గూడు పెట్టెలోనికి వెళ్లేందుకు ఈ రంధ్రం సహాయ కారిగా ఉంటుంది. గూడు పెట్టె అడుగు భాగం నుంచి 10 సెంటీమీటర్ల ఎత్తులో రంధ్రాన్ని రూపొందించడం ద్వారా కుందేలు పిల్లలు గూడు పెట్టెలో నుంచి బయటకు రావడాన్ని నివారిస్తుంది.

పెరడులో పెంపకం కోసం : పెరడులో కుందేళ్ల పెంపకానికి నిర్మించే బోనులు నేల నుంచి 3 -4 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేయాలి. ఈ బోనుల అడుగుభాగం నీళ్లు, తెమ్మ చారని పదార్థంతో తయారుచేయాలి.

ఆహార, నీళ్ల తొట్టెలు : కుందేళ్ల ఆహారం, నీళ్ల తొట్టెలను జింకు పూతఉన్న ఇనుముతో తయారు చేయించాలి. ఆహారపు తొట్టెలు 'జె' ఆకారంలో బోనులకు బయటి వైపున బిగించి ఉండాలి. ఆహారానికి, నీటికి అయ్యే పెట్టుబడి ఖర్చు తగ్గించడానికి వీటిని కప్పులలో కూడా పెట్టొచ్చు.

మేత ఇచ్చే పద్ధతులు

సులభంగా మన ఇంట్లోనే దొరిచే ఆకులు, వ్యర్థ కూరగాయలు, గింజలు మేతగా వేసి కుందేళ్లను పెంచొచ్చు.

కుందేళ్లు అన్ని రకాల తృణధాన్యాలను ఇష్టపడతాయి. చిక్కుళ్లు, పచ్చిరొట్ట రకాలైన డెస్మంతస్, పశువులకు వేసే పచ్చిగడ్డి, అగాతి, వంటింటి వ్యర్థ పదార్థలైన క్యారెట్, క్యాబేజీ ఆకులు, ఇతర కాయకూరల వ్యర్థాలను కూడా అవి ఇష్టపడతాయి. కుందేళ పళ్లు నిరంతరంగా పెరుగుతూ ఉంటాయి. చిక్కని ఆహారంతో మాత్రమే కుందేళ్ల పెంపకం అసాధ్యం. కుందేళ్లకు మేత కచ్చితంగా సమయం ప్రకారం ఇవ్వాలి. ఆలస్యమైతే అవి బెంబేలుపడి, నీరసించి బరువు తగ్గిపోతాయి. ఎక్కువ ఉష్ణోగ్రత వల్ల కుందేళ్లు పగటిపూట ఆహారం తీసుకోవు. రాత్రిపూట మాత్రం చురుగ్గా ఉంటాయి. అందుచే రాత్రి పూట కుందేళ్లకు ు పచ్చిరొట్ట ఆహారంగా పెడితే వ్యర్థం చేయకుండా తింటాయి. అందువల్ల ఉదయం పూట చిక్కని ఆహారం ఇవ్వాలి.

పౌష్టికాహారాన్ని చిన్న గుళికల రూపంలో ఇవ్వాలి. ఇలా ఇవ్వడం వీలుకాక పోయితే పౌష్టికాహారానికి నీటిని కలిపి చిన్న ఉండల రూపంలో ఇవ్వాలి. కిలో బరువున్న కుందేలుకు రోజుకు 40 గ్రాముల పౌష్టికాహారం, 40 గ్రాముల పచ్చిరొట్ట ఇవ్వాలి. ఎల్లప్పుడూ తాజాగా ఉండే పచ్చిరొట్టను మేతగా ఇవ్వాలి. పచ్చిరొట్టను బోనులో నేల మీద వేయకూడదు. బోనులో పక్క భాగాలలోపలకు ఉంచొచ్చు. కుందేళ్లకు రోజంతా పరి శుభ్రమైన నీటిని ఇవ్వాలి.

సంతానోత్పత్తి

బాయిలర్ కుందేళ్ల పెరుగుదల రేటు చాలా ఎక్కువ. మూడు నెలల వయస్సులోనే రెండు కిలోల బరువు పెరుగుతాయి. సంతతి పరిమాణం కూడా కుందేళ్లలో చాలా ఎక్కువే. సుమారు 8-12 వరకు ఉంటుంది. ఆడ కుందేలు 5-6 నెలలు, మగ కుందేలు 5-6 నెలలు వయస్సు వచ్చినప్పటికీ ఒక సంవత్సరం తర్వాతే సంతానోత్పత్తికి వినియోగించాలి. దీని వల్ల నాణ్యతగల కుందేళ్లను పొందొచ్చు.

రైతుల సందేహాలు | నిపుణుల సమాధానాలు

'మోనోక్రొటోఫాస్'తో ఆకుచుట్టు నివారణ

కాలిఫ్లవర్‌లో కుళ్లు తెగులు నివారణ ఎలా? - ప్రశాంత్, డిచ్‌పల్లి (నిజామాబాద్ జిల్లా)

ఇది నారుమడిలోనూ, నాటిన పొలంలోనూ ఆశిస్తుంది. దీని కారణంగా ఆకుల అంచుల నుంచి పసుపు రంగుకు మారుతాయి. ఈనెలు నల్లబడి కాండం కుళ్లిపోతుంది. ఒక్కోసారి ఇది పువ్వులకు కూడా వ్యాపించి పూత రాలిపో తుంది. దీని నివారణకు లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి మొక్క మొదలు చుట్టూ తడిపాలి.

వరిలో నల్లగింజలు వస్తున్నాయి. ఏం చేయాలి? - నాగబాబు, సూర్యాపేట (హుజూర్‌నగర్ జిల్లా)

కంకి నల్లి పొట్టదశలో ఆశిస్తుంది. దీంతో కంకులు బయట పడ్డాక గింజల మీద నలుపు మచ్చలు ఏర్పడి నాణ్యత కోల్పోతాయి. ఆకు అడుగు భాగాన ఈనెలపై, ఆకు తొడిమలపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. పురుగు లక్షణాలు గుర్తించిన వెంటనే లీటరు నీటిలో 2 మి.లీటర్ల ప్రొఫెనోఫాస్ లేదా 5 మి.లీటర్ల డైకోఫాల్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ ఎలా? - రాము, బీమని (మంచిర్యాల జిల్లా)

కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను పూతను చుట్టగా చుట్టుకొని, లోపల ఉండి గీకి తింటాయి. దీని వల్ల ఆకులు తెల్లగా కనిపిస్తాయి. నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల మోనోక్రొటోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

వేరుశనగలో జిప్సం మోతాదు ఎంత ఉండాలి? - రాములు, బిజినేపల్లి (నాగర్‌కర్నూల్ జిల్లా)

ఎకరానికి 200 కిలోల జిప్సం తొలి పూత సమయంలో మొక్కల మొదళ్ల దగ్గర సాళ్లల్లో వేయాలి.

పురుగు మందులతో పైలం

- పురుగు మందులు కలిపేటప్పుడు చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు ధరించాలి.
- పురుగు మందలు పిచికారీ చేస్తున్న సమయంలో రైతులు, రైతు కూలీలు బీడీలు, సిగరెట్లు, చుట్టలు తాగొద్దు.
- గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయొద్దు.
- కళ్లు, నోరు, ముక్కు, ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా చేతులతో రుద్దొద్దు.
- భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- మందులను పిచికారీ చేసిన తర్వాత ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతుక్కోవాలి.
- పిచికారీ సమయంలో శరీరం కనిపించకుండా రక్షణ దుస్తులు ధరించాలి.
- క్రిమి సంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.
- విషప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- నాటు వైద్యుడిని సంప్రదించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దు.
- పురుగు మందులు కలిపిన ద్రావణం డబ్బా, సీసాను కాల్వలు, చెరువుల్లో వేయరాదు. వాడిన డబ్బాలకు రంధ్రం చేసి దూరంగా ఉంచాలి.



అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్: 8332995392, kisan@navatelangana.com

ప్రపంచ కప్‌లో భారత అంపైర్లు

న్యూఢిల్లీ : అండర్ 19 ప్రపంచ కప్ అంపైర్ల బృందంలో ఇద్దరు భారతీయులకు చోటు లభించింది. భారత అంపైర్లు అనిల్ చౌదరి, సీకే నందన్‌లు ఈ నెల 13 నుంచి న్యూజిలాండ్‌లో జరుగనున్న అండర్ 19 ప్రపంచ కప్‌లో అంపైరింగ్ బాధ్యతలు నెరవేర్చనున్నారు. ఈ మేరకు ఐసీసీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అనిల్ చౌదరి ఇటీవల భారత్, శ్రీలంక సిరీస్‌లో మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన విషయం తెలిసిందే.



మున్రో రికార్డు శతకం

- తుది టీ20 పోరులో విండీస్‌పై కివీస్ ఘనవిజయం
- 2-0తో సిరీస్ సొంతం

మౌంట్ మాంగనుయి : కొలిన్ మున్రో (104, 53 బంతుల్లో 3 ఫోర్లు, 10 సిక్స్‌లు) శతక్కొట్టడంతో తుది టీ20 పోరులో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ 119 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 2-0తో టీ 20 సిరీస్ వశం చేసుకున్నది. మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ రద్దయిన సంగతి తెలిసిందే. టెస్టు సిరీస్‌ను 2-0తో నెగ్గిన కివీలు, వన్డే సిరీస్‌లో సైతం విండీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేశారు. బుధవారం జరిగిన మూడో టీ20 పోరులో టాస్ నెగ్గిన న్యూజిలాండ్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. ఓపెనర్లు మార్టిన్ గప్టిల్ (63), కొలిన్ మున్రో (104)లు వెస్టిండీస్ బౌలర్లను ఆటాడుకున్నారు. రెండో టీ20లో 23 బంతుల్లో 66 పరుగులు బాదిన మున్రో, ఆఖరి పోరులో ఏకంగా అదే జోరు కొనసాగించి టీ20లో మూడో శతకం సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. 10 సిక్సర్లతో విరుచుకుపడిన మున్రో.. గప్టిల్ తోడుగా శతక భాగస్వామ్యం నమోదు చేశాడు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి న్యూజిలాండ్ 243 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో కరీబియన్ ఓపెనర్లు క్రిస్ గేల్ (0) , వాల్టన్ (0) నిరాశపర్చారు. ఆండ్రె ఫ్లెచర్ (46) మినహా అంతా విఫలమయ్యారు. 17 ఓవర్లలోపే అన్ని వికెట్లు కోల్పోయి 124 పరుగులే చేయగలిగారు. కివీ బౌలర్లలో టిమ్ సౌథి మూడు వికెట్లు పడగొట్టాడు. ట్రెంట్ బౌల్ట్, ఇష్ సోధిలు చెరో రెండు వికెట్లు కూల్చగా, అరుణ్ కిచెన్‌కు ఒక వికెట్ దక్కింది. శతక వీరుడు మున్రో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

ఎవరెక్కడ, తేలేది నేడే

ముంబయి : ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఏ ఆటగాడిని అట్టిపెట్టుకోనున్నాయి అనే సంశయానికి నేడు తెరపడనున్నది. ఇప్పటికే జట్ల యజమాన్యాలు ఎవర్ని అట్టిపెట్టుకోవాలి, ఎవర్ని రైట్ టు మ్యాచ్ ద్వారా జట్టులో ఆడించాలి అనే విషయంపై ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. అట్టిపెట్టుకునే ఆటగాళ్ల వివరాలు నేడు జట్లు ఐపీఎల్ పాలక మండలికి అందించనున్నాయి. ఈ తతంగాన్ని స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.



యుకీ, రామ్‌కుమార్ నిష్క్రమణ

- మహారాష్ట్ర ఓపెన్

పుణె : వైల్డ్ కార్డ్ ఎంట్రీతో మహారాష్ట్ర ఓపెన్‌లో అడుగు పెట్టిన భారత టెన్నిస్ ఆటగాళ్లు యుకీ, రామ్‌కుమార్‌లు ఇంటిముఖం పట్టారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచుల్లో ఓడిపోయారు. యుకీ బాంబ్రీ ఎనిమిదో సీడ్ హర్‌బర్ట్ (ఫ్రాన్స్) చేతిలో 6-4, 3-6, 4-6తో ఓడాడు. తొలి గేమ్ నెగ్గినా తదుపరి గేమ్‌లలో చేసిన తప్పిదాలకు మూల్యం చెల్లించుకున్నాడు. మరో పోరులో రామ్‌కుమార్ రామనాథన్.. టాప్ సీడ్ మారిన్ సిలిచ్‌కు వరుస సెట్లలో దాసోహమయ్యాడు. 6-4, 6-3తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అయితే దివిజ్ శరణ్ జంటగా డబుల్స్ బరిలో దిగిన యుకీ 6-2, 6-2తో కావ్‌చిక్, దీరె జోడీపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు.

ఢిల్లీ గెలుపు

చెన్నైతో పీబీఎల్ పోరు

లక్నో : ఉత్కంఠ పీబీఎల్ పోరులో ఢిల్లీ డాషర్స్ 3-0తో చెన్నై స్మాషర్స్‌పై గెలుపొందింది. తొలుత పురుషుల డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ '-1' స్కోరుతో ఉండగా వాంగ్ వింగ్‌కీ విన్సెంట్ విజయంతో స్కోరు సున్నా అయింది. మహిళల సింగిల్స్‌లో సింధుపై 11-15, 15-13, 15-14 సంగ్ జీహ్యూన్ గెలుపొందింది. మరో పురుషుల సింగిల్స్‌లో సైతం 2-0తో గెలుపొందిన ఢిల్లీ జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌ను ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న చెన్నై పోరు డ్రా చేసుకునేలా కనిపించింది. అడకాక్‌కు గాయం అవటంతో ఆధిక్యంలో ఉన్న పొన్నప్ప జోడీ విజేతగా నిలిచింది. దీంతో 3-0 విజయం ఢిల్లీ పరమైంది.

తొలి రోజే కీలకం

కొత్త బంతితో రాణిస్తేనే గెలవగలమన్న మాస్టర్ బ్లాస్టర్స్

నవతెలంగాణ-ముంబయి

కోహ్లి సేనకు సచిన్ సలహాలు



టీమ్ ఇండియాకు ఏడాది ఆరంభంలోనే పెను సవాలు ఎదురుచూస్తోంది. దక్షిణాఫ్రికా పర్యటనలో మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ జనవరి 5న కేప్‌టౌన్‌లో మొదలవనున్నది. సఫారీ గడ్డపై ఆడబోతున్న కోహ్లి సేనకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పలు కీలక సూచనలు చేశాడు. కొత్త బంతితో రాణించటమే భారత గెలుపుకు బాటలు వేయగలదని మాస్టర్ బ్లాస్టర్ తెలిపాడు. తొలి రోజు ఆట ఎంతో కీలక మన్న సచిన్ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్ వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. సచిన్ తెలిపిన విషయాలు అతని మాటల్లోనే..

'నేను తొలిసారి దక్షిణాఫ్రికా వెళ్లినపుడు, అక్కడ మాకోసం ఎలాంటి పరిస్థితులు ఎదురుచూస్తున్నాయో తెలుసుకునేందుకు ఎంతో సమయం పట్టలేదు. తొలి రోజునే వారి ఆట స్థాయి తెలిసింది. నిజం చెప్పాలంటే దక్షిణాఫ్రికా బోర్డ్ ఎలెవన్‌తో ఆడిన ప్రాక్టీసు మ్యాచ్‌లోనే మాకు గట్టి సవాలు ఎదురైంది. వారి ద్వితీయ శ్రేణి జట్టు అంత పటిష్టంగా ఉందంటే.. సీనియర్‌లు ఇంకెంత రాటుదేలి ఉంటారో ఊహించవచ్చు. అన్ని విభాగాల్లోనూ సఫారీలు బలమైన పోటీదారులే.

సఫారీలెప్పుడు బ్యాలెన్స్ కోల్పోరు. అదే వారి ప్రధాన బలం. ఆల్‌రౌండర్‌ల ఆధిపత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆల్‌రౌండర్‌లు అనగానే బ్యాటింగ్ సహా బౌలింగ్ చేయగలగటం మాత్రమే కాదు. ఫీల్డింగ్‌లోనూ అసమాన వేగం, చాకచక్యం కల్గి ఉండటం. నేను చూసిన మేటి ఆల్‌రౌండర్‌లలో జాంటీ రోడ్స్ ప్రథముడు. ఇన్నేండ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో ఎందరో అద్భుత ఫీల్డర్లను చూశా. పాంటింగ్, గిబ్స్‌లు అమోఘమైన ఫీల్డర్లు. కానీ జాంటీది ఎవరికీ అందని స్టైల్. అలాగే ఆల్‌రౌండర్ అంటే అన్ని విభాగాల్లో మెరుగ్గా ఉండాలి. ప్రస్తుతం భారత జట్టు ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో అద్భుతంగా ఆడుతున్నారు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య కోహ్లి సేనకు అదనపు బలం. అతను 17 నుంచి 18 ఓవర్లు సునాయసంగా బౌలింగ్ చేయగలడు. 7 లేదా 8 స్థానంలో దిగి పరుగులు రాబట్టగలడు. ఈ సిరీస్ పాండ్యకు ఎంతో కీలకం. అతను తన కెరీర్‌లోనే ఉత్తమ ప్రదర్శన చేయాలి. సీమర్‌గా, బ్యాట్స్‌మన్‌గా పాండ్య ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఫీల్డింగ్‌లో చిరుతలా కదిలే వేగం అతని సొంతం. అతన్ని కోహ్లి ప్రధానం ఆయుధంలా వాడతానటంలో సందేహం లేదు.

తొలి స్పెల్ అత్యంత కీలకం. కొత్త బంతిని ఎలా ఎదుర్కొంటాం లేదా కొత్త బంతితో ఎలా బౌలింగ్ చేస్తాం అనేది ప్రాముఖ్యమైన అంశం. అదే విజయావాకాశాలను మెరుగు చేయగలదు. కొత్త బంతిని సరిగ్గా వాడుకోగలిగితే ప్రత్యర్థికి సరైన సవాలు విసిరినట్టే. తొలి రోజు ప్రదర్శనపై మిగిలిన ఆటంతా ఆధారపడి ఉంటుంది. ఇటీవల భారత్ శ్రీలంకతో (కోల్‌కతలో) ఆడిన టెస్టు పిచ్ వేరు. దక్షిణాఫ్రికాలో కోహ్లి సేన కోసం ఎదురుచూస్తోన్న పిచ్‌లు వేరు. వ్యత్యాసం ఉంటుంది. కొత్త బంతి ఆయా పిచ్‌లపై ఎలాంటి ఫలితాన్నిస్తుందన్నది ఇప్పుడే చెప్పలేం. 2011లో కేప్‌టౌన్‌లో నేను ఆడినప్పుడు పిచ్‌కు బ్యాటింగ్ అనుకూలంగా ఉన్నది. ఇప్పుడున్న పిచ్ పరిస్థితిని మ్యాచ్‌కు ముందే అంచనా వేయలేం. ఉపఖండ పిచ్‌లపై సైతం కొత్త బంతి కీలకమే. అయితే, 18 నుంచి 20 ఓవర్ల మధ్య బ్యాట్స్‌మన్‌కు అసలు సమస్య మొదలవుతుంది. వికెట్ ఫ్లాట్‌గా ఉంటే 40 నుంచి 50 ఓవర్ల మధ్య బంతి విపరీతంగా స్వింగ్ అవుతుంది. అయితే మన పరిస్థితులకు భిన్నమైన వాతావరణంలో భిన్న పిచ్‌లపై బ్యాట్స్‌మన్ ఎలా నిలదొక్కుకుంటారో చూడాలి. ఉపఖండ బ్యాట్స్‌మన్‌కు విదేశీ పర్యటనల్లో ఇదే అసలైన సవాలు.

ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగే ఆలోచన మేమెప్పుడూ చేయలేదు. కపిల్ దేవ్ నాయకత్వంలోనూ అది జరుగలేదు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై బంతులు మంచి లైన్ అండ్ లెంగ్త్‌తో దూసుకొస్తాయి. అంచేత స్లిప్స్‌లో ఫీల్డింగ్ ధృడంగా ఉండాలి. ఫీల్డింగ్‌లో చిన్న పొరపాటు మొత్తం మ్యాచ్‌నే మలుపు తిప్పుతుంది. బ్యాటింగ్ చేస్తోన్నా, ఫీల్డింగ్ చేస్తోన్నా క్రమశిక్షణ ముఖ్యం. అది ఒకరు నేర్పిస్తే అలవడేది కాదు. స్వతహగా రావాలి. ఏ బంతి ఆడాలి ఏ బంతి వదలాలి అనే ఆలోచనలు బ్యాట్స్‌మన్ ఏకాగ్రతపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఈ విషయంలో ఆటగాళ్లు ఎవరికి వారే తగురీతిలో మానసికంగా సంసిద్ధులై ఉండాలి. టాప్ ఆర్డర్ లైన్‌కు దూరంగా ఆడటంలో జాగ్రత్త వహించాలి. ఉత్తమ బ్యాట్స్‌మన్ చేతుల్ని తనకు దగ్గరగా ఉంచుకుని బంతిని ఆడతాడు. ఉత్తమ బౌలర్ బ్యాట్స్‌మన్ తన చేతుల్ని దూరంగా పెట్టి బంతిని తాకడానికి ప్రయత్నించేలా ట్రిక్ చేస్తాడు. ఈ విషయాన్ని బ్యాట్స్‌మెన్, ప్రత్యేకించి ఓపెనర్లు గ్రహించాలి. విదేశాల్లో ఆడినపుడు భారత్‌కు పేస్ భయం పట్టుకుంటుందనేది అపోహ మాత్రమే. నేను, సెహ్వాగ్, గంగూలీ, రాహుల్, లక్ష్మణ్ అగ్ర శ్రేణి పేస్ బౌలింగ్‌ను ఎదర్కొన్నాం. పరుగులు చేశాం. ప్రస్తుత టీమ్ ఇండియా సైతం అద్భుత ప్రదర్శన చేయగలదన్న నమ్మకం ఉన్నది.'



- గెలుపు కోసం ఇంగ్లాండ్ ఎదురుచూపు
- నేడే యాషెస్ తుది సమరం

సిడ్నీ : మహా బూడిద పోరులో ఆఖరుదైన ఐదో టెస్టు నేటి నుంచే ప్రారంభం కానున్నది. చివరి మ్యాచ్ నెగ్గి పరువు కాపడుకునే యోచనలో ఇంగ్లాండ్ ఉండగా.. తుది పోరులోనూ దూకుడు కొనసాగించాలని ఆస్ట్రేలియా చూస్తోన్నది. ఇదివరకే 0-3తో సిరీస్ కోల్పోయిన ఇంగ్లాండ్.. నాల్గో పోరు డ్రాతో ఆత్మవిశ్వాసం మూటగట్టుకున్నది. సిడ్నీ టెస్టులో ఓపెనర్ అలైస్టర్ కుక్ మరోసారి మెరుపులు చూపాలని కెప్టెన్ జో రూట్ ఆశిస్తున్నాడు. డావిడ్ మలన్, బెయిరిస్టోలు మిడిల్ ఆర్డర్‌లో కీలకం. బౌలింగ్ బృందం సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఉన్నది. భీకర ఫామ్‌లో ఉన్న ఆసీస్‌ను ఓడించాలంటే ఇంగ్లాండ్ ఆటగాళ్లు శక్తి వంచన లేకుండా ఆడాలి. కంగారూల జట్టులో స్మిత్ ఒంటి చేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పగలడు. ఓపెనర్లు వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లు సైతం క్రీజులో కుదురుకుంటే చెలరేగిపోతారు. బంతితోనూ అతిథి జట్టు పటిష్టంగా ఉన్నది. నేటి నుంచి సాగే తుది పోరులో ఇంగ్లాండ్ నెగ్గి పరువు నిలుపుకుంటుందా.. వేచి చూడాల్సిందే!.



తైక్వాండోలో పతకాల పంట

- క్రీడాకారులను అభినందించిన సాట్స్ ఛైర్మెన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తైక్వాండో పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. డిసెంబర్ 29 నుంచి 31 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్పూర్ పట్టణంలో జరిగిన 37వ నేషనల్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్-2017లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన మసీరా సారఖాన్(15) బంగారం పతకం సాధించింది. డిసెంబర్ 20 నుంచి 25 వరకు నల్లగొండ జిల్లాలో జరిగిన 63వ నేషనల్ స్కూల్ గేమ్స్ తైక్వాండో చాంపియన్‌షిప్-2017 పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు వివిధ విభాగాల్లో మూడు వెండి పతకాలు, ఆరు కాంస్య పతకాలు సాధించారు.


బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారులందరినీ సాట్స్ కార్యాలయంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం శ్రీనివాస్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు, తైక్వాండో ప్రతినిధులు సూర్యం, గణేశ్, కోచ్ సురేందర్ పాల్గొన్నారు.

ఆంధ్ర ఔట్

హైదరాబాద్ : 65వ సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్ర జట్లు ఓడాయి. పురుషుల, మహిళల జట్లు ప్రీ క్వార్టర్స్‌లో బరి నుంచే వెనుదిరిగాయి. బుధవారం జరిగిన కబడ్డీ పోరులో ఉత్తరాఖండ్ 52-31తో ఆంధ్ర పురుషుల జట్టుపై గెలిచింది. కేరళ చేతిలో 21-31తో మహిళల జట్టు ఓటమి పాలైంది. ఇండియన్ రైల్వే, ఉత్తర్ ప్రదేశ్‌ల మధ్య జరిగిన క్వార్టర్స్ సమరంలో రైల్వేస్ జట్టు 39-25తో నెగ్గి సెమీస్ చేరుకున్నది.



కాల్చిచంపినా.. ఊరిడ్సిపోం



- మా భూముల జోలికొస్తే... ఊరుకోం
- భూమి లేకుండా సాగునీరు మాకెందుకు ?
- ఇదీ...గోకారం ప్రజల గోడు

మీ కొలువులూ, ఉపాధి మాకొద్దు..కలోగంజో తాగి బతుకుతం !

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

నార్లాపూర్‌కు సాగునీరు తీసుకెళ్లడానికి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజక వర్గంలోని గోకారం, ఎర్రవెల్లి వద్ద గోకారం రిజర్వాయర్ చేపడుతున్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా నల్లగొండ జిల్లా డిండి మండలంతో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరందించేందుకు నార్లాపూర్ పథకాన్ని చేపడుతున్నారు. ఈ పథకంలో భాగంగా నార్లాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా ఉల్పరకు నీరందుతుంది. దీంతో అక్కడ ఐదు గ్రామాలకు చెందిన 1600 ఎకరాలు ముంపునకు గురి కానున్నాయి. పోతిరెడ్డిపల్లి, సిద్ధాపూర్, జాజాల, ఉల్పర, దాసర్లపల్లి గ్రామాలకు చెందిన భూములూ మునగనున్నాయి. ఈ నీరు అక్కడి నుంచి సింగరాజిపల్లి, ఎర్రవెల్లికి చేరుకుంటాయి. ఇక్కడ సుమారు 1650 ఎకరాల సాగు భూములు మునగనున్నాయి. అక్కడి నుంచి ఇర్విన్‌కి వెళ్లి అక్కడి నుంచి రెండు భాగాలుగా విడిపోయి నల్లగొండ జిల్లా శివన్నగుడెంకు చేరుకుంటాయి. గోకారం దగ్గర నిర్మించే రిజర్వాయర్‌లో 1650 ఎకరాలు నీట మునగనున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి నియోజక వర్గంలోని ఎర్రవెల్లి తండా మొత్తం నీటిలో ముంపునకు గురికానుంది. గోకారం, ఎర్రవెల్లి గ్రామాల్లో మొత్తం 500 కుటుంబాలు, 2000లకు పైగానే జనాభా ఉంది. ఇక్కడ ప్రాజెక్టులు నిర్మాణం చేస్తే.. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు కానీ మా భూములు మొత్తం కోల్పోయి మిగితా వారికి సాయం చేయాలంటే మాత్రం కుదరదని ఆ గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సాగు భూములు పోతే ఎట్ల బతకాలి



నాకు 17 ఎకరాల సాగు భూమి ఉంది. రెండు బోర్లున్నాయి. ఐదెకరాలలో ఏడాదికి రెండు పంటలు పండుతాయి. నాకు ఐదుగురు పిల్లలున్నారు. తండాలో రూ. 30 లక్షలు విలువ చేసే ఇల్లు కూడా ఉంది. మా పొలంలో రిజర్వాయర్ నిర్మాణం చేస్తారంట. మా ఇల్లు, భూమి పోయిన తర్వాత మేము ఏడికిపోవాలి. ఎక్కడ బతకాలి. పోలీసులు కాల్చి చంపినా సరే మాభూముల్ని వదులుకోం.

-రెడ్యానాయక్, గోకారం సర్పంచ్


నమ్ముకున్న భూమి మమ్ములను ఏనాడూ ముంచలేదు



నాకు ఏడెకరాల సాగు భూమి ఉంది. ఇందులో పశువులు, మేకలు అన్ని బతికేవి. ఏడాది పోయినా మరో ఏడాది పంట వచ్చేది. ఇప్పుడు మా భూములు మునిగితే మేము ఎలా బతకాలి. మా బిడ్డల్ని తీసుకొని యాడికి పోవాలి. కాల్వలు వస్తే.. నీళ్లు వస్తాయనుకున్నాం. కానీ కాల్వలతో పాటు రిజర్వాయర్లు వచ్చి మాభూములు మునిగిపోతాయని కలలో కూడా అనుకోలేదు. ప్రభుత్వం మాకు తెలీకుండా సర్వేలు చేయడం సరికాదు.

-మాణిక్యం, ఎర్రవెల్లి తండా


చంపి తీసుకోండి



మాకు ఏ కాల్వ నీళ్లూ వద్దు. మెట్ట పంటలో సజ్జ, పత్తి, వరి పంటలు వేసుకొని ఏ అప్పూ లేకుండా బతుకుతున్నం. ఇప్పుడు భూములు పోయిన తర్వాత చెట్టుమీది పక్షుల్లా చెదిరిన ట్టుగా ఉంటుంది. ఉన్న గూడు పోయి సాగు భూమి లేక ఈ భూమి మీద మేము ఎలా బతకాలి. ముందు మమ్ముల్ని చంపి మా భూములను తీసుకెళ్లండి.

- దామర్ల మల్లయ్య, గోకారం

నాలుగు రెట్ల పరిహామివ్వాలి



అవసరం లేకున్నా..భూములు తీసుకోవడం సరికాదు. అత్యవసరమైతేనే తీసుకోవాలి. ఆ భూములకు మార్కెట్ రేటు కంటే నాలుగు రెట్ల పరిహారమివ్వాలి. ఇంటికో ఉద్యోగమివ్వాలి. ఉద్యోగులకున్న హక్కులను రైతులకూ వర్తించేలా చర్యలు తీసుకోవాలి. భూములు కోల్పోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలి. లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు.

-నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

"70 ఏండ్ల సంది గీ ఊర్లనే పడి ఉంటున్నం. రోగమొచ్చినా..నొప్పొచ్చినా ఎవ్వడూ మా దిక్కు మళ్లిచూడలే. పలుకరియ్యలే. సర్కారోళ్లు, బ్యాంకోళ్లు పట్టించుకున్న పాపానపోలేదు. గిప్పడొచ్చి ఉన్నపలంగా ఊరిడ్సిపొమ్మంటున్నరు. మీరిచ్చే కొలువులొద్దు. చూపే ఉపాది వద్దు. మా భూముల జోలికొస్తే ఊరుకోం. భూములు లేకుండా మాకు సాగు నీరెందుకు. మా కోసం ఎవరూ.. త్యాగాలు చేయలేదు. మేము ఎవరి కోసమూ విలువైన భూములు వదులుకోం. తుపాకులు కనతకు గుర్తిపెట్టినా.. వెనక్కిపోం. కాల్చిచంపినా గీడ్నే ఉంటున్నంగానీ ఊరిడ్సిపోం" ఇదీ గోకారం, ఎర్రవెల్లి తండా వాసుల గోడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.